thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 235 కరీంనగర్ ఆదివారం, 2 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.




# ఎన్‌డీఏ కూటమియే...
# బీహార్ కా బాద్‌షా...!
## తేల్చేసిన టైమ్స్ నౌ, జేవీసీ సర్వే రిజల్ట్!!

బీహార్ ఎన్నికలు వచ్చే నెలలో రెండు విడతలలో జరగబోతున్నాయి. ఇప్పుడు ఈ ఎన్నికల పైన దేశవ్యాప్తంగా అందరి చూపు మళ్లింది. ఇందుకు గల కారణం ఉత్తరాదిలో బిజెపి దీర్ఘకాలికంగా పట్టు ఉన్నది. దీంతో ఈసారి అక్కడ బిజెపిపార్టీ పట్టు కొనసాగిస్తుందా? లేకపోతే మహాకూటమి రాబోతోందో అనే చర్చ అందర్నీ ఉత్కంఠ బరిచేలా చేస్తోంది. అందుకు తగ్గట్టుగా అక్కడ సమీకరణాలు వేగంగా మారిపోతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలోనే తాజాగా వెలువడిన ఒక సర్వేలో కొన్ని విషయాలు బయటపడ్డాయి. బీహార్ ఎన్నికలపై ఓటర్ల నాడీ ఎలా ఉందని అంశం పైన ఓట్ వైబ్ అనేటువంటి సర్వే సంస్థ తాజాగా బీహార్ ఎన్నికల సర్వే ఫలితాలను తెలియజేసింది. ఇందులో బిజెపి, జెడియూతో కూడిన ఎన్డీఏ కూటమి, అలాగే ఆర్జెడి, కాంగ్రెస్ తో కూడిన మహాకూటమికి మధ్య హోరాహోరీ గానే ఉంటుందంటూ తెలియజేస్తోంది. సర్వే తెలిపిన ప్రకారం మహాకూటమికి మద్దతుగా 34.7 శాతం మంది ఉన్నారని, ఎన్డీఏకు మద్దతుగా 34.4 శాతం మంది ఉన్నారని, ప్రశాంత్ కిషోర్ పార్టీకి 12.3% మద్దతిస్తున్నారని మిగిలిన 10 శాతం మంది ఎటు తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారంటూ తెలుపుతున్నారు. ఈ సర్వేలో పరిశీలకమైన కారణాలను తెలియజేస్తూ .. ఛత్ పండుగ తర్వాత వలసలు వెళ్లిన కార్మికులు తిరిగి వచ్చి మళ్ళీ ఎన్నికలలో ఓటు వేస్తారని అంచనా ఉన్నదట.వీరి ఓటు బీహార్లో చాలా కీలకంగా ఉండబోతున్నాయి. 51 శాతం మంది ఓటర్లు కులం కంటే పార్టీని చూసి ఓటు వేస్తామని, 27% మంది పార్టీ కంటే కులమే అన్నట్లుగా తెలుపుతున్నారట. అలాగే తేజస్వి యాదవ్ ఇచ్చిన హామీ ఇంటికోక ప్రభుత్వ ఉద్యోగం,ఎన్డీఏ కూటమి రూ .10 రూపాయల కంటే ఈ హామీ ఎక్కువ ప్రభావం చూపుతోందని సర్వేలో తెలిపారు. ప్రశాంత్ కిషోర్పార్టీ కి 12.3 % మంది ఓటు వేస్తామని చెబుతున్నప్పటికీ అందులో 48 శాతం వరకు పార్టీ గుర్తు తెలియని వారే ఉన్నారట. మరి బీహార్ ఎన్నికల పైన ఎవరిది పై చేయి అవుతుందో చూడాలి.




హైదరాబాద్, నవంబర్ 1: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. 'అహనా పెళ్లంట' మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని కౌంటర్ ఇచ్చారు. సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి.. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని ధ్వజమెత్తారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి బీఆర్ఎస్, కేటీఆర్ పై నిప్పులు చెరిగారు మహేష్ గౌడ్. బీఆర్ఎస్ పార్టీ రుణం తీర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రపతి పదవి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు మహేష్ గౌడ్. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళు ఇచ్చే రూ.5వేలు తీసుకోండి.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కేటీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మెజార్టీ అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసి ఓట్లు అడుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబంలో వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని మండిపడ్డారు.

# జూబ్లీహిల్స్‌లో వ్యూహం మార్చిన బీఆర్ఎస్
## తాజా సర్వేతో అలెర్ట్..!!



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. పోలింగ్ సమయం సమీపించే వేళ కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. సర్వే నివేదికల ఆధారంగా పార్టీల నేతలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ కనిపిస్తోంది. ఎవరికి వారు గెలుపు పైన ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మంత్రులను రంగంలోకి దించుతోంది. బీఆర్ఎస్ తాజా నివేదిక ల ఆధారంగా వ్యూహం మార్చింది. కొత్త ప్రణాళికలతో ఓటర్ల వద్దకు వెళ్తోంది. దీంతో... గెలుపు ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠగా మారుతోంది. జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్య తాజా సర్వే నివేదికల మేరకు నువ్వా నేనా అన్నట్లుగా పోటీ సాగుతోంది. రెండు పార్టీల నుంచి కీలక నేతలు ప్రచారంలోకి దిగారు. కాంగ్రెస్ మంత్రులను ప్రతీ వార్డు బాధ్యతలు అప్పగించి.. గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సమయంలో మాజీ సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్ పైన చేయించిన సర్వేల ఆధారంగా ప్రచారం.. పోల్ మేనేజ్ మెంట్ పైన కీలక నేతలకు దిశా నిర్దేశం చేసారు. అందులో భాగంగా కేటీఆర్ – హరీష్ ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్ లో వచ్చిన మార్పు.. కాంగ్రెస్ పాలనలో జరిగిన నష్టం గురించి ఎక్కువగా వివరిస్తున్నారు. మైనార్టీ ఓట్ బ్యాంక్ ఇక్కడ గెలుపు ఓటముల్లో కీలకంగా మారటంతో.. ఆ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేటీఆర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన పైనే ఎక్కువగా విమర్శ లు చేస్తూ.. తమ పాలనతో పోల్చి ఓటర్లకు అర్దమయ్యే విధంగా వివరిస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రగతి పాలనను, గత రెండేళ్ల కాంగ్రెస్ మోసాల పాలనను బేరీజు వేసుకొని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు తమ ఓటు వేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, బుల్డోజర్ పాలన నడుస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. మైనార్టీ ప్రాతినిధ్యం లేని తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలోనే ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. ఆరుగురు ఎమ్మెల్సీలకు అవకాశం ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వలేదు. ఈ విషయాలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్.. బీజేపీ కలిసి పని చేస్తున్నాయని ప్రతీ చోట విమర్శిస్తున్నారు. హరీష్ బస్తీల పైన ఎక్కువగా ఫోకస్ చేసారు. దీంతో, హోరా హోరీగా సాగుతున్న ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నా.. తుది ఫలితం పైన ఉత్కంఠ నెలకొంది.

# రేవంత్ టీంలో చేర్పులు.. మార్పులు..!
## ఊహల పల్లకీలో ఆశావహులు!




## ఆందోళనలో 'ఆ మంత్రులు'!!

హైదరాబాద్ : పార్టీలోనూ.. ప్రభుత్వంలోనూ నెమ్మదిగా పట్టు పెంచుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన ముద్రను చాటేందుకు తగిన సమయం కూడా వెయిట్ చేస్తున్నారు. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు చూస్తే ఇందులో నిజముందన్న విషయం అర్థమవుతుంది. గతంతో పోలిస్తే.. ఇటీవల కాలంలో మంత్రుల మీద పట్టు పెంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. కట్టుదాటిన మంత్రులను కాబినెట్ భేటీలో ఆగ్రహాన్ని వ్యక్తం చేయటం.. ఈపరిస్థితుల్ని వెంటనే మార్చుకోవాలని చెప్పటం తెలిసిందే. అదే సమయంలో పలువురు మంత్రుల పని తీరు ఏ మాత్రం బాగోలేదన్న ఫీడ్ బ్యాక్ అందుతున్న నేపథ్యంలో.. మంత్రివర్గ ప్రక్షాళన చేయాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ చేయాలన్న ఆలోచనలో రేవంత్ ఉన్నప్పటికి.. అందుకు తగిన వాతావరణం కోసం ఆయన నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రెండేళ్లు అవుతున్న వేళ.. తాను అనుకున్నది అనుకున్నట్లుగా చేయలేని పరిస్థితి. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం సీఎం రేవంత్ ను మరింత బలవంతుడిగా మారుస్తుందా? బలహీనుడ్ని చేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికే సీఎం రేవంత్ చేపట్టిన కార్యక్రమాలు ఆశించినంత ఫలితాన్ని ఇవ్వలేదన్న మాట వినిపిస్తూ ఉంటుంది. దీనికి కారణం.. మంత్రివర్గంలో ఉన్న మంత్రులు యాక్టివ్ గా లేకపోవటమే. అలాంటి వారిని దారికి తీసుకొచ్చేందుకు.. మిగిలిన వారికి భయం భక్తిని పెంచేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని రేవంత్ భావిస్తున్నారు. దీనికి తోడు.. మంత్రివర్గంలోని తీసుకోవాల్సిన అంశం నెలల తరబడి పెండింగ్ లో ఉంది. ఈ విషయంలోనూ మంత్రివర్గంలో చోటు లభిస్తుందన్న ప్రచారం జరిగిన నేపథ్యంలో ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో కొత్త వారిని చేర్చుకోవటం.. పని చేయని వారిని వదిలించుకోవటం అన్న దానిపై పెద్ద ఎత్తున కసరత్తు జరిగింది. దీనికి సంబంధించి కొన్ని పేర్లను జాబితాగా సిద్ధం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాల్ని అధిష్ఠానంతో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్.. రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ చర్చించినట్లుగా తెలుస్తోంది. వీరి వాదనతో అధిష్ఠానం ఏకీభవించినట్లుగా తెలుస్తోంది. పార్టీవర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితం సానుకూలంగా వస్తే.. ఆ వెంటనే కాబినెట్ పునర్ వ్యవస్థీకరణ దిశగా అడుగులు పడతాయని చెబుతున్నారు. దాదాపు ఐదుగురు మంత్రులు మంత్రివర్గం నుంచి ఉద్వాసన పలకటం ఖాయమన్న మాట వినిపిస్తోంది. అయితే.. కొత్తగా మంత్రి పదవులు పొందిన వారిని మినహాయించి.. పాత వారిపైవేటు పడుతుందని చెబుతున్నారు.

మొత్తంగా మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సానుకూల ఫలితం ఏర్పడితే.. అనంతరం ప్రభుత్వంలో చాలానే మార్పులు చూస్తారన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

చురకలు






## తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబరు1 : తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఇవాళ(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో హైకమిషనర్ ఆఫ్ కెనడా టు ఇండియా క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు.

స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డితో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ బృందం భేటీ...** అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మౌద్ మిక్వా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సుదర్శన్ రెడ్డి...** మరోవైపు.. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు సుదర్శన్ రెడ్డి. అలాగే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## దేవాలయ భూముల సంరక్షణ.. రేవంత్ సర్కారు కొత్త బిల్లు




హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణ దేవాదాయ భూముల రక్షణకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్, 1987 చాప్టర్ XI సవరణకు కసరత్తు చేస్తోంది. సెక్షన్స్ 83, 84 తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు బిల్లు ప్రవేశపెట్టనుంది. ట్రిబ్యునల్, కోర్టు కేసులతో దర్జాగా వేల ఎకరాలు కబ్జా చేస్తున్న వాళ్ల ఆటకట్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వందల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని వీటన్నింటిని పరిరక్షించాలని ప్రభుత్వం చూస్తోంది. కబ్జాకోరల్లో చిక్కుకున్న వేల కోట్ల విలువైన దేవాదాయ భూములు రక్షించేందుకు నడుంబిగించింది.

దేవాలయ, చారిటబుల్ సంస్థలకు చెందిన భూములు, భవనాల్ని ఎవరు ఆక్రమించినా వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. ఎండోమెంట్ అధికారులు, అవసరమైతే పోలీసు, హైడ్రా సాయంతో ఆక్రమణలు తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

## మియాపూర్‌లో ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ కూల్చేసిన హైడ్రా




హైదరాబాద్, సెప్టెంబర్ 1: భాగ్యనగరంలో కోట్ల రూపాయల విలువ చేసే మరో ప్రభుత్వ స్థలాల్ని రేవంత్ సర్కారు కాపాడింది. అక్రమ నిర్మాణాల విషయంలో దూకుడుగా వెళ్తోన్న హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చిన వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు చేసింది. తన పరిశీలనలో సదరు భవనం, నిర్మాణ స్థలం అక్రమమని తేలడంతో.. వెంటనే కూల్చివేసింది. దీంతో హైదరాబాద్ మియాపూర్‌లోని ఐదంతస్తుల భవనం నేలకొరిగింది. మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో భారీగా అక్రమ నిర్మాణాలు జరిగాయని గుర్తించించిన ఈ ఉదయం హైడ్రా ఐదంతస్తుల అపార్ట్ మెంట్ కూల్చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా భారీ సంఖ్యలో పోలీసులను మోహరించి పని పూర్తి చేశారు.

## మూడేళ్ల కాలంలో జూబ్లీహిల్స్ సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలంగాణ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రెహమత్ నగర్‌లో పర్యటించిన మంత్రి.. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో భారాస ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేక పోయిందని ఆరోపించారు.

తమ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపిస్తే.. మూడేళ్ల కాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. భాజపా, భారత రాష్ట్ర సమితిలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.



## ఈ నెల 3 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు

హైదరాబాద్: ఈ నెల 3 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అన్ని టెర్మినల్స్‌లో అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం ఉంటుందని మెట్రో రైలు యాజమాన్యం తెలిపింది. **ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో రైలు వేళలు...** సోమవారం నుంచి శుక్రవారం: ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.45 వరకు. శనివారం: ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు. ఆదివారం: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు.






## కోడిని వేలాడదీసి పచ్చడి మెతుకులు పెడుతున్నారు: కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 1: అహనా పెళ్లంట సినిమా తరహాలో రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయని.. కోడిని వేలాడదీసి పచ్చడి మెతుకులు పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ టీడీపీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ నాయుడు.. ఆయన సతీమణి, టీడీపీ నాయకురాలు సుజాతతో పాటు పలువురు నేతలు శనివారం నాడు గులాబీ పార్టీలో చేరారు. పెద్దఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆ నేతలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు కేటీఆర్. వేసిన నామినేషన్ విత్‌డ్రా చేసుకొని మరీ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తున్న ప్రవీణ్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. శ్రీనివాస్ నాయుడు చాలా కాలం నుంచి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని.. ఐదేళ్ల కిందటే రావాల్సిన నాయకుడు ఇప్పుడు వచ్చారని అన్నారు. మన పార్టీ నుంచి గెలిచి మేయర్ అయిన వ్యక్తి ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డే ఏ పనులు చేయట్లేదని.. ఇక మేయర్ మనకు ఏం పనులు చేస్తుందని దుయ్యబట్టారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని గ్యారెంటీ కార్డులు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించారని ఫైర్ అయ్యారు. ఆడబిడ్డ పెళ్లికి కేసీఆర్ లక్ష రూపాయలు ఇస్తే.. తులం బంగారం కూడా ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మాట తప్పారని అన్నారు. ఇప్పుడు తులం బంగారం ఇవ్వకపోగా.. మెడలో గొలుసు కూడా లాక్కెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ ఇస్తున్నామని చెప్పి భార్యకి ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి డబుల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కేసీఆర్ అమలు చేశారని.. అలాగే కేసీఆర్ కిట్ ఇచ్చారని కొనియాడారు. తమ హయాంలో ఆడపిల్ల పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇచ్చామని గుర్తు చేశారు. ఇలా ఎన్నో కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో జరిగాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు.. ఇలా అన్ని పథకాలు బంద్ అయ్యాయని ఆగ్రహించారు. ఎన్నికలు వస్తే ఎవరైనా ఏం చేస్తారో చెప్తారు.. కానీ బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పదవి ఇచ్చిందే ప్రజలు అని.. అది మర్చిపోయి రాజులా ఫీలవుతున్నారని విమర్శించారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ తోక కత్తరించేందుకు రెడీగా ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారని అన్నారు. అసలు కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ నాశనం చేశారని.. రెండేళ్లలో ఏం మంచిపని చేశారో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ఫైర్ అయ్యారు. హైడ్రా, బుల్డోజర్ పేరుతో పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఈ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ దుయ్యబట్టారు. బీసీ, ఎస్సీ డిక్లరేషన్ అంటూ నోటికొచ్చిన 420 హామీలు ఇచ్చారని మండిపడ్డారు. మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో చనిపోతే ఈ నెల 11న బైపోల్ ఎన్నిక వచ్చిందన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు కేసీఆర్ టికెట్ ఇచ్చారని చెప్పారు. భర్త చనిపోయి మాగంటి సునీత ఏడిస్తే.. దాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు డ్రామా అంటున్నారని చెప్పారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తే కూడా ఇంత అన్యాయంగా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డను అవమానిస్తున్న వారికి బుద్ధి చెప్పాల్సిందేనన్నారు. అధికారంలోకి రాగానే మేయర్, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరినా ప్రజలు తమతోనే ఉన్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ విజయంతోనే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలని.. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో మాగంటి సునీత ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు.

## ఆనందంలో పామాయిల్ రైతులు.. కారణమిదే




భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 1: తెలంగాణ రాష్ట్రంలో పామాయిల్ రైతులకు శుభవార్త అందింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్ ఎక్స్ ట్రాక్షన్ రేషియో 20.01 శాతం రికవరీ అయ్యింది. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ఓఈఆర్ నమోదు కావడంతో పామాయిల్ గెలల ధరలు పెరుగనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పామాయిల్ గెలల టన్ను ధర రూ. 19,400గా ఉంది. ఓఈఆర్ పెరగటంతో వచ్చే నెల నుంచి కొత్త ధర అమలులోకి రానున్నాయి. టన్నుకు 500 రూపాయలకుపైగా ధర పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇది పామాయిల్ రైతులకు పెద్ద ఊరటనిచ్చే వార్త అనే చెప్పుకోవచ్చు. ఓఈఆర్ పెరగడంతో ఆయిల్ ఫెడ్ అధికారులను , ఫ్యాక్టరీ సిబ్బందిని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అభినందించారు. పామాయిల్ రైతులకు మహర్దశ పట్టనుందన్నారు. ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణ మారనుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో పామాయిల్ రైతుల సమావేశంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఓఈఆర్ పెరగడం రాష్ట్ర పామాయిల్ రైతులకు శ్రమకు ప్రతిఫలం అని తెలిపారు. ఇక ఆయిల్ ఎక్స్ ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్) పెరగటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## భారత ఆర్మీ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు: కిషన్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 1: కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్ మీద కాంగ్రెస్ పార్టీ ప్రేమ, అభిమానం అజరామరమని.. గురువు నుంచి శిష్యుడి దాకా అదే వ్యామోహం అంటూ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి స్పందిస్తూ.. సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్‌ను చులకన చేస్తూ భారతీయ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతూ భారత ఆర్మీని అగౌరవ పరుస్తున్నామనే సోయి లేకుండా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వైపుకు స్టాండ్ తీసుకొని శత్రు దేశం భాషలో మాట్లాడుతూ శత్రువుల మాటలను సిగ్గు లేకుండా వల్లెవేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రాజ్యాంగబద్ధ హోదాలో ఉండి కూడా నిజానిజాలు తెలియకుండా, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రికి తెలియని విషయం ఏంటంటే.. పాకిస్థాన్ భూభాగంలో దాక్కున్న ఉగ్రవాదులను, వారి స్థావరాలను భారత గైడెడ్ క్షిపణులు విజయవంతంగా మట్టుబెట్టాయని.. 11 ఎయిర్ బేస్‌లను పూర్తిగా ధ్వంసం చేశాయన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తెలుసుకుని మాట్లాడాలని కిషన్ రెడ్డి హితవుపలికారు.

## నేను దేశ ద్రోహినా?.. కిషన్ రెడ్డిపై మంత్రి అజారుద్దీన్ సీరియస్




హైదరాబాద్, నవంబర్ 1: తనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ క్రికెటర్, మంత్రి అజారుద్దీన్ స్పందించారు. శనివారం ఏబీఎన్ – ఆంధ్రజ్యోతితో మంత్రి మాట్లాడుతూ.. కిషన్ రెడ్డికి క్రికెట్ గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బ్యాట్ పట్టుకోవడం కూడా రాదంటూ వ్యాఖ్యలు చేశారు. తనను విమర్శించే వాళ్లకి సమాధానం చెప్పి తన స్థాయి తగ్గించుకోలేనని చెప్పుకొచ్చారు. తనపై వచ్చిన ఆరోపణలపై కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తుచేశారు. దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన తాను దేశ ద్రోహినా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసమే బీజేపీ తనను టార్గెట్ చేసిందని ఆరోపించారు.

మంత్రిగా జూబ్లీహిల్స్‌లో అడుగుపెట్టిన తనను ప్రజలు ఆదరించారని.. ఇందుకు ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. విమర్శించిన వాళ్ళకి సమాధానం చెప్పదల్చుకోలేదని మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. కాగా.. అజారుద్దీన్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని, భారత్‌కు చెడ్డపేరు తెచ్చారని విమర్శించారు. ఆయనపై అనేక కేసులు ఉన్నాయని.. అలాంటి వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వడం ప్రజాస్వామ్యానికి అవమానకరమన్నారు. అజారుద్దీన్ దేశ గౌరవానికి భంగం కలిగించారంటూ కిషన్ రెడ్డి చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

## పదేపదే బాంబు బెదిరింపులు.. ఆందోళనలో ప్రయాణికులు

హైదరాబాద్, నవంబర్ 1: ఇండిగో విమానాలకు తరచుగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇండిగో విమానంలో బాంబులు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడం.. ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లుగా వచ్చిన మెయిల్ ఆందోళన కలిగిస్తోంది. ఈరోజు (శనివారం) జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానాన్ని ముంబాయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. బాంబు బెదిరింపు మెయిల్‌పై పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత నెలలో కూడా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దుబాయ్ నుంచి మంగళూరు బయలుదేరిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు ఉన్న సందేశాలను ప్రయాణికులు గుర్తించి.. సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అలర్ట్ అయిన విమానాశ్రయ సిబ్బంది.. విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని.. అందంతా ఫేక్ అని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. ఇండిగో విమానాలకు పదే పదే ఇలాంటి బెదిరింపులు రావడంపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తున్న ఆకతాయిలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ఇలాంటి సందేశాలతో భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పరిస్థితి.



# ధర్మపురిలో గుబాళించిన భక్తి భావ పరిమళాలు





ధర్మపురి క్షేత్రంలో భక్తి భావ పరిమళాలు గుబాళించాయి. భారతీయ మహోన్నత విభవానికి ఆధారభూతమై, ప్రాచీన వైదిక సంస్కృతికి శతాబ్దాలుగా సాక్షీభూతంగా ఉన్న ధార్మిక క్షేత్రంలో, వారం రోజుల పాటు ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, కవి, రచయిత, నటులు, చారిత్రక పరిశోధకులు, నాటక దర్శకులు, విశ్రాంత ప్రాచార్యులు, ఆధ్యాత్మిక ప్రాసంగికులు, విశేషించి పురాణ ప్రవచకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సంగన భట్ల నర్సయ్య శర్మ క్షేత్ర సనాతన సంప్రదాయ రీతిలో కొనసాగించిన కార్తీక పురాణ సప్తాహ కార్యక్రమం భక్తి భావ పరిమళాలను వెదజల్లింది. స్థానిక శ్రీ శారదా బ్రాహ్మణ మహిళా మండలి ఆధ్వర్యంలో, మండలి భవనంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్తీక పౌరాణిక ప్రవచనాలు భక్తితత్వరులను రంజింప జేశాయి. వ్యాస, వాల్మీక, కాళిదాస, కణాద, పైల, జైమిని, పరాశర, ఆపస్తంభాది మునులు, రుషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక, ఆదిభౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచానాలను శతాబ్దాలుగా పరిరక్షిస్తున్న క్షేత్ర రాజంలో నైమిశారణ్యంలో సూత మహర్షి, శౌనకాది మహా మునులకు వివరించిన సనాతన పురాణ ప్రవచన సాంప్రదాయం వేల సంవత్సరాల నుండే ఆచరణలో ఉంది. శతాబ్దాలుగా లబ్ద ప్రతిష్ఠులైన, క్షేత్రానికి చెందిన పౌరాణికులు పురాణ ప్రవచన సాంప్రదాయ వారసత్వ పరిరక్షణకై నడుం బిగించి, అంకిత భావంతో, లాభాపేక్ష లేని నిస్వార్థ కృషి సల్పుతూ, రాష్ట్రం లోని వివిధ ప్రదేశాలలలో ప్రవచనాలను నిర్వహిస్తునే ఉన్నారు. ప్రధానంగా స్థానికులు, పురాణ ప్రవచనాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తూ క్షేత్ర సనాతన సంప్రదాయ వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఆ ప్రాచీన సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, సహస్రాబ్దాల చారిత్రిక నేపథ్యం సంతరించుకున్న ధర్మపురి క్షేత్రంలో సప్తాహ ప్రవచన కార్యక్రమాలను శ్రీశారదా మహిళా మండలి, సౌజన్యంలో సంగన భట్ల నర్సయ్య తమ స్వస్థలమైన ధర్మపురి క్షేత్రంలో ప్రవచించగా అధిక సంఖ్యాకులైన భక్తులు భాగస్వాములైనారు. అనునిత్యం సాయంకాలం ప్రవచించిన కార్తీక పురాణ అంతర్గత కథలు, విశేషాలు, వ్యాఖ్యానాలు, అమూల్య అభిభాషణాలు వీనులకు పసందుగా, కనువిందుగా సాగింప జేసిన తీరు ఆబాల గోపాలానికి అలౌకిక ఆనందాన్ని కలిగించింది. ధర్మపురి క్షేత్రంలో ప్రవచన పునర్వైభవానికి సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్న పౌరాణికుని ప్రతిభకు పట్టం కట్టి, క్షేత్ర ఆత్మీయునిగా ఎంచి, నిర్వహణకు భక్తులు నడుం బిగించడం, ప్రవచకుని కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా సత్కరించడం క్షేత్ర సనాతన సాంప్రదాయాచారాసక్తుల ప్రశంసా పాత్రమైంది. హృదయ రంజకంగా చేసిన ప్రవచనాలు, కథాకథనాలు, ప్రధానంగా చంద్రశాస్త్ర, వ్యాకరణ పండితులైన నర్సయ్య శర్మ తన పాండిత్య ప్రతిభతో వివరించి న సందర్భోచిత వ్యాఖ్యలు రసజ్ఞులైన శ్రోతల హృదయాలలో చెరగని ముద్రలు వేశాయి. ప్రత్యేకించి క్షేత్ర ప్రతిష్ఠను ఇనుమడింప జేయడంతో పాటు భక్తి రసజ్ఞులైన క్షేత్ర వాసుల వీనులను సుసంపన్నం గావించాయి.

**పురాణ ప్రవచన పరిసమాప్తి...** ధర్మపురి క్షేత్రంలో సనాతన సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కార్తీక పురాణ సప్తాహ పురాణ ప్రవచన కార్యక్రమాలు శనివారం ఘనంగా ముగిసాయి. పౌరాణికులు సంగన భట్ల నర్సయ్య శర్మ చేసిన సప్తాహం పురాణ ప్రవచనాలకు ముగింపు పలికారు. స్థానిక శ్రీశారదా మహిళా మండలి నిర్వహణలో కార్యక్రమంలో చివరి రోజు ఏకాదశి సందర్భ భగవద్గీత యుక్త సామూహిక పారాయణం గావించారు.

**పౌరాణికునికి సన్మానం...** మహిళా మండలి పక్షాన, వైయక్తికంగా భక్తులు... నర్సయ్య శర్మ దంపతులను సన్మానించారు. మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు మధ్వాచారి విజయలక్ష్మి, రాజేశ్వరి, రమాదేవి, శోభ, పద్మ, సంతోషి, తదితర నిర్వాహకులు వేరువేరుగా, ఉచిత రీతిన సత్కరించారు. భక్తులు దక్షిణ తాంబూలాలు, వస్త్రాలు పౌరాణికులకు సమర్పించుకుని సన్మానించి ఆశీస్సులు పొందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# మారిషస్ లో తెలుగు ప్రజల ప్రవాసం - నవంబర్ 2...మారిషస్ లో భారతీయుల రాక దినోత్సవం





మారిషస్ ద్వీపంలో భారతీయ కార్మికుల రాకను గుర్తు చేసు కోవడానికి మారిషస్ నవంబర్ నెల 2వ రోజును భారతీయ రాక దినోత్సవంగా జరుపుకుంటుంది. 1834లో ప్రైవేట్ ఇంపోర్టేషన్ స్కీమ్ క్రింద భారతీయులు మారిషస్ కు జీవనోపాధి కోసం వలసకార్మికులుగా వెళ్లడం ప్రారంభించారు. అదే సంవత్సరం ఆగస్టు నెలలో బొంబాయి నుండి సారాలో 39 మంది ఉచిత కూలీలతో కూడిన బ్యాచ్ కాలనీకి చేరుకుంది. ఈ కార్మికులు నవంబర్ 2, 1834 ఆదివారం నాడు కాలనీకి చేరుకున్నారు. వారి ల్యాండింగ్ కు నవంబర్ 3 సోమవారం నాడు అనుమతి లభించింది. మరుసటి రోజు వారు మారిషస్ గడ్డపై అడుగు పెట్టారు. అక్కడ వారు 'ఆంటోయినెట్' షుగర్ ఎస్టేట్లో పనికి వెళ్లారు. వీరికి నెలవారీ జీతం ఐదు రూపాయలు కాగా ఆరు నెలల జీతం అడ్వాన్స్ పొందారు. 1843 సంవత్సరంలో దాదాపు 35 ఓడల్లో భారతీయులు మారిషసు వలస వచ్చారు. వారిని తీసుకుని వచ్చిన ఓడల పేర్లు సిటీ ఆఫ్ లండన్, కింగ్ స్టన్, ఫ్లవర్ ఆఫ్ ఉగీర్, సుల్తాన్, సిరంగపట్నం, బాబా బ్రాహ్మిన్, కోరంగి పికేట్ మొదలైనవి. నేడు మారిషస్ జనాభాలో 68% కంటే ఎక్కువ మంది భారతీయ మూలానికి చెందిన వారు, సాధారణంగా ఇండో - మారిషియన్లు అని పిలుస్తారు. భారతీయ ఆగమన దినోత్సవాన్ని పురస్కరించుకుని, మారిషస్ పోస్ట్ 1978లో 1.50 మారిషస్ రూపాయల విలువ కలిగిన స్టాంపును విడుదల చేసింది. ఆఫ్రికా ఖండ తీర ఆగ్నేయ తీరప్రాంతాల్లో 2000లో మీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో ఉన్న ద్వీప దేశం మారిషస్. 2040 చ.కి.మీల వైశాల్యం కలిగి, పోర్టు లూయిస్ రాజధానిగా దాదాపు 12 లక్షల పై చిలుకు జనాభా కలిగి, ఆంగ్లం, తెలుగు అధికార భాషలుగా, మారిషియన్ క్రియోల్, ఫ్రెంచి, చైనీస్ ఉర్దూలతో పాటు, భోజ్ పూరి, మరాఠీ, తమిళం, ఉర్దూ తదితర భారతీయ ప్రాంతీయ భాషలు గా కలిగి ఉంది. 1630 - 1710 డచ్ కాలనీగా 1715 - 1810 మధ్య ఫ్రెంచ్ కాలనీగా తర్వాత 1968 వరకు బ్రిటిష్ కాలనీల నుండి తర్వాత స్వాతంత్రం పొందింది. 1903లో పైచెల్లిసును ప్రత్యేక కాలనీ గా రూపొందించిన తర్వాత మారిషస్ క్రమానుగత అభివృద్ధి జరుగు తున్నది. ఆఫ్రికా దేశాల మానవ అభివృద్ధి జాబితాలో ద్వితీయ స్థానంలో ఉన్న మారిషస్ హిందూ యిజం అతి పెద్ద మతంగా ఉన్న ఏకైక ఆఫ్రికా దేశంగా ప్రత్యేకతను కలిగి ఉంది. రైతులు చెరకు పొలాలలో పని చేయడానికి పెద్దసంఖ్యలో భారత దేశం నుండి కార్మికులను తీసుకు వచ్చారు. 1834 - 1921 మధ్యలో ద్వీపంలో సుమారు 5 లక్షల మంది కార్మికులు పనిచేసారు. ప్రైవేటు వ్యవసాయ దారుల క్రింద కూలీలుగా పనిచేయటానికి 1835 లో కిష్టమ్, వెంకటపతి, అప్పయ్య అనే ముగ్గురు తెలుగు వారు కాంది శీకులుగా తొలిసారిగా మారిషస్‌లో అడుగు పెట్టారు. ఆ మరుసటి సంవత్సరం గౌంజన్ అనే ఓడలో దాదాపు 30 మంది తెలుగు వారు ఆ ద్వీపంలో కాలు పెట్టారు. కాకినాడ సమీపాన వున్న 'కోరంగి' రేవు నుండి బయలు దేరి వచ్చినందుకు వాళ్లని "కోరంగి వాళ్ళు" అని, వారు మాట్లాడే తెలుగు భాషకు 'కోరంగి భాష' అని పిలిచేవారు. 1843 సంవత్సరంలో కోరంగి పికేట్ అనబడే 231 టన్నుల బరువు నాలుగైదు తెర చాపలు గల బార్క్ అనే మాదిరి ఓడ రెండు సార్లు ప్రయాణం చేసి దాదాపు రెండు వందల మందిని మారిషస్ దీవికి చేర్చింది. 1834లో పుట్టిన ఊళ్లను విడిచి, చెరుకు తోటల్లో పని చేసేందుకు కూలీలుగా మారిషస్ వెళ్లిన తెలుగు వారు మాత్రం తమ తరువాతి తరం వారు కూడా తెలుగు భాషను ప్రేమించి, మాట్లాడేలా పునాది వేశారు. మాతృ భాషకు బ్రహ్మో త్సవం జరిపారు. తెలుగుకు పట్టాభిషేకం చేస్తున్నారు. వారు తమతో తీసుకెళ్లిన వ్యవసాయ పరికరాలైన పలుగు, పారతో పాటు "పెద్ద బాలశిక్ష, రామాయణ, మహాభారతం" వంటి ఇతిహాస గ్రంథాలు, అక్కడి వారిని తెలుగు వారసులుగా తీర్చిదిద్దే ప్రయత్నానికి దోహద పడుతు న్నాయి. అవే ఇప్పటి ఆరవ తరం తెలుగువారూ భాషాయజ్ఞంలో మమేకం కావడానికి కొండంత ఆసరాగా నిలుస్తున్నాయి. మారిషస్ దేశానికి వెళ్లిన తెలుగువారు తొలుత తమ భాషా, సాంప్రదాయాలను నిలుపు కోవడానికి ఇబ్బందులను ఎదుర్కొన్నా, అక్కడికి వెళ్లిన వారిలో మేబర్ ప్రాంతానికి చెందిన పండిట్ గుణ్ణయ్య 1930లో తెలుగు భాషా వికాసానికి నడుం కట్టారు. ఇలా 1947లో ముందు మారిషస్ ఆంధ్ర మహా సభ, తర్వాత నామాంతరం చెంది మారిషస్ "తెలుగు మహా సభ"గా ఆవిర్భవించింది. దాన్ని వారు తెలుగు భాషామ తల్లి ఆలయంగా భావిస్తున్నారు.. ప్రస్తుతం మారిషస్ దేశంలో తెలుగు కుటుంబాల్లో ఆరవ తరం వారు సైతం, తమ పెద్దలు వేసిన బాటలో నడుస్తుం డటం ఇక్కడి తెలుగు వారికి స్ఫూర్తిదాయక అంశం. మారిషస్ దీవిలోని మొత్తం జనాభా దాదాపు 13 లక్షలైతే, తెలుగువారు 1లక్షమందికి పైగా ఉన్నారు. వీరికోసం సుమారు 300 తెలుగు పాఠశాలలు నడుస్తుండగా, 190 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రాథమిక తరగతులలో దాదాపు 10 వేల మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసి స్తున్నారు. మాధ్యమిక, ఉన్నత విద్య లో తెలుగు ద్వితీయ భాషగా ఉంది. ఉన్నత విద్యకోసం మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం పని చేస్తుంటే, తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక మండలి, తెలుగు యువ సంఘం, అనేక ఉప సంఘాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. వీటికి మారిషస్ రిపబ్లిక్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి, పూర్తిస్థాయిలో ఆర్థికంగా చేయూత నిస్తున్నది. ఫ్రెంచికి దగ్గరగా ఉండే "క్రియోల్" వారి మాతృభాష అయినా, స్వ భాషాభిమానంతో, తెలుగును ద్వితీయ భాషగా ఎంచుకొని తెలుగును బతికిస్తున్నారు. ముఖ్యంగా ధర్మపురి నరసింహ శతకం, వేమన శతక పద్యాలకు వారు పెద్దపీట వేయడం, క్షేత్రయ్య అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు, నరసింహ శతకం, నేర్చు కోవడంతో పాటు తెలుగు సంప్రదాయాలనూ పూర్తిస్థాయిలో పాటించడం విశేషం. ఇటీవల అక్కడి విద్యార్థులే ఓ కథా సంకలనం వెలువరించడం వారికి తెలుగు గల అభిమానానికి, ప్రేమకు తార్కాణం. మారిషస్‌లో ఓ ఆరాధ్య భావంతో తెలుగుకు బ్రహ్మోత్సవాలు 2018లో ఆగస్టు 20నుండి నిర్వహించి, అందులో భాగంగా, పద్య పఠన పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు ఒక్కోరోజు ఒక్కో తెలుగు సాంప్రదాయంపై అవగాహన కల్పించేందుకు వీలుగా సదస్సులను నిర్వహించారు. మారిషస్ దీవిలో తెలుగు భాషోన్న తికి సర్వస్వాన్ని ఫణంగా పెట్టి "సంజీవ నరసింహ అప్పడు" పని చేస్తున్నారు. ఆయన ఆ దేశ తెలుగు పరీక్షల విద్యాధికారి, రేడియో వ్యాఖ్యాత, జర్నలిస్ట్. మారిషస్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ తెలుగు విభాగ అధికారి. తెలుగు ప్రాంతాలతో నిరంతరం సంబం ధాలు కొనసాగిస్తూ అక్కడి తెలుగు వికాసానికి కృషి చేస్తున్నారు. తెలుగు తనాన్ని నిలుపు కొనేందుకు మారిషస్ తెలుగు మహాసభ, అక్కడి ప్రభుత్వం గట్టి సంకల్పంతో పని చేస్తున్నాయి. తెలుగు మహాసభ దేశ రాజధాని పోర్టు లూయిస్ లోని రాయల్ రోడ్డులో ప్రధాన కార్యాలయం కలిగి, ఏడు ప్రాంతీయ కమిటీలు, 90 శాఖలు క్రియా శీలకంగా పని చేస్తున్నాయి అంటే, ఆ సంస్థ తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషి చెప్పకనే చెబుతున్నది. తెలుగు వారికి ప్రీతి పాత్రమైన ఉగాదితో పాటు వినాయక చవితి, దీపావళి, సంక్రాంతి జాతీయ సెలవుదినాలుగా పాటించడం గమనార్హం. తెలుగు వారి సంస్కృతి ప్రతీకలైన పండగలు, పబ్బాలు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం తెలుగువారిచే నిర్మితాలైన 350 దేవాలయాలూ తెలుగు భాషా వికాసానికి కేంద్రాలుగా ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# తెలుగువారికి బృహత్సంహితలు...పానుగంటి సాక్షి వ్యాసాలు

## నవంబర్ 2.. ఆంధ్రా షేక్స్పియర్ జయంతి



పానుగంటి ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటకకర్తగా, వ్యాసరచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒకమాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝురీవేగంతో పరుగులెట్టేది. కొందరు ఆయనను "ఆంధ్రా అడిసన్" అంటారు. మరికొందరు ఆయనను "ఆంధ్రా షేక్స్పియర్" అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. " పాను గంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏను గంటి రూపాన్నియ్యడం నేనుగంటి" అని శ్రీశ్రీ సైతం కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి. పానుగంటి లక్ష్మీ నరసింహారావు తెలుగు సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యా భరణాలు అందించిన నరసింహా రావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళి దాసు' అనీ బిరుదులతో అభినందించింది. నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు. 1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణు లైనారు. పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేరిన పాను గంటి, ఆ రోజుల నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అయితే ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనెగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. ఆయన లక్ష్మీ పురం జమిందారిణి రావు చెల్లయమ్మ గారి దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మాని వేశారు. తరువాత ఉర్లాము సంస్థానం లోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంత కాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూరు పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915-16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు వ్రాసారు. వాటి నన్నింటిని మహా రాజుగారే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖ మైనవి సాక్షి వ్యాసాలు. సువర్ణముఖి, ఆంధ్రపత్రిక లలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వినోద ప్రధానశైలిలో రాస్తూ.. ఆనాటి సామాజిక రుగ్మతలను ఎండ గట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ అడ్డిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పానుగంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలాచార్యుడు, జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. "సాక్షి వ్యాసాలు" పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారుమ్రోగి పోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగ ధర చరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠాభరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, ఋణబాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును" అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. "జంఘాలశాస్త్రి" అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నండూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన" మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము "పానుగంటి లక్ష్మీనరసింహారావు"గారని. .. నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్యప్రేమికు లుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాధునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచ లేదు. ఆధునిక శ్రీనాధుని వలెనే అనుభవించి నన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి ఋణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులుగారికి తుదిదశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన ఋణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ డానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించ లేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేక పోయారు. పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన వ్రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు ... "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును". 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడి పోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. పరిస్థితులు మారి, తీవ్ర మనస్తాపంతో ఈయన అక్టోబరు 7న, 1940లో మరణించాడు. **రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# హేతువాద హృదయవేత్త - త్రిపురనేని గోపీచంద్ - నవంబర్ 2...త్రిపురనేని గోపీచంద్ వర్ధంతి



త్రిపురనేని గోపీచంద్ ు తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక ఆలోచనలతో, హేతువాద తాత్విక దృష్టితో, మానవ మనోవైజ్ఞానికతను సాహిత్య రూపంలో మలచిన మహత్తర రచయిత. 1910 సెప్టెంబర్ 8న కృష్ణా జిల్లాలోని అంగలూరులో జన్మించిన గోపీచంద్ తండ్రి త్రిపురనేని రామస్వామి ప్రసిద్ధ హేతువాది, సమాజ సంస్కర్త. ఆ తాత్విక వాతావరణం గోపీచంద్ బాల్యంలోనే ఆలోచనలకు కొత్త దిశ ఇచ్చింది. అతనిలో తర్కం, మానవత, సత్యాన్వేషణ ప్రధాన విలువలుగా రూపుదిద్దుకున్నాయి. సంప్రదాయాల అంధానుసరణ, కపట నైతికతలపై తిరుగుబాటు స్వరంగా ఆయన రచనలు నిలిచాయి. గోపీచంద్ జీవితమంతా ఒక ఆలోచనా యాత్ర. అతని రచనలు బాహ్య జీవితానికి ప్రతిబింబం కాక, అంతర్ముఖ మానవుడి మానసిక సంఘర్షణలకు ప్రతీకలు. మానవుడు తన ఆత్మలోని నిజానిజాలను ఎదుర్కోవడానికి, తన అంతరాంతరాల సత్యాన్ని తెలుసుకోవడానికి చేసే ప్రయాణం ఆయన సాహిత్య దృష్టిలో ప్రధానాంశం. ఈ తాత్విక భావజాలం ఆయన ప్రతీ రచనలోనూ స్పష్టంగా ప్రతిఫలించింది. గోపీచంద్ రచనల్లో అసమర్థుని జీవయాత్ర తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయి. మానవ మనస్సులోని ఆవిర్భావాలు, నిరాశలు, అంతర్మథనాలు, విరుద్ధ భావజాలాలు ఇందులో సున్నితంగా చిత్రితమయ్యాయి. ఈ నవల తెలుగు సాహిత్యంలో మనోవైజ్ఞానిక వాస్తవికతకు దారితీసిన మొదటి ప్రయత్నమని పండితులు పేర్కొంటారు. అదేవిధంగా అసమర్థుని జీవయాత్ర, గడియపడని తలుపులు, చీకటి గదులు, పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా, ప్రేమోపహతులు, పరివర్తన, యమపాశం శిధిలాలయం, జీవితం వంటి రచనలు ఆయన సాహిత్య లోకంలో అజరామర కీర్తిని అందించాయి. ఈ రచనలన్నింటిలోనూ ఆయన వ్యక్తి-సమాజ సంబంధాలను, మానసిక వాస్తవాలను, నైతిక సంక్షోభాలను గంభీరంగా విశ్లేషించారు. హేతువాదం, మానవత, ఆత్మవిమర్శ ు ఇవే ఆయన ఆలోచనల మూలం. మతం కంటే మానవతను, సంప్రదాయం కంటే తర్కాన్ని, భక్తి కంటే బుద్ధిని ఆయన మిన్నగా చూశాడు. మానవ జీవితంలోని బాధలను తాత్విక దృష్టితో పరిశీలిస్తూ పరిష్కారం చూపే ప్రయత్నం చేశాడు. ఆయన పాత్రలు నిజ జీవితానికే ప్రతిరూపాలు ు జీవన యుద్ధంలో నలిగే మనిషి బాధను, ఆత్మ విమర్శలో తడబడే మనసును ప్రతిబింబిస్తాయి. గోపీచంద్ సినిమారంగంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించాడు. 1940%-%50 దశకాల్లో రైతు బిడ్డ, గృహప్రవేశం, లక్ష్మమ్మ, బంగారు పాప, పేరంటాలు, ప్రియురాలు, ధర్మదేవత, చదువుకున్న అమ్మాయిలు వంటి చిత్రాలకు కథా రచయితగా, మాటల రచయితగా, దర్శకుడిగా సేవలందించాడు. ఆయన చిత్రాల్లోనూ సాహిత్యంలోని మానవీయ విలువలే ప్రధానంగా ప్రతిబింబించాయి. సామాజిక న్యాయం, స్త్రీ పురుష సమానత్వం, మానవ దౌర్భాగ్యాల విశ్లేషణ వంటి అంశాలు ఆయన సినిమా దృక్పథంలోనూ కనిపిస్తాయి. బంగారు పాప వంటి చిత్రాలకు ఆయన మానవీయ దృష్టి, నైతిక విలువల బలమైన వ్యాఖ్యానంగా నిలిచింది. తన చివరి రోజులలో అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో పోరాడుతూ కూడా రచనకు విరామం ఇవ్వని గోపీచంద్ 1962 నవంబర్ 2న కన్నుమూశాడు. ఆయన మరణం తెలుగు సాహిత్య ప్రపంచానికి లోతైన నష్టం. కానీ ఆయన ఆలోచనలు, రచనలు, హేతువాద స్వరం నేటికీ తెలుగు పాఠకులను ఆలోచింపజేస్తూనే ఉన్నాయి. పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా వంటి రచనలకు సాహిత్య అకాడెమీ బహుమతి రావడం ఆయన ప్రతిభకు, ఆలోచనల లోతుకు గుర్తింపు. త్రిపురనేని గోపీచంద్ ఒక నవలాకారుడు మాత్రమే కాదుఅతను ఒక చింతకుడు, విమర్శకుడు, మనోవైజ్ఞానికుడు, తాత్వికుడు. ఆయన రచనలలో ఉన్న ప్రశ్నలు కాలానుగుణంగా మనసును కదిలిస్తాయి. మానవుడు తన ఆత్మలోని అసలైన సత్యాన్ని ఎదుర్కోవాలని, అబద్ధాల పొరలను తొలగించాలని ఆయన ఆలోచనలు పాఠకుడిని ప్రేరేపిస్తాయి. గోపీచంద్ సాహిత్యం మనస్సును మేల్కొల్పే దీప్తి. ఆయన మాటల్లోనే చెప్పాలంటే %-% "జీవితం అంటే తర్కం కాదు, కానీ తర్కం లేకపోతే జీవితం లేదు." తెలుగు సాహిత్యంలో తాత్వికత, హేతువాదం, మనోవైజ్ఞానిక దృష్టిని సమన్వయించిన అరుదైన రచయితగా త్రిపురనేని గోపీచంద్ శాశ్వత స్థానాన్ని సంపాదించాడు. ఆయన ఆలోచనలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయి. జీవితాన్ని ఆలోచనగా, ఆలోచనను జీవనంగా మలచిన మహానుభావుడు త్రిపురనేని గోపీచంద్ సాహిత్య చరిత్రలో నిత్య జ్వాలగా నిలిచాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# చురకలు

## సంపాదకీయం

### భారత్ పై పడి ఏడ్చినంత సేపు పట్టలేదుగా పాక్!

ఇటీవల అఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే... టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంతో కొన్ని రోజులు కాల్పుల విరమణ జరిగింది. అయితే టర్కీ వేదికగా జరిగిన శాంతి చర్చలు విఫలమయ్యాయని కథనాలొచ్చాయి. దీంతో... భారత్ పై పాక్ తన అక్కసు వెళ్లగక్కుకుంది. కట్ చేస్తే.. రిజల్ట్ రివర్స్ అయ్యింది! దీంతో పాక్ పై విమర్శలు మొదలయ్యాయి. అవును... విషయం ఏదైనా, సందర్భం మరేదైనా, వేదిక ఇంకేదైనా.. నిత్యం భారత్ పై పడి ఏడ్వడం పాకిస్థాన్ కి బాగా అలవాటుగా మారిపోయిందనే చెప్పాలి. పైగా ఆఫ్గన్ తో భారత్ సంబంధాలు ఇటీవల మరింత బలంగా మారుతున్న విషయాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్న ఇస్లామాబాద్.. ఢిల్లీపై తన అక్కసు వెల్లగక్కుతుంది. ఈ సమయంలో టర్కీలో ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది.

**ఫెయిల్ అయిన చర్చలు!:** సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం, మొదలైన అంశాలపై ఈ రెండు దేశాల మధ్య టర్కీ వేదికగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇవి విఫలమైనట్లు బుధవారం పాకిస్థాన్ ప్రకటించింది! ఈ సందర్భంగా స్పందించిన పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్.. చర్చల్లో ఎలాంటి పరిష్కారమూ కనుగొనలేక పోయామని, అవి విఫలమయ్యాయని తెలిపారు.

**వెంటనే భారత్ పై పడి ఏడుపు!:** అలా ఆఫ్గన్ తో చర్చలు విఫలమవ్వగానే భారత్ పై పడి ఏడ్వడం మొదలుపెట్టింది పాక్. ఇందులో భాగంగా... కాబూల్ లో తీగలను లాగుతూ, తోలుబొమ్మ ప్రదర్శన నిర్వహిస్తున్న వారిని ఢిల్లీ నియంత్రిస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. కాబుల్ తో ఒప్పందానికి దగ్గరవుతున్నప్పుడల్లా, కొందరు జోక్యం కారణంగా చర్చలు విఫలమవుతున్నాయని పరోక్షంగా భారత్ పై విమర్శలు చేశారు.

**తాజాగా సక్సెస్ అయిన శాంతి చర్చలు!:** అయితే.. టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంలో ఇస్తాంబుల్ లో జరిగిన తీవ్రమైన శాంతి చర్చల తర్వాత పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా అక్టోబర్ 18 – 19 మధ్య జరిగిన సీజ్ ఫైర్ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని టర్కీ ప్రకటించింది. తదుపరి చర్చలు నవంబర్ 6న జరగనున్నాయి. ఇవి ఈ ఒప్పందం అమలును ఖరారు చేయనున్నాయని అంటున్నారు.

**ఇప్పుడు ఏమంటావ్ ఆసిఫ్..?:** పాకిస్థాన్ తో ఆఫ్ఘనిస్థాన్ శాంతి చర్చలు విఫలమవ్వడానికి భారత్ కారణమని చెబుతోన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ కు ఇప్పుడు భారత్ నుంచి కీలక ప్రశ్న ఎదురవుతోంది. ఇందులో భాగంగా... కాబూల్, ఇస్లామాబాద్ మధ్య చర్చలు ఫెయిల్ అవ్వడానికి ఢిల్లీ కారణమైతే... ఇప్పుడు చర్చలు సక్సెస్ అవ్వడానికి కూడా ఢిల్లీనే కారణం అని చెబుతారా అని ప్రశ్నిస్తున్నారు.

దేవుడు నోరిచ్చాడు కదా అని భారత్ పై నిత్యం అవాకులు చెవాకులు పేలడం మాని.. దేశాన్ని ఆర్థికంగా, పరిపాలనా పరంగా గాడిలో పెట్టడం.. సరిహద్దుల్లో శాంతి వాతావరణాన్ని నెలకొల్పడంపైనే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

**పాక్ కు ఆఫ్గాన్ మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్!:** కాల్పుల విరమణ ఏర్పాటు చేయబడినప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్ అంతర్గత మంత్రి సిరాజుద్దీన్ హక్కానీ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇందులో భాగంగా... 'మా సహనాన్ని మళ్లీ పరీక్షిస్తే.. మా ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుంది' అని హక్కానీ పేర్కొన్నారు. ఇదే సమయంలో.. తెహ్రిక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ)పై చర్య తీసుకోవాలన్న పాకిస్తాన్ డిమాండ్ పై స్పందించిన ఆయన... ఇది పాకిస్తాన్ అంతర్గత విషయం అని నొక్కి చెప్పారని తెలుస్తోంది.

# బృందావన విహారి



కార్తీక శుద్ధ ఏకాదశి మొదలుకొని పౌర్ణమి వరకు పంచ పర్వాలలోని ఐదు రోజులలో తులసికి కృష్ణునితో వివాహం జరపడం సనాతర ఆచారం. హిందూ మత విధుల్లో తులసికి అత్యంత ప్రాధాన్యత ఉంది.తులసికి సంస్కృతంలో చాలా పేర్లున్నాయి. సురస (మంచి రసం కలిగినది), సులభ (సులభంగా లభించేది), విష్ణువల్లభ (విష్ణుమూర్తికి ఇష్టమైనది), అపేతరాక్షసి (రాక్షస బాధను తొలగించే సామర్థ్యం కలిగినది), పావని (పవిత్ర చేసేది), శూలఘ్నీ (శూలను లేదా నొప్పిని తగ్గించేది).. దేవతార్చనకు తులసి పత్రి ముఖ్యం. తులసి లక్ష్మీదేవి అవతారమని భారతీయుల విశ్వాసం. కాలనేమి కూతురు, జలంధరుని భార్యయైన వృంద (వృంద, బృంద, వృందావనం, బృందావనం సంబంధం) చితాభస్మం నుండి తులసి, ఉసిరి మున్నగునవి పుట్టినట్లు శివపురాణంలో ఉంది. తులసి తీర్థాన్ని మరణ సమయంలో నోటిలో పోయడం, శవ దహన సమయాన తులసి కాష్టాన్ని కొద్దిగైనా వేయడం ఆచరిస్తారు. బృందావనం ఉన్న ఇంటికి యమదూతలు కూడా రారని శాస్త్ర వచనాలు. క్షీరాబ్ధి పర్వ సమయంలో తులసి ఒక దేవతగా వ్యవహరింప బడుతున్నది. దేవ దీపావళి పేరున మహారాష్ట్రలో కార్తీక శుక్ల ద్వాదశినాడు తులసి వివాహ పర్వం జరుపుతారు. మాళవీయులు ఈ పండువ నాడు తులసి కోటను శుభ్ర పరిచి వెల్లవేసి, అలంకరించి, సాయంకాల మునిమాపు వేళ మంత్రయుక్తంగా జరుపు కుంటారు. తెలుగు రాష్ట్రాలలో తులసి పూజతో పాటు, పెద్ద ఉసిరి కొమ్మను ఉంచడం, దీపారాధన చేయడం అనవాయితీ. స్మృతి కౌస్తుభంలో ఏకాదశి మొదలు ఐదు దినాలలో ఏనాడైనా చేయవచ్చునని స్పష్టమవుతున్నది. విష్ణువు అవతారాలలో ఎనిమిదవది కృష్ణావతారం. కృష్ణునితో తులసికి ప్రధానంగా కార్తీక పూర్వార్ధ పక్ష పంచ పర్వాలలో సాయంత్రం గోధూళి వేళ కల్యాణం నిర్వహించడం సాంప్రదాయంగా ఉంది. కృష్ణునితో తులసికి అయ్యే వివాహం వివాహ రుతువును స్వాగతిస్తుంది. వివాహాలకు మాఘాది పంచకాలు తగినవి. తులసి వివాహ పర్వం కార్తీకంలో వస్తుంది. అంటే వివాహ రుతువుకు తులసి కృష్ణుల కళ్యాణం పురోగామి అన్నమాట. ప్రతి సంవత్సరం దీపావళికి తర్వాత) పంచ పర్వాలు గా భావించబడే కార్తీక శుక్ల ఏకాదశి నుండి పౌర్ణమి వరకు తులసీ కృష్ణుల వివాహం జరపడం ఆనవాయితీగా వస్తున్నది. తులసి మొక్కకు చెరుకు గడలతో పందిరి వేసి, ఆ పందిరికి మామిడి తోరణాలు కట్టి, తులసి మొక్కను పూలతో అందంగా అలంకరించి పూజ చేసే సంప్రదాయము భారతదేశములో ఉంది. దీపావళి ఉత్సవాలలో లాగే తులసి మొక్కచుట్టూ, ఇంటి చుట్టూ మట్టి ప్రమిదలో దీపాలు పెట్టి అలంకరిస్తారు. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఈ సందర్భంగా బాణాసంచా కూడా కాల్చుతారు. శ్రీకృష్ణ విగ్రహానికి, తులసికి చెట్టు వధువుగా, శ్రీకృష్ణ విగ్రహం వరునిగా నిర్దేశించి, మధ్య అంతర పటంగా ఒక శాలువా పట్టు కుంటారు. తులసి వేళ్ళ వద్ద ఒక చెరుకు ముక్క ఉంచి, పసుపు అద్దిన గుడ్డలు, గాజులు మొదలైన ఆభరణాలను తులసి మొక్కకు కట్టి, గణపతి, శివుడు, విష్ణు వులను, పుణ్య నదులను స్తోత్రం చేస్తూ, పురోహితుడు మంగళా ష్టకాలు చదువుతూ వేదోక్త రీతిలో తంతు నిర్వహించాక తెర ఎత్తి, వివాహం జరిపించడం, నివేదన పదార్థాలను ప్రసాదంగా పంచడం సనాతన సాంప్రదా యాచారం. ఈకార్య క్రమంలో తులసి కోటలో పెద్ద ఉసిరిక కొమ్మను ఒకదానిని ఉంచడం ప్రత్యేకం. తులసితో కలిపి ఉసిరిక కొమ్మను పూజించడం, కాయలలో పూజా సమయాన దీపారాధన చేయడం ఆచారం...

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పలు విశేషాల సమాహారం క్షీరాబ్ధి ద్వాదశి



మాసాలలో అత్యంత పవిత్రమ్మైనది కార్తీకం. అందులోనూ అతి విశిష్టమ్మైనది క్షీరాబ్ధి ద్వాదశిగా పిలువబడే కార్తీకమాసం శుక్షపక్ష ద్వాదశి. కార్తిక మాస శుక్ల ద్వాదశి శివకేశవులిద్దరికీ ప్రీతిపాత్రమైనది. ఇది క్షీరాబ్ధి ద్వాదశిగా ప్రసిద్ధి పొందింది. మందర పర్వతం కవ్వంగా, వాసుకి తాడుగా క్షీర సముద్రాన్ని దేవదానవులు మథించిన రోజు ఇది. అందుకే దీన్ని 'క్షీరాబ్ధి' ద్వాదశి అన్నారు. మథించడం అంటే చిలకడం. కాబట్టి 'చిలుకు ద్వాదశి'గా కూడా వ్యవహరిస్తారు. అమృతం కోసం దేవతలు క్షీరసాగరాన్ని మథించిన పర్వదినం. క్షీరాబ్ధి ద్వాదశికి పావన ద్వాదశి, చిలుకు ద్వాదశి, యోగీశ్వర ద్వాదశి అనే పేర్లు ఉన్నాయి. పుణ్యప్రదమ్మైనది కాబట్టి పావన ద్వాదశి అని, ఈ శుభ దినాన్నే క్షీరసాగరాన్ని చిలికారు కాబట్టి చిలుకు ద్వాదశి అనీ, యోగులు, మునులు తమ చాతుర్మాస దీక్షను విరమించే పవిత్ర తిథి కాబట్టి యోగీశ్వర ద్వాదశిగానూ ప్రాచుర్యం పొందింది. స్వాయంభువ మన్వాది సంవత్సరాలను క్షీరాబ్ధి ద్వాదశి రోజు నుంచి లెక్కిస్తారు. 'ఏకాదశి నుంచి పూర్ణిమ వరకూ 'భీష్మ పంచక వ్రతం' అని శాస్త్రాలు చెబుతున్నాయి. మరణశయ్యపై ఉన్న పితామహుడు భీష్ముని దాహార్తి తీర్చడానికి అర్జునుడు తన బాణంతో పాతాళగంగను పైకి రప్పించినది ఈ రోజునేనని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు యోగ నిద్రకు ఉపక్రమించిన శ్రీమహా విష్ణువు కార్తీక శుద్ధ ఏకాదశినాడు మేల్కొంటాడు. మర్నాడు క్షీరాబ్ధి ద్వాదశి నాడు శ్రీహరి లక్ష్మీ సమేతుడై, బ్రహ్మాది దేవతలతో బృందావనానికి వస్తాడు కాబట్టి ఆ రోజుని 'బృందావని ద్వాదశి'గా పిలుస్తారు. క్షీరాబ్ధి ద్వాదశి నాడు పాల సముద్రంలో మహాలక్ష్మి ఆవిర్భవించిందనీ, ఆ రోజునే లక్ష్మీ నారాయణుల కల్యాణం జరిగిందనీ 'చతుర్వర్గ చింతామణి' అనే గ్రంథం చెబుతోంది. అందుకే ఈ రోజు లక్ష్మీ నారాయణ కల్యాణం నిర్వహించే సంప్రదాయం ఏర్పడింది. విష్ణుమూర్తినీ, మహాలక్ష్మినీ బృందావనానికి బ్రహ్మ తీసుకొని వెళ్ళి, అక్కడ తులసితో విష్ణువుకు వివాహం జరిపించాడని క్షీరాబ్ధి వ్రత కథ చెబుతోంది. లక్ష్మీదేవిని శ్రీహరి పరిణయ మాడిన శుభ తిథి కారణంగానే క్షీరాబ్ధి ద్వాదశి సాయంత్రం ముత్తైదువులు లక్ష్మీదేవిని భక్తి శ్రద్ధలతో పూజించి, శ్రీ మహా విష్ణువు, లక్ష్మీదేవికి వివాహం జరిపిస్తారు. తులసీని శ్రీలక్ష్మీగానూ, ఉసిరి చెట్టును శ్రీమన్నారాయణునిగాను భావించి వివాహం జరిపించి పునీతులవుతారు. సాయంత్రం దీపాలతో అలంకరిస్తారు. సంవత్సరంలో ఏ రోజైనా దీపారాధన చేయకపోతే వచ్చే దోషం, ఈరోజు దీపారాధన చేయడంవల్ల పరిహారమౌతుంది. పరమ పవిత్రమైన ఈ రోజును పావన ద్వాదశిగా, విభూతి ద్వాదశిగా, గోవత్స ద్వాదశిగా, నీరాజన ద్వాదశిగా వ్యవహరిస్తూ... అందుకు సంబంధించిన వ్రతాలు చేస్తుంటారు. తులసి సాక్షాత్తూ లక్ష్మీదేవి అంశే.ముఖ్యంగా, మధురలోని బృందావనంలో, మహారాష్ట్రలో క్షీరాబ్ధి ద్వాదశి నాడు తులసీ కల్యాణం నిర్వహిస్తారు. తెలుగు లోగిళ్ళలో క్షీరాబ్ధి ద్వాదశి రోజు సాయంత్రం తులసికోట దగ్గర అలికి, ముగ్గులు పెడతారు. తులసికోటనే బృందావనంగా భావించి, ఉసిరిక కొమ్మను విష్ణు మూర్తికి ప్రతీకగా సంభావించి... తులసీ కల్యాణం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని గృహిణి లేదా దంపతులు నిర్వహిస్తారు. రామ తులసి, కృష్ణ తులసి, లక్ష్మీ తులసి... ఇలా ఎన్నో రకాల తులసి చెట్లు ఉన్నాయి. నల్లని కాండం ఉన్న మొక్కను 'కృష్ణ తులసి' అనీ, తెల్లని కాండం ఉండే మొక్కను 'లక్ష్మీ తులసి' అనీ అంటారు. ఈ రెండు వర్ణాల తులసి వృక్షాలను తులసికోటలో నాటి, పరిణయం జరిపిస్తారు. దశావతారాల్లో ఎనిమిదవది శ్రీకృష్ణావతారం. తులసి సన్నిధిలో ఉండడం తనకెంతో ఇష్టమని సాక్షాత్తూ కృష్ణుడే తన సహపాఠి ఉద్ధవునితో చెప్పినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. తులసితో కృష్ణునికి ఉన్న అనుబంధమే తులసీ కల్యాణం నిర్వహించడానికి ముఖ్య కారణం. ఈ కల్యాణం సందర్భంగా తులసిని షోడశోప చారాలతో పూజించి, వివిధ రకాల పండ్లు, చెరుకు ముక్కలు, చలిమిడి, వడపప్పు నివేదించి, హారతి ఇస్తారు. ముత్తైదువను శ్రీమహాలక్ష్మిగా సంభావించి, పసుపు కుంకుమలు, ఫల పుష్ప తాంబూలాదులతో సత్కరించి, దీవెనలు పొందుతారు. అలా చేస్తే మాంగల్యాభివృద్ధి కలుగుతుందని నమ్మకం. రోజంతా ఉపవసించిన గృహిణులు పూజానంతరం తులసికి నివేదించిన వాటిని ప్రసాదంగా తీసుకొని, ఉపవాసాన్ని విరమిస్తారు. ప్రతిరోజూ ఉభయ సంధ్యలలో దేవుని ముందు దీపాలు వెలిగించడం మన సంస్కృతిలో భాగం. అలా పెట్టలేనివారు కార్తిక మాసంలోనైనా పెట్టాలని శాస్త్రాలు అంటున్నాయి. అది కూడా చేయలేనివారు ద్వాదశినాడు 360 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తే, సంవత్సరమంతా దీపం వెలిగించి నట్టవు తుందని శాస్త్ర వచనం. కార్తికమాసం అంతా దీపాలు పెట్టలేని వారు ద్వాదశి, చతుర్దశి, పూర్ణిమ నాడు తప్పకుండా పెట్టాలనీ, అందునా ద్వాదశి నాటి దీపం వైకుంఠ ప్రాప్తి కలిగిస్తుందనీ 'కార్తిక పురాణం' చెబుతోంది. హిందూ సంస్కృతిలో తులసి అతి పవిత్రం. తులసీ కృష్ణుల అనుబంధం కూడా అటువంటిదే. తులసికోట లేని ఇల్లంటూ ఉండదు. మహిళలు తులసిని ప్రతిరోజూ పూజిస్తారు. తులసికి నీరు పోసి, దీపం పెట్టి, తులసీ స్తోత్రాన్ని పఠిస్తూ ప్రదక్షిణ చేసి, చివరగా తులసికోట లోని తీర్థాన్నీ, తులసీ దళాన్నీ స్వీకరిస్తారు. తులసిని పూజించడం అంటే లక్ష్మిని ఆరాధించడమే. క్షీరాబ్ధి ద్వాదశి రోజున తులసి పూజ... లక్ష్మీ నారాయణులకు చేసే పూజ. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ ఆరాధన ప్రేమకూ, భక్తికీ, ప్రతీక. తులసి తీర్థం, తులసీ దళం మీదుగా వచ్చే గాలి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. తులసిలో రోగనివారక శక్తి ఉందని ఆయుర్వేదం నిరూపించింది. చిలుకు ద్వాదశి రోజున అన్నదానం చేస్తే సూర్యగ్రహణ సమయంలో పవిత్ర గంగా తీరాన కాశీక్షేత్రంలో కోటిమందికి అన్నదానం చేసినంత పుణ్యఫలం లభిస్తుందని పురాణ లిఖితం. గోవత్స ద్వాదశి'గా పిలిచే ఈ రోజున వత్సంతో అంటే దూడతో కూడిన ఆవును దానం ఇస్తే విశేష ఫలం లభిస్తుందని ఆస్తికుల విశ్వాసం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కానరాని మీడియా స్వేచ్ఛ... కనుమరుగైన జర్నలిస్టుల రక్షణ

## నవంబరు 2... "జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం"

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలం దాపురించింది. మీడియా కు స్వేచ్ఛ, జర్నలిస్టులకు రక్షణ ఎండ మావులే అవుతు న్నాయి. గత కొన్నేళ్లలో ప్రపంచం లోని పలు దేశాలలో దాదాపు వెయ్యి మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో హత్యకు గురయ్యారు. మన దేశం లోనూ హత్యలకు, చిత్ర హింసలకు, దాడులకు గుర వుతున్న సంఘటనలు లేక పోలేదు. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 2న "జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. జర్నలిస్టులకు రక్షణ చర్యలు తీసుకోక పోవడం బాధాకరం. నవంబరు 2వ తేదీ దినం విషయానికి వస్తే అంతర్జాతీయ భావ ప్రకటనా స్వేచ్ఛ పరస్పర మార్పిడి ' (ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ ఎక్సేంజ్ – ఐఎఫ్ఇఎక్స్) అనే ఒక ప్రపంచ పౌర సంస్థల యంత్రాంగం ప్రతి ఏడాది నవంబరు 2న 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' 2011లో నిర్ణయించింది. ఆ తేదీని ఎందుకు ఎంచుకున్నారంటే 2009 నవంబరు 23న ఫిలిప్ప యిన్స్ లోని మాగుయిండానా ప్రాంత గవర్నర్ ఎన్నికలో ఒక అభ్యర్థి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు కొందరితో పాటు, వార్తా సేకరణకై పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు కూడా వెళ్లారు. వారి వాహన శ్రేణిపై విరుచుకు పడిన సాయుధ ముఠా, వారందరినీ అభ్యర్థి మద్దతు దారులుగా భావించి కిడ్నాప్ చేసి కాల్చి చంపింది. ఈ దారుణ కాండలో 58 మంది మరణించగా వారిలో 34 మంది జర్నలిస్టులే వున్నారు. 2013లో ఐఎఫ్ఇఎక్స్ సభ్యులు, భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకొనే పౌరసమాజ కార్యకర్తల వినతి, పరిస్థితి తీవ్రత మేరకు 2013 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి 70వ వార్షికోత్సవం సందర్భంగా జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించి నవంబరు రెండవ తేదీని 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' పాటించాలని నిర్ణయించింది. అదే సంవత్సరం నవంబరు రెండున మాలీ దేశంలో వార్తల సేకరణకు వెళ్లిన ఇద్దరు ఫ్రెంచి జర్నలిస్టులు ఘిస్లైన్ డ్యూపాంట్, క్లాడె వెర్లోన్‌లను హత్య చేశారు. అప్పటి నుంచి జర్నలిస్టుల మీద నేరాలు చేసిన వారెవరినీ వదలవద్దంటూ ఐఎఫ్ఇఎక్స్ సంస్థ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఏటా ఆ రోజు ఐరాస సభ్య దేశాలు తమ దేశాలలోని జర్నలిస్టుల కేసులను సమీక్షించాలని, దోషులకు శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకో వాలని నివేదికలు ప్రకటించాలని యునెస్కో సభ్యదేశాలకు లేఖలు రాయటమే గాకుండా ప్రతి సంవత్సరం ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చు కొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారి భజనచేస్తూ లాభార్జనే ప్రధాన వ్యాపకంగా మారింది.



అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు,చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేత ల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగి పోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపు తున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించ కుండా ఒక మూలన పడ వేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకో లేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటు లోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తి పోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటంలో ప్రెస్ కౌన్సిల్ చేష్టలు ఉడిగి ఉంది. ఘటనలపై విచారణలు జరపటం, సిఫార్సులు చేయటం, సుభాషితాలు చెప్పటం తప్ప దానికి ఎలాంటి అధికారాలు లేవు. దేశంలో ప్రెస్ కౌన్సిల్ నేడు ఏమీ చేయలేని స్థితిలో ఉంది. అటు తప్పు చేసిన యాజ మాన్యాలను, ఇటు మీడియా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలను నిలదీయలేని సంకట స్థితిలో వుంది. ప్రెస్ కౌన్సిల్‌కు, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రతినిధుల ఎంపిక జరగాలని, తగిన అధికారాలు ఇవ్వాలన్న న్యాయమైన డిమాండ్లను ఎవరూ పట్టించు కోవటం లేదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అక్రమాల కట్టడితోనే ఉపాధి!

కొత్తగూడెం: ఉపాధి హామీ పథకం పనులపై గతేడాది నిర్వహించిన సామాజిక తనిఖీల్లో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో ఉపాధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి సిబ్బందికి రూ.1,39,000 జరిమానా విధిస్తూ డీఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. రూ.10,36,271 రికవరీ చేయాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులు, బినామీల పేర్లపై మస్టర్లు వేసి సొమ్ము కాజేసినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. సామాజిక తనిఖీ వ్యవస్థను బలోపేతం చేయటంపై దృష్టిసారించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నేళ్లుగా జరుగుతున్న అక్రమాలకు సంబంధించి రికవరీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం క్షేత్రస్థాయిలో అక్రమాలకు చెక్ పెడుతుందని అధికారులు భావిస్తున్నారు.

**కొండంత అక్రమం.. గోరంత స్వాధీనం**

ఉపాధి పనులపై గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి అక్రమాలను వెలికితీస్తారు. ఒక్కో మండలంలో ఎంతమొత్తం పక్కదారి పట్టిందో తనిఖీ బృందాలు ప్రాథమిక నివేదిక రూపొందిస్తాయి. కొన్ని మండలాల్లో ప్రాథమికంగా రూ.లక్షల్లో అక్రమాలను గుర్తించినా రికవరీకి వచ్చేసరికి రూ.వేలల్లో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు పునఃపరిశీలన తర్వాత మొత్తం విలువను పూర్తిగా తగ్గించేస్తున్నారు. 2021 నుంచి 2024 (నవంబరు నాటికి) ఖమ్మం జిల్లాలో రూ.42,24,157 అక్రమాలను గుర్తిస్తే రూ.12,64,015 మాత్రమే రికవరీ చేశారు. భద్రాద్రి జిలాలో రూ.21,62,726 అక్రమాలు జరిగితే రూ.10,50,897 స్వాధీనపరచుకున్నారు.



'ఉపాధి హామీ పనుల రికార్డులను మండలాల వారీగా తీసుకున్నాం. వాటి ఆధారంగా తనిఖీలు జరుగుతున్నాయి' అని భద్రాద్రి కొత్తగూడెం డీఆర్డీఓ అదనపు పీడీ రవి 'కు తెలిపారు.

**ఆరు నెలలకోసారి తనిఖీలు**

ఉపాధిహామీ పనుల తీరుపై సాధారణంగా ఆరు నెలలకు ఒకసారి సామాజిక తనిఖీలు నిర్వహించాలి. కానీ ఏటా ఒక్కసారి మాత్రమే తనిఖీలు జరపటం వల్ల అవినీతి పెరిగిపోతోంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు సామాజిక తనిఖీలు నిర్వహించాల్సిందే. గతంలో ఉపాధిహామీ పనుల రికార్డులను ఎప్పటికప్పుడు సమర్పించకపోయినా తనిఖీలు నిర్వహించారు. ఇకపై పనులు జరిగిన తీరుపై రూపొందించిన రికార్డులను అధికారులకు అందజేసిన తర్వాతే తనిఖీలు చేపడతారు.

గతంలో అవినీతి సొమ్ము రికవరీకి గడువు ఉండేది కాదు. ఇకపై నిర్ణీత సమయంలోపు చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు బాధ్యులైనవారు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే విధుల నుంచి తొలగించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలి. సామాజిక తనిఖీలపై గ్రామసభలు పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.

# ఏళ్ల కల.. సాకారం దిశగా..

కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్తు సంస్థ సర్కిల్ (ఎస్ఈ) కార్యాలయానికి సొంత భవనం సమకూరబోతోంది. 2016 అక్టోబర్ 11న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటైంది. అప్పటి నుంచి లక్ష్మీదేవిపల్లిలోని 33/11కేవీ ఉపకేంద్రం పక్కనే ఓ చిన్న రేకులషెడ్డు నిర్మించి ఎస్ఈ కార్యాలయం అని బోర్డు అమర్చారు. రాష్ట్రంలోనే అతిపెద్ద విస్తీర్ణం, అత్యధిక విద్యుత్తు కనెక్షన్లు కలిగిన ఈ జిల్లాలో సర్కిల్ కార్యాలయం లేకపోవటం ఇన్నాళ్లు వెలితిగా ఉండేది. ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యుత్తు సంస్థ అధికారులు అనేకమార్లు ప్రభుత్వానికి, ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఎట్టకేలకు కొత్తగూడెం సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పచ్చజెండా ఊపారు.

**రూ.1.90 కోట్లు మంజూరు**

కొత్తగూడెం నడిబొడ్డున ఎస్ఈ, డీఈ కార్యాలయాల నిర్మాణానికి ఎన్పీడీసీఎల్ రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. భజనమందిర్ రోడ్డు వెంట గల శ్రీరామచంద్ర బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న డీఈ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీనిని తొలగించి స్థలాన్ని చదును చేశారు. ఇక్కడ జీం2 పద్ధతిలో ఎస్ఈ, డీఈ కార్యాల



య భవనాలు నిర్మించనున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం డివిజన్ల పరిధిలో తొమ్మిది సబ్ డివిజన్లు, 77 ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 4,62,251 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిలో గృహ విద్యుత్తు కనెక్షన్లు (కేటగిరీ-1): 3,49,150, వాణిజ్య కనెక్షన్లు (కేటగిరీ-2): 42,926, వ్యవసాయ కనెక్షన్లు (కేటగిరీ-5): 58,357 ఉన్నాయని వెల్లడించారు. మిగిలినవి పరిశ్రమలు, దేవాలయాలు, చర్చీలు, మసీదులు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, వాటర్ వర్క్స్ కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 'జీం2 పద్ధతిలో భవనం నిర్మించబోతున్నాం. కిందిభాగాన్ని పార్కింగ్‌కు వదిలేస్తాం. మొదటి అంతస్తులో సర్కిల్ కార్యాలయం, రెండో అంతస్తులో డీఈ కార్యాలయం ఉంటాయి. తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించాం' అని ఎస్ఈ జి.మహేందర్‌కు తెలిపారు.

# స్త్రీనిధి.. ఏదీ బకాయిల రికవరీ



పెద్దపల్లి : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాలు చేయూతనిస్తున్నాయి. కోరిన 48 గంటల్లోపు రుణం మంజూరు చేయడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అవసరాలు తీరడంతో వడ్డీ వ్యాపారుల బెడద తప్పింది. కొన్నిచోట్ల సంఘాల్లోని సొమ్ము స్వాహా చేయడంతో మహిళలకు రుణాల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. మొండి బకాయిలు ఉండటంతో కొత్తగా రుణాలు తీసుకునేందుకు నిబంధనలు అడ్డొస్తున్నాయి. ఫలితంగా మహిళలు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. బకాయిల రికవరీపై అధికారులు దృష్టి సారిస్తే ప్రయోజనం కలగనుంది.

**రూ.5 లక్షల వరకు..**సూక్ష్మ రుణాల బారిన పడి ఆర్థికంగా చితికిపోతున్న మహిళలకు ఆర్థిక సాంత్వనగా నిలిచేందుకు 2011లో స్త్రీనిధి నిధులు ప్రారంభమయ్యాయి. అప్పటినుంచి స్వశక్తి సంఘాల్లోని మహిళలకు అయిదు రకాలైన సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, ఐశ్వర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. చిరు వ్యాపారాలు, వ్యవసాయం, వాహనాల కొనుగోలు, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పేందుకు రుణాలు పంపిణీ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రుణాలు తీసుకొని వాయిదాలు సకాలంలో చెల్లించిన సంఘాలకు పావలా వడ్డీ వర్తిస్తుంది.

**వడ్డీ వ్యాపారుల ఆశ్రయం**

స్త్రీనిధి రుణాల బకాయిల వసూళ్లలో ప్రగతి కనిపించడంలేదు. కొన్నిచోట్ల మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వీవోఏలు, సహచర సభ్యులు మోసాలకు పాల్పడుతున్నారు. రుణాలు, కిస్తీలను మింగేస్తున్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు రోజుకు ఒకచోట వెలుగు చూస్తున్నాయి. సూక్ష్మ రుణాల బ్యాంకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. స్త్రీనిధి రుణాల మంజూరు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మహిళలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. స్త్రీనిధిలో అత్యవసర పరిస్థితుల్లో రుణాలు తీసుకునే వెసులుబాటు ఉన్నప్పటికి అర్హత కోల్పోతున్నారు. సూక్ష్మ రుణాల సంస్థలకు రూ.2.50 నుంచి రూ.5 లోపు వడ్డీ చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నారు. అధికారులు శ్రద్ధ తీసుకుంటేనే బకాయి సొమ్ము వసూలు కానుంది.

# హలధారికి.. ఆదాయ దారి..!




నల్గొండ : నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాములలో 10 మంది రైతులతో మొదలైన రైతు ఉత్పత్తిదారుల సంఘం(ఎఫ్‌పీవో) నేడు 1,143 మంది రైతులతో దినాదినాభివృద్ధి చెందుతోంది. ఈఎఫ్‌పీవో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో నిధులను సమకూర్చుకుంటూ విజయపథాన నడుస్తోంది.

కట్టంగూరు మండలంలోని బొల్లెపల్లి, పామనగుండ్ల, నారెగూడెం, అయిటిపాముల, చెర్వుఅన్నారం, గార్లబాయిగూడెం, కురుమర్తి, నకిరేకల్ మండలం బొల్లారం, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామాలకు చెందిన రైతులు తమ వాటా ధనం కింద ఒక్కొక్కరు రూ.100 చొప్పున జమచేశారు. ఈ నిధికి నాబార్డు సంస్థ రూ.3.30 లక్షలను జతచేసింది. ఈ నిధులతో 2020 ఆగస్టు 8న ఎరువుల దుకాణం లైసెన్సు పొంది అయిటిపాములలో ప్రారంభించారు. ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో దుకాణాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందులు తక్కువ ధరకు అందిస్తున్నారు. ఏడాదికి సగటున రూ.30 లక్షల వ్యాపారం సాగుతోంది. రెండేళ్ల క్రితం రూ.20 లక్షల విలువైన నిమ్మకాయలు, బత్తాయిలు, కూరగాయలు ఈ ప్రాంతంతో రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని అవుట్‌లెట్ దుకాణాలకు తరలించారు. సుమారు రూ.5 లక్షల లాభాలు ఆర్జించారు. సంఘం కార్యకలాపాలకు ఆకర్షితులైన ఎన్ఆర్ఐ శశి రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ మొత్తంతో పండ్లు, కూరగాయలను రవాణా చేసేందుకు రెండు ఏసీ వాహనాలను కొనుగోలు చేశారు. ట్రాక్టర్, కల్టివేటర్లు, ప్లవ్‌లు, నానోట్రాక్టర్లు, స్ప్రేయర్లు ఎఫ్‌పీవో సమకూర్చుకొని, 20 శాతం తక్కువ ధరకు రైతులకు అద్దెకు ఇస్తున్నారు. ఆహార ఉత్పత్తులను నిల్వ చేసుకునేలా 12 సౌర శీతల గిడ్డంగులు ఏర్పాటు చేశారు. కావాల్సిన రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇస్తారు. నిమ్మ, బత్తాయి కాయలను 25 ఎం.ఎం పరిమాణం నుంచి 45 ఎం.ఎం పరిమాణం వరకు గ్రేడింగు చేసుకునే యంత్రాలను ఏర్పాటు చేశారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యకలాపాల కోసం హైదరాబాద్‌కు చెందిన మీరెడ్డి సత్యనారాయణరెడ్డి జానకమ్మ దంపతులు నకిరేకల్ మండలం కడపర్తి రెవెన్యూ పరిధిలో రెండున్నర ఎకరాల స్థిరాస్తితో పాటు, గేటు నిర్మాణానికి రూ.20 వేలు అందజేశారు. ఈ స్థలాన్ని ప్రస్తుతం బయోచార్ తయారీ సంస్థకు లీజుకు అప్పగించారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో వరి సాగు:

సైదమ్మ, అధ్యక్షురాలు, కట్టంగూరు రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రాణధార, కార్బన్ మింట్ సంస్థల సహకారంతో మా ఎఫ్‌పీవో పరిధిలో 400 ఎకరాలలో తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో వరి సాగు చేపట్టనున్నాం. వరి విత్తనాలను యంత్రాల సాయంతో విత్తనున్నాం. యంత్రాలను స్వచ్ఛంద సంస్థలు సమకూర్చనున్నాయి. దీంతో ఎకరాకు రూ.10 వేల వరకు పెట్టుబడి తగ్గనుంది. అన్ని రకాల పచ్చళ్ల పౌడర్లు, పండ్ల జ్యూస్‌ల ఉత్పత్తి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

# ఉపాధికి రెక్కలు.. పల్లెల్లో ప్రగతి చుక్కలు



రాజపేట : వ్యవసాయ రంగంలోకి సాంకేతికత చేరింది. డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన పలువురు యువకులు పల్లె ప్రాంతాల్లో దీన్ని ఉపాధి మార్గంగా మార్చుకుంటున్నారు. అన్నదాతలకు పెట్టుబడి భారం తగ్గించడంతో పాటు సమయం ఆదా చేస్తున్నారు.

**రూ.6 లక్షలతో కొనుగోలు**

రాజపేట మండలం పాముకుంట గ్రామానికి చెందిన రాగుల రాజు చదివింది డిగ్రీ. ఏడాదిన్నర క్రితం రూ.6 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. డ్రోన్ వినియోగం నిమిత్తం జనరేటర్, కారు వాహనాలను కొన్నాడు. కొనుగోలు సమయంలో 10 రోజుల పాటు శిక్షణ కూడా పొందారు. డ్రోన్ సామర్థ్యాన్ని బట్టి ఒక్క రోజు 10 నుంచి 30 ఎకరాల వరకు పిచికారీ చేస్తున్నారు. ఎకరానికి (డబ్బా లెక్క చొప్పున) రూ.500 నుంచి రూ.600 వరకు తీసుకుంటున్నారు. పత్తి, వరి, కంది, ఇతర కూరగాయల పంటలకు డ్రోన్ ద్వారానే పిచికారీ చేస్తున్నట్లుగా తెలిపారు. మెదక్, సిద్దిపేట, జనగామ ప్రాంతాలకు రైతుల పిలుపు మేరకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

**స్వయంగా ఆపరేట్ చేస్తూ..**

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రాకేశ్‌రెడ్డి చదివింది బీటెక్. కొంత కాలం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ విద్యుత్తు కంపెనీలో ఉద్యోగం చేశారు. వ్యవసాయంపై మక్కువతో స్వగ్రామానికి చేరారు. నాలుగేళ్ల క్రితం రూ.5 లక్షల వరకు వెచ్చించి డ్రోన్ కొనుగోలు చేశారు. రాజపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి మండల రైతుల పిలుపు మేరకు వ్యవసాయ పొలాల్లో రసాయన మందు పిచికారీ చేసి ఉపాధి పొందుతున్నారు. స్వగ్రామంలో ఎనిమిది ఎకరాలను తల్లిదండ్రుల సహకారంతో సాగు చేస్తూనే డ్రోన్ ఆపరేటింగ్ చేపడుతున్నట్లు రాకేశ్‌రెడ్డి వివరించారు.

# జలాలు ఎలా ఉన్నాయి?

కామారెడ్డి : వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు అధికారులు ముందస్తు కసరత్తు చేపట్టారు. పల్లెల్లో స్థానిక నీటి వనరుల పనితీరును మిషన్ భగీరథ అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు, మూడు రోజులుగా గ్రామాల్లో పర్యటిస్తూ స్థానిక అవసరాలకు వినియోగిస్తున్న బోరుబావులను పరిశీలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రెండు నెలలుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. భూగర్భజలాలు రికార్డు స్థాయిలో పైకి వచ్చాయి. ప్రస్తుతం జిల్లాలోని కొన్ని జలాశయాలు, చిన్ననీటి వనరులు నిండుకుండను తలపిస్తున్నా.. అవసరాలు పెరుగుతుండటంతో వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఉత్పన్నమవుతుంది. ప్రజలు దప్పిక తీర్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు ఆ సమస్య నుంచి గట్టెక్కడానికి ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా.. మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో నీటివనరుల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో, ఇప్పుడు బోరుబావులు ఎలా ఉన్నాయని గమనిస్తున్నారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత వేసవి ప్రణాళిక రూపొందించనున్నట్లు మిషన్ భగీరథ అధికారులు పేర్కొంటున్నారు.

**మరమ్మతులు అవసరమా..**

మిషన్ భగీరథ కింద గ్రామాలకు సరఫరా చేస్తున్న నీరు ప్రజల అవసరాల మేరకు సరిపోవడం లేదు. చాలా గ్రామాల్లోని ట్యాంకులు మిషన్ భగీరథ ద్వారా సగమే నిండుతున్నాయి. మిగతా నీటిని స్థానిక బోరుబావుల ద్వారా నింపుతున్నారు. దీంతో ప్రభుత్వం బోరుబావులను



వినియోగించుకోవాలని భావించింది. ప్రస్తుతం గ్రామాల్లో ఎన్ని బోరుబావులు ఉన్నాయి? ఎన్ని వట్టిపోయాయి? పనిచేస్తున్నవి ఎన్ని? చెడిపోయిన వాటికి మరమ్మతులు చేపట్టాలా? బోరుబావుల నుంచి జలభాండాగారాల వరకు పైపులైన్లను నిర్మించాల్సిన అవసరం ఉందా? తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. చెడిపోయిన వాటి మరమ్మతులు, అవసరమైన చోట పైపులైన్ల నిర్మాణానికి నిధుల మంజూరు గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులు యోచిస్తున్నారు.

**పొదుపుగా వాడితే ఇబ్బంది ఉండదు**

నీటిని అవసరానికి మించి వాడుతుండటం, వృథా చేస్తుండటంతో వేసవిలో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు పొదుపుగా వాడితే వేసవిలో ఇబ్బందులు ఉండవు. స్థానిక వనరుల గురించి తెలుసుకోవడం కోసం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. రమేశ్, ఈఈ, మిషన్ భగీరథ

# అకాల వర్షం.. కర్షకుడికి కష్టం

బోధన్ : ఎడపల్లికి చెందిన సాయిలు అనే రైతు సుమారు 25 ఎకరాల్లో వరి సాగు చేశారు. పది రోజులుగా వడ్లు పూర్తి స్థాయిలో ఆరబెట్టారు. ఇటీవల కురిసిన వర్షంతో ధాన్యం తడిసి రంగు మారి మొలకెత్తింది. ఒక్కో ఎకరానికి ఒక క్వింటాలు మేర నష్టపోయే అవకాశముందని రైతు వాపోతున్నారు.

బోధన్ నియోజకవర్గంలో సుమారు లక్ష ఎకరాల్లో కర్షకులు వరి సాగు చేశారు. కోతల ప్రారంభంలో వాతావరణం అనుకూలించినప్పటికీ వారం రోజులుగా వెంటాడుతున్న అకాల వర్షాలతో అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే కొందరు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, ప్రైవేటు వ్యాపారులకు వడ్లు అమ్మి గట్టెక్కారు. ప్రస్తుతం ధాన్యం విక్రయించని రైతులు కురుస్తున్న వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతుప్పటికీ ఆరే పరిస్థితి కనిపించడం లేదు. వడ్లు ఆరకపోతే మొలకెత్తి నష్టపోయే ప్రమాదముంది.

**కల్లాల్లో తడి..**

వర్షాలతో రెండు రోజుల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా స్వయం



సహాయక, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నిలిపేశారు. ఇప్పటికే తూకం వేసిన వడ్లను మాత్రం లారీల్లో మిల్లులకు తరలిస్తున్నారు. ప్రస్తుతం కల్లాల్లో ధాన్యంపై పట్టాలు కప్పి ఉంచగా.. మరికొందరు వాతావరణం మేఘావృతంగా ఉన్నా రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. కల్లాల్లో నేల తడిగా ఉండటంతో ధాన్యం రంగు మారే అవకాశముంది.

**స్పష్టత కరవు**

రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేస్తారా? లేదా? అనే విషయంపై స్పష్టత కరవైంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇస్తే మేలు జరుగుతుందని, లేకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుందని కర్షకులు చెబుతున్నారు.

**మిల్లుల్లో కూడా..**ఇప్పటి వరకు మిల్లులకు తరలించిన నాణ్యమైన ధాన్యాన్ని దించుకునే ందుకే కొందరు యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేశారు. రంగుమారిందని, తాలు ఉందని చెబుతూ ఆన్‌లోడింగ్‌లో జాప్యం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకుంటారా? లేక తిరస్కరిస్తారా? అన్న సందేహంలో కర్షకులున్నారు. జిల్లా యంత్రాంగం చొరవ చూపితే తప్ప ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు ప్రక్రియ సజావుగా సాగే పరిస్థితి కనిపించడం లేదు.

## పొదుపు పాఠం.. ఉన్నతికి మార్గం

మిర్యాలగూడ : సమాజంలో వచ్చిన మార్పుల కారణంగా.. దిగువ మధ్య తరగతి ప్రజలు సైతం ఉన్నత వర్గాలతో సమానంగా జీవించాలని తహతహలాడుతున్నారు. తమ స్థాయికి మించి ఖర్చు చేస్తూ ఒక దశలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొదుపు అనగానే కేవలం డబ్బు మాత్రమే కాకుండా నీరు, విద్యుత్తు, ఇంధనం, మాటలు ఇలా ప్రతీది పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్తు ఆనందమయం అవుతుంది. పొదుపును ప్రోత్సహించేలా ఏటా అక్టోబరు 30న 'ప్రపంచ పొదుపు దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**ఇంధన ధరలు ప్రియం..**

ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి ద్విచక్ర వాహనంతో పాటు అనేక మందికి కార్లు ఉన్నాయి. చిన్నచిన్న దూరాలకు సైతం వాహనాల వాడకం పెరగడంతో ఇంధన వినియోగం విపరీతంగా పెరిగింది. దీంతో ఇంధన ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా డబ్బు ఆదాతో పాటు పర్యావరణాన్ని సైతం కాపాడిన వారవుతారు.

**పిల్లలకు అవగాహన కల్పించాలి..**

ఒక్కోసారి మనకు తెలియకుండానే అనవసరమైన వాటికి డబ్బులు



విపరీతంగా ఖర్చు చేస్తుంటాం. తమ సంపాదనలో కనీసం 30 శాతం భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేయాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. దీనిపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. తపాలా కార్యాలయంతో పాటు బ్యాంకుల్లో పలు పథకాలు అందుబాటులో ఉన్నాయి.

**ఆదాతోనే భవిత..**

ఇటీవలి కాలంలో ఇళ్లతో పాటు వ్యవసాయం, వ్యాపార సంస్థలు, పరిశ్రమల కోసం విద్యుత్తు వినియోగం భారీగా పెరిగింది. దీంతో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దీనిలో భాగంగానే దామరచర్ల మండలంలో యాదాద్రి థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తోంది. అయితే ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్తు వినియోగించే వారు పొదుపుగా వాడితే ఎంతో ఆదా అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.


## గ్రంథర్వలోకానికి.. రప్పించి..!

చిట్యాల : మండలం గుండ్రాంపల్లిలో కొందరు యువకులు సొంతంగా విరాళాలు పోగుచేసి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన మెటీరియల్‌తో పాటు ఇతర పుస్తకాలు, దినపత్రికలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన 1990లో ఎస్సెస్సీ పూర్తిచేసిన కొన్ని బ్యాచుల పూర్వ విద్యార్థులు 24 మంది సంకల్పించారు. ఈ మేరకు 2006 ఏప్రిల్‌లో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య చేతుల మీదుగా దీన్ని ప్రారంభించుకున్నారు. 25 మంది సభ్యత్వం, వెయ్యి పుస్తకాలు, 4 దినపత్రికలు, 7 మ్యాగజైన్లతో ప్రారంభమైన గ్రంథాలయం ప్రస్తుతం 230 సభ్యత్వంతో 25 వేల పుస్తకాలు, 6 దినపత్రికలు, 25 మ్యాగజైన్లతో కొనసాగుతోంది.ఇక్కడికొచ్చే యువతను, చిన్నారులను




మరింతగా ఆకర్షించేందుకు గోడలపై రంగురంగుల చిత్రాలను, ప్రవేశద్వారం వద్ద స్ఫూర్తిమంతంగా గ్రంథాలయాల అభ్యున్నతికి పాటుపడిన జిల్లా వాసి వట్టికోట ఆళ్వార్‌స్వామితో పాటు ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రాలను గీయించారు. పుస్తకాల పఠన ప్రాధాన్యం వివరించే చిత్రాలను వేయించారు. 2018 నుంచి నేటి వరకు దినపత్రికలను బైండింగ్ చేయించి భద్రపరిచారు. పరిశోధన, కోర్టు కేసులు, పోటీ పరీక్షలకు వీటిని వినియోగించుకుంటున్నారని గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లంలో ప్రాథమిక అవగాహన కోసం విద్యార్థులకు వేసవి అవగాహన శిబిరాలు నిర్వహించామన్నారు. దాతల సహకారంతో నిఘా కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. గ్రంథాలయం సేవలను అందిపుచ్చుకొని ఇప్పటి వరకు 15 మంది వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం తమకు సంతోషాన్ని ఇస్తోందన్నారు.

## సౌర వెలుగుల కోటగిరి



నిజామాబాద్ : 'పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం' కింద సోలార్ ఆదర్శ గ్రామంగా కోటగిరి ఎంపికైనట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పథకం కింద జిల్లాకు ఒక మోడల్ సోలార్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. కేంద్ర పథకం మార్గదర్శకాల ప్రకారం 5 వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన 30 గ్రామాలను గతంలో ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. వీటి మధ్య పోటీ నిర్వహించడం జరిగిందన్నారు. ఆరు నెలల సమయం ముగిసిందని.. ఈ నేపథ్యంలో అత్యధిక సౌర విద్యుచ్ఛక్తి కలిగిన గ్రామంగా కోటగిరి నిలిచిందన్నారు. జిల్లా స్థాయి కమిటీ ఆ గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసిందన్నారు. గ్రామంలోని ప్రభుత్వ భవనాలపై కేంద్ర ప్రభుత్వ నిధులతో సౌర విద్యుత్ ప్లాంట్లు నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నివేదిక ఆమోదం పొందిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు.

# అపార్ నమోదుకు అవాంతరాలు



కరీంనగర్ : విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని పొందుపరిచేందుకు కేంద్రం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) గుర్తింపు కార్డుల కోసం విద్యార్థుల వివరాల నమోదుకు ఉమ్మడి జిల్లాలో అవాంతరాలు ఎదురవుతు న్నాయి. ప్రక్రియ ప్రారంభమై ఏడాదవుతున్నా ఉమ్మడి జిల్లాలో ఇంకా శతశాతం పూర్తి కాలేదు. ఆధార్, యూడైస్‌లలో విద్యార్థుల వివరాలు ఒకే రకంగా ఉంటేనే అపార్‌లో వివరాలు నమోదవుతున్నాయి. అయితే చాలా మంది విద్యార్థుల వివరాలు తప్పుగా ఉంటుండటంతో యూడైస్, అపార్‌లలో పేర్లు నమోదు కావడం లేదు. ఈ కార్డులో విద్యార్థులు ఎక్కడ చదివారు.. ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి.. వ్యక్తిగత వివరాలతో పూర్తి సమాచారం ఉంటుంది. ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి అపార్ కార్డులోని విశిష్ట సంఖ్యను ఉపయోగించాల్సి ఉంటుంది.

**పరిస్థితి ఇదీ..**

ఉమ్మడి జిల్లాలోని 3,536 పాఠశాలల్లో 5,29,516 మంది విద్యార్థులు చదువుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 64.20 శాతం, జగిత్యాల 83.83, పెద్దపల్లి 71.11, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 77.65 శాతం అపార్ నమోదైంది. ఇప్పటి వరకు 3,90,123 మంది విద్యార్థుల వివరాలు నమోదైనట్లు విద్యాశాఖ వివరాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో నమోదు చేయాల్సిన వివరాలు తక్కువగానే ఉన్నప్పటికీ.. ప్రైవేటులో ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రతిబంధకాలు ఇవీ...**

తల్లిదండ్రులు వారి పిల్లల పూర్తి వివరాలను ఉపాధ్యాయులకు అందించడం లేదువేరే రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాల బాలలకు ఆధార్ కార్డులు లేవు. ఇక్కడ పొందే వెసులుబాటు లేదు

యూడైస్ ప్లస్‌లో ఉన్న వివరాలు, ఆధార్ కార్డులో ఉన్న వాటిల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయి

ఆధార్ కార్డుల్లోని తప్పులను సవరించుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు

ఒకటికి మించి పాఠశాలల్లో చదివిన పిల్లల వివరాలు ఆయా పాఠశాలల్లో భిన్నంగా ఉంటున్నాయి

విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లు పాఠశాలల రికార్డుల్లో ఒకలా... ఆధార్, బ్యాంకు ఖాతాల్లో మరోలా ఉంటున్నాయి.


# శివారు.. విందులకు చిందు



హైదరాబాద్ : నగర శివార్లలోని ఫామ్‌హౌస్‌లు... రాత్రివేళ వినోదాలకు చిరునామాలుగా మారుతున్నాయి. మందు.. విందు.. పుట్టినరోజు వేడుకలతో పాటు ముజ్రా, రేవ్ పార్టీలూ కొనసాగుతున్నాయి. కొన్నింటిలో డ్రగ్స్ పార్టీలూ జరుగుతున్నాయి. రాజధాని పరిసర ప్రాంతాల్లో కొన్ని ఫామ్‌హౌస్‌లను మినహాయిస్తే.. రంగారెడ్డి జిల్లాలోని 900 ఫామ్‌హౌస్‌లకు అనుమతుల్లేవు. రెవెన్యూ రికార్డుల్లో ఇవి పంట పొలాలు, భూములే. వ్యవసాయేతర భూములుగా(నాలా కన్వర్షన్) మార్చుకోకుండానే వాటిని నిర్మిస్తున్నారు. మంచాల మండలం లింగంపల్లిలో కొద్దిరోజుల క్రితం ఓ ఫామ్‌హౌస్‌లో ముజ్రాపార్టీ నిర్వహించారు. **అక్రమార్కులకు ఆదాయ వనరు..** శంషాబాద్, రాజేంద్రనగర్, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, జన్వాడ, మొయినాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఎక్కువగా ఫామ్‌హౌస్‌లున్నాయి. వీటిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ముజ్రా పార్టీలు నిర్వహిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపుతున్నారు. శుక్ర, శనివారాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, పోలీసుల తనిఖీలు ఉండవంటూ భరోసా ఇస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..** మహేశ్వరం, మొయినాబాద్ మండలాల్లో అత్యధికంగా 500 ఫామ్ హౌస్‌లు ఉండగా.. కొహెడలో 35 ఉన్నాయి. పంచాయతీ, మున్సిపాలిటీల అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనల ప్రకారం కట్టాలంటే వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. 300 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే హెచ్‌ఎండీఏ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలి. కానీ ఎవరూ అలా చేయడం లేదు.

# ఒక్క రూపాయి వట్టిమాటే!



కరీంనగర్ : దస్త్రం ముందుకు కదలాలంటే ఎంతో కొంత ముట్టజెపాల్సిందేనని, లేదంటే దరఖాస్తులో కొర్రీలు పెట్టి షార్ట్‌ఫాల్ పేరుతో తిరస్కరిస్తున్నట్లు ఇటీవల భవన అనుమతికి దరఖాస్తు చేసిన ఓ ఇంజినీరు చెప్పారు. దస్త్రం ముందుకు కదలాలంటే ఎంతో కొంత ముట్టజెపాల్సిందేనని, లేదంటే దరఖాస్తులో కొర్రీలు పెట్టి షార్ట్‌ఫాల్ పేరుతో తిరస్కరిస్తున్నట్లు ఇటీవల భవన అనుమతికి దరఖాస్తు చేసిన ఓ ఇంజినీరు చెప్పారు. భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'బిల్డ్ నౌ' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎప్పటిలాగే ఇందులోనూ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం ఏర్పడుతోంది. దరఖాస్తు చేసిన తర్వాత ఏ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లాగిన్‌కు వెళ్తుందో, ఎప్పటిలోగా పరిష్కారం అవుతుందో తెలియక ప్రజలు అయోమయం చెందుతున్నారు. కార్యాలయాల్లో జరిగే అవినీతిని అరికట్టేందుకు తీసుకొచ్చిన ఈ యాప్‌తో ఉపయోగం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేయడం ప్రజల వంతవుతోంది.

ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల కోసం రూపాయికే భవన నిర్మాణ అనుమతులు ఇచ్చేందుకు నిర్ణయించింది. కానీ ఒక్క అధికారి కూడా రూపాయితో విధులు నిర్వహించడం లేదనే ఆరోపణలున్నాయి. భవన నిర్మాణ అనుమతులను వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ మున్సిపాలిటీలు, నగరపాలికల్లో మాత్రం డబ్బులిస్తేనే దస్త్రం కదులుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు పండగే**

75 గజాలలోపు స్థలంలో జీ౦1, సిల్ట్‌తోపాటు జీ౦1 అంటే మూడు శ్లాబులు వేసుకునేందుకు అనుమతులు ఇస్తోంది. కేవలం రూపాయికే ఇవ్వాల్సిన అనుమతులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా జీ౦1 అనుమతి తీసుకొని మరో అంతస్తు నిర్మించుకుంటే కొందరు అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని పనులు నిలిపివేయడం లేదంటే బేరసారాలు ఆడుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా కింది స్థాయి సిబ్బందే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఫిర్యాదు చేయండి– బషీర్, డిప్యూటీ సిటీ ప్లానర్, కరీంనగర్ నగరపాలిక**

పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులు భవన అనుమతులకు సంబంధించిన దస్త్రాలను వెంటనే పరిష్కరించకుండా షార్ట్‌ఫాల్ పెడితే కార్యాలయంలో ఫిర్యాదు చేయండి. ఏ కారణంతో తిరస్కరిస్తున్నారో తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తాం. తప్పుగా నమోదు చేసినా, వసూళ్లకు పాల్పడినట్లు తేలినా సంబంధిత ఉద్యోగులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

# శిథిల భవనాల్లోనే చదువులు

మల్యాల : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శిథిలావస్థకు చేరిన తరగతి గదుల మరమ్మతు కోసం ప్రభుత్వం మూడున్నర నెలల కిందట నిధులు మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు చోట్ల మినహా ఎక్కడా పనులు చేపట్టలేదు. 11 జూనియర్ కళాశాలల్లో మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం రూ.1,08,33,000 కేటాయించింది. వెంటనే పనులు చేపట్టేందుకు వీలుగా 25 శాతం నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరిన భవనాల్లోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు.నాలుగు చోట్లనే ప్రారంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉరుస్తున్న తరగతి గదుల మరమ్మతుతో పాటు విద్యుద్దీకరణ పనులు, పాడయిన కిటికీలు, తలుపులను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. తరగతి గదులతో పాటు భవనానికి రంగులు వేయించడం, గ్రీన్ బోర్డుల ఏర్పాటు, డెస్కు బెంచీల మరమ్మతు చేపట్టాల్సి ఉంది.

ధర్మపురి, రాయికల్, సారంగాపూర్, కోరుట్ల కళాశాలల్లో ఇటీవల



పనులు చేపట్టగా మిగిలిన చోట్ల ప్రారంభించలేదు.

వర్షాల కారణంగా మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వరండా, తరగతి గదులు ఉరుస్తున్నాయి. విద్యుత్ వైరింగ్ సరిగ్గా లేదు. కిటికీలు, ద్వారాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

# ఖమ్మం.. గుమ్మం దాటలే!

ఖమ్మం : మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అనేక మంది ఇళ్లకే పరిమితమయ్యారు. డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై వరద నీరు చేరటంతో రైళ్ల రాకపోకలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిలిపివేశారు. ఉదయం సికింద్రాబాద్ నుంచి ఖమ్మం మీదుగా వెళ్లాల్సిన కృష్ణా, గోదావరి, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు వివిధ రైళ్లను ఆపేశారు. విజయవాడ నుంచి వచ్చే రైళ్లలో కొన్నింటిని రద్దు చేయగా.. మరికొన్నింటిని దారి మళ్లించామని అధికారులు తెలిపారు. వర్షాల కారణంగా డోర్నకల్, మహబూబాబాద్, మధిర వంటి రైల్వేస్టేషన్లలో పలు రైళ్లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) రైలు ఖమ్మం రైల్వేస్టేషన్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరింది. ఇందులో వరంగల్‌కు చెందిన 20 మంది ప్రయాణికులను ఉండటంతో ఆర్టీసీ బస్సులో గమ్యస్థానానికి అధికారులు తరలించారు. మధ్యాహ్నం 2:10 గంటలకు వందేభారత్ రైలును తిరిగి విజయవాడ నుంచి గుంటూరు మీదుగా సికింద్రాబాద్ వెళ్లేలా దారి మళ్లించారు. ఖమ్మం–మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యాతండాలో వంతెనకు ఆనుకొని, ఖమ్మం గ్రామీణ మండలం తీర్థాలలో వంతెన మీదుగా ఆకేరు వాగు ప్రవహించింది. ఆయాచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఆకేరు వాగు నుంచి వరద జలాలు చేరుకోవటంతో ఖమ్మంలో మున్నేరు నీటిమట్టం క్రమేణా పెరుగుతోంది. నీటిమట్టం 16 అడుగులకు చేరుకున్నాక తొలి ప్రమాద హెచ్చరిక అమల్లోకి వచ్చింది. నయాబజార్ కళాశాల, రాంలీల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించారు. రాత్రి 11



గంటల సమయంలో మున్నేరు నీటిమట్టం 20 అడుగులకు చేరువైంది. రాత్రి 12 గంటలకు 22 అడుగులకు చేరింది. కేబీఆర్ నగర్, కాల్వొడ్డు ప్రాంతంలో మున్నేరు ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. కమిషనర్లు అభిషేక్ అగస్త్య, శ్రీనివాస్‌రెడ్డికి సూచనలు ఇచ్చారు. కాల్వొడ్డు వద్ద మున్నేరు వాగును సీపీ సునీల్‌దత్ పరిశీలించారు. పునరావాస కేంద్రాలను మేయర్ పునుకొల్లు నీరజ సందర్శించారు. టీఎన్జీఓస్ కాలనీకి నలుదిక్కులా నీరు నిలవటంతో రాకపోకలు స్తంభించాయి. ప్రజలు సహాయం కోసం కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూం నంబర్ 1077 లేదా సెల్‌ఫోన్ నంబర్ 90632 11298 ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

**16 చోట్ల పొంగిపొర్లిన వాగులు**

ఖమ్మం నగరం, కామేపల్లి, కారేపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, రఘునాథపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఏన్కూరు మండలాల్లో వర్షం ప్రభావం ఎక్కువగా కనిపించింది. 16 చోట్ల వాగులు పొంగినట్లు అధికారులు ప్రకటించారు. చింతకాని మండలం నాగులవంచ–పాతర్లపాడు మధ్య బండిరేవు వాగు ఉద్ధృతంగా ప్రవహించటంతో పంచాయతీ ట్రాక్టర్ అడ్డుపెట్టి రాకపోకలను నిలిపివేశారు. కొణిజర్ల మండలంలో పగిడేరు, నిమ్మవాగు, రఘునాథపాలెం మండలంలో వీఆర్ బంజర–పాపటపల్లి మధ్య బుగ్గవాగు పొంగిపొర్లాయి. తల్లాడ మండలం బిల్లుపాడు–రామచంద్రపురం, బిల్లుపాడు–కొత్తవెంకటగిరి, నూతనకల్–వెంకన్నపేట మధ్య వాగులు ఉద్ధృతంగా ప్రవహించాయి. కల్లూరు మండలంలో తాళ్లూరు–వెంకటాపురం మధ్య వాగు జోరుగా పారింది.

# ఆసుపత్రులకు ప్రారంభ గ్రహణం

ఖమ్మం: సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ వైద్యశాలల్లో అత్యాధునిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో నిర్మించిన నూతన భవనాలకు ప్రారంభ గ్రహణం పట్టుకుంది. భవనాలు నిర్మించి నెలలు గడుస్తున్నా.. అధికారులు వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**మధిరలో శిథిలావస్థకు చేరినా..**

మధిరలోని సీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరింది. 30 పడకలున్న దవాఖానాను వంద పడకలకు పెంచి ప్రాంతీ య ఆసుపత్రిగా మార్చారు. మూడేళ్ల క్రితం నూతన భవన నిర్మాణానికి రూ.34కోట్లు మంజూరుచేశారు. భవనం నిర్మించి ఏడాది దాటినా ప్రారంభానికి నోచుకోలేదు. పాత భవనంలో పెచ్చులూడుతుండటంతో వైద్యులు, రోగులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల రూ.6.50కోట్లతో పరికరాలు, శవాగారం, తాగునీటి వసతికి ప్రతిపాదనలు పంపించగా రూ.4.50కోట్లు మంజూరయ్యాయి. నూతన భవనం అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన సేవలందుతాయి.

**అసౌకర్యాల నడుమ ప్రజావైద్యం**

పెనుబల్లిలో రూ.7.30కోట్లతో 50 పడకలతో సీహెచ్‌సీని నిర్మించి మూడు నెలలైనా ప్రారంభించలేదు. పాత భవనంలోనే సేవలందిస్తున్నారు. బ్లడ్ బ్యాంక్ పరికరాలు వచ్చాయి. మంచినీటి వసతి లేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక పారిశుద్ధ్యం లోపించింది. ముగ్గురు వైద్యులకు సరిపడా గదులు లేవు. కొత్త భవనంలోకి ఆసుపత్రిని మారిస్తే స్త్రీ, పిల్లల వైద్యనిపుణులు, సర్జన్ అందుబాటులోకి వస్తారు.

**తొమ్మిది నెలలుగా నిరీక్షణ**

సత్తుపల్లి ప్రాంతీయ ఆసుపత్రి భవనాన్ని రూ.36కోట్లతో నిర్మించి తొమ్మిది నెలలవుతోంది. 50ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఆసుపత్రి భవనంలో ప్రస్తుతం వైద్యసేవలందిస్తున్నారు. ఇది శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. విద్యుత్తు, మరుగుదొడ్లు, నీటిసమస్య నెలకొంది. 50 నుంచి 100 పడకల స్థాయికి ఉన్నతీకరించిన ఈ ఆసుపత్రిలో రోజూ 350 మంది వరకు ఓపీ సేవలు పొందుతున్నారు.కొత్త దవాఖానా ప్రారంభిస్తే వైద్యసిబ్బంది సంఖ్య ప్రస్తుతం ఉన్న 12 మంది నుంచి 59కి చేరుతుంది. 30మంది నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్, పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

**సీహెచ్‌సీగా మారినా.. పీహెచ్‌సీ సేవలే..**

కల్లూరులో ఆరు పడకల పీహెచ్‌సీని 30పడకలతో సీహెచ్‌సీగా మార్చారు. రూ.10.50కోట్లతో నూతన వైద్యశాల నిర్మాణానికి 2023లో శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తికావడంతో జూన్ 30న గుత్తేదారుకు అప్పగించారు. ఆపరేషన్ థియేటర్‌లోని పరికరాలు, శవాగారం, బ్లడ్‌బ్యాంకు సామగ్రి రావాలి. ప్రస్తుతం పాత భవనంలో ఇద్దరు వైద్యులు, ఆరు పడకలతో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరటంతో వానొస్తే కారుతోంది. నూతన భవనాన్ని ప్రారంభిస్తే తొమ్మిది మంది వైద్యులు, ల్యాబ్, ఈసీజీ వంటి పరికరాలు, శవాగారం అందుబాటులోకి వస్తాయి.

చురకలు



# బకాయిల వసూళ్లపై దృష్టేదీ?

హైదరాబాద్: కోట్ల రూపాయలు అద్దెలు ఎగ్గొట్టినా.. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బకాయిదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు తప్ప బకాయి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడం లేదు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగిస్తామని ప్రకటించినప్పటికీ ఆ దిశగా కార్యాచరణ లేదు. బ్లాక్‌లిస్టులో పెట్టిన గుత్తేదారులు ఇతరపేర్లతో మళ్లీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు తదితర ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలు నడుస్తున్నాయి. వీటిని ప్రైవేటు వ్యక్తులు తీసుకొని నెలానెలా హెచ్ఎండీఏకు అద్దెలు చెల్లిస్తున్నారు. ఏటా తక్కువలో తక్కువ రూ. 25-30 కోట్లు ఆదాయం సమకూరుతోంది. వీటిని అద్దెకు తీసుకొన్న చాలామంది బకాయిలు ఎగవేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. గతంలో లుంబినీ పార్కులో ఓ రెస్టారెంట్ దాదాపు రూ. 1.5 కోట్లు బకాయి పడింది. చివరికి చెల్లింపు చేయకుండా కోర్టును ఆశ్రయించింది. అక్కడా వ్యతిరేకంగా తీర్పు రావడంతో రెస్టారెంట్‌ను హెచ్ఎండీఏ స్వాధీనం చేసుకుంది.

సరైన ప్రణాళికతో రూ.కోట్ల ఆదాయం: పర్యాటకులతో రద్దీగా ఉండే హుస్సేన్‌సాగర్ చుట్టూ హెచ్ఎండీఏ దృష్టిపెడితే రూ.కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దీనికి సరైన ప్రణాళికతో ముందుకు రావడం లేదు. అద్దెలకు తీసుకున్న వారు.. ధరావతుకు మించి బకాయిలు పెడుతున్నా పట్టించుకోకపోవడంతో అవి రూ.కోట్లలోకి చేరుతున్నాయి.

**పేరుకున్న బకాయిలు ఇలా...**

అమోఘ రెస్టారెంట్ - రూ. 1.50 కోట్లు
ఐమాక్స్ పార్కింగ్ ఏరియా - రూ. 45 లక్షలు
ఎన్టీఆర్ గార్డెన్ క్లోక్‌రూం - రూ. 16 లక్షలు
ఎన్టీఆర్ గార్డెన్ పార్కింగ్ ఏరియా - రూ. 21 లక్షలు
లుంబినిపార్కు క్లాక్‌రూం - రూ. 11 లక్షలు
సంజీవయ్య పార్కు ఫేస్ యాక్టివిటీ - రూ. 1.61 లక్షలు

# అంత్యక్రియలకు అగచాట్లే

చొప్పదండి: చొప్పదండి పురపాలక సంఘం పరిధిలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతులు లేక అంత్యక్రియలకు పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నిర్మాణాలు ఉన్నా.. అవి సరిపోవటం లేదు. పైగా నిర్వహణ లోపంతో అధ్వానంగా తయారయ్యాయి. సదుపాయాలు మచ్చుకు కూడా కనిపించటం లేదు. శానకుంట శ్మశానవాటికలో రూ.కోటితో గత నాలుగేళ్ల క్రితం కట్టెల నిల్వకు, పిండ ప్రదానం చేసేందుకు రెండు గదుల నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి మృతదేహాల దహనానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒకే రోజు ఇద్దరికి మించి వ్యక్తులు మృతి చెందితే కిందిభాగంలో కాల్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. లేకపోతే రోడ్డుకు సమీపంలో దహనం చేస్తున్నారు. కావాల్సినంత స్థలం ఉన్నప్పటికీ పరిసరాలు శుభ్రం చేసేవారు కరవయ్యారు. స్నానాలు చేసేందుకు ఏర్పాటు చేసిన నల్లాలు విరిగిపోయాయి. ఆ గదిలో పాకురు తేలి ప్రమాదకరంగా మారింది.

**అసంపూర్తి నిర్మాణం**

గుమ్లాపూర్ అడ్డరోడ్డులో పట్టణవాసుల కోసం నాలుగేళ్ల క్రితం పట్టణ ప్రగతి నిధులు రూ. 60 లక్షల వ్యయంతో వైకుంఠధామం నిర్మాణానికి



శంకుస్థాపన చేశారు. నేటికి పనులు పూర్తి కాలేదు. చుట్టూ ప్రహరీ, దహనం చేసేందుకు రెండు నిర్మాణాలు, స్నానాల గదులు మాత్రమే నిర్మించి వదిలేశారు. 90 శాతం పనులు పూర్తి కాగా.. వినియోగంలోకి తీసుకురావాల్సిన దిశగా ఎవరూ చర్యలు తీసుకోవటం లేదు. గ్రామాల్లో ఆహ్లాదకరంగా వైకుంఠధామాలు ఉండగా పట్టణంలో ఇందుకు భిన్నంగా దర్శనమిస్తున్నాయి. గుమ్లాపూర్ అడ్డరోడ్డు వైపు ఉన్న వారు రోడ్డుపక్కనే మృతదేహాలను దహనం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నీటి వసతి లేక ఇళ్లకు వెళ్లి స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

**నిధుల సమస్యతో పెండింగ్**

నిధుల సమస్యతో వైకుంఠధామాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. పట్టణవాసులకు అంత్యక్రియలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. రెండు నిర్మాణాలు పూర్తయితే అన్ని వసతులు సమకూరుతాయి.- నాగరాజు, పురపాలిక కమిషనర్ చొప్పదండ

# కనెక్షన్ మార్పుతో భారీగా రాబడి

హైదరాబాద్: రాబడిని పెంచుకునేందుకు జలమండలి చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గృహావసరాల కోసం నీటి కనెక్షన్ తీసుకుని వాణిజ్య అవసరాలకు వినియోగించుకుంటున్న వాటిపై వేటు వేస్తోంది. ఇలాంటివి సుమారు లక్షకు పైగా ఉంటాయని అంచనా వేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తోంది. ఎండీ కె.అశోక్‌రెడ్డి ఈ అంశంపై సమీక్షించి ప్రత్యేకంగా బృందాలను ఎంపికచేశారు. ఇవి క్షేత్రస్థాయి పరిశీలనలో కనెక్షన్ల వినియోగం తీరుని గుర్తించి మార్పునకు అర్హమైన వాటిని సిఫారసు చేస్తున్నారు. వీటిలో ప్రధానంగా వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షోరూంలు, పెద్దపెద్ద రెస్టారెంట్లు సహా ఇతర వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవి ఉన్నట్లు గుర్తించారు. సర్వే కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగిస్తున్నారు. నివాసం ఫొటోను అప్‌లోడ్ చేసి కేటగిరీ మార్పునకు సిఫారసు చేస్తున్నారు. ఉచిత తాగునీటి పరిధిలో ఉంటే తొలగించి కమర్షియల్ బిల్లుల జారీకి రంగం సిద్ధం చేశారు. 20 రోజులకుపైగా ఈ డ్రైవ్ కొనసాగుతోంది. తాజాగా గుర్తించిన వాటితో సుమారు రూ. 10 కోట్ల మేర రాబడి పెరిగే అవకాశాలు ఉన్నట్లు జలమండలి అంచనా వేస్తోంది.

# కన్నెపిల్ల కన్నుపడితే.. కెవ్వ్ కేక!!

## అబ్బాయిని ఎత్తుకెళ్లి ఆదివాసీ గోండు కన్యల వివాహం

## బీడీ స్వీకరిస్తే.. పరస్పర అంగీకారమే!

## సనాతన సంప్రదాయమే అయినా.. గోండుల సంస్కృతి విభిన్నమే!



మానవుడి జీవన విధానంలో వివాహ వ్యవస్థకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఒక్కో చోట ఒక్కో రకంగా వివాహాలు జరుగుతుండగా ఆదివాసీ గోండు గిరిజన తెగల్లో వివాహ వ్యవస్థ అన్నింటికీ భిన్నంగా విభిన్న ప్రత్యేకతను సంతరించుకుంది. కొండ కోనల్లో నివశిస్తూ సనాతన సాంప్రదాయాలను కాపాడుకుంటూ జీవనం సాగించే గోండు తెగల జీవన వైవిధ్యం ఎంతో ప్రత్యేకం. తెలంగాణ అటవీ ప్రాంతాలు, మహారాష్ట్ర సరిహద్దు, గోదావరి నది ఒడ్డున విస్తరించి ఉన్న గోండు తెగల జీవన విధానం మనసుకు హత్తుకునే సరళత, సహజత్వం, ఆప్యాయత, ప్రేమ, గౌరవంతో నిండి ఉంటుంది. పల్లె గాలిలో పచ్చదనం కలిసినట్టే, వారి ప్రేమలోనూ, బంధాల్లోనూ సువాసన ఉంటుంది. గోండు తెగకు చెందిన ఆదివాసీ గిరిజనుల జీవనవైవిధ్యం అనేది ఓ చిరస్మరణీయ జీవన తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. అడవిని అమ్మగా, ప్రకృతిని పరమేశ్వరుడిగా, ప్రేమను పవిత్రమైన బంధంగా భావించే గోండుల జీవన శైలి... భారతీయ ప్రజాస్వామ్యంలో ఓ విలక్షణం. ఆధునికత అనే అల జాతీయ సరిహద్దులు దాటి పల్లెల్లోకి దూసుకొస్తున్నా, గోండుల గుండెల్లో మాత్రం సంప్రదాయాల తోట ఇప్పటికీ పచ్చగా ఉంది.

**ప్రేమకు మొదటి అక్షరం - 'ఘోష' పండుగ...** వర్షాకాలం తీరగానే గోండుల పల్లెల్లో "ఘోష" పండుగల సందడి మొదలవుతుంది. ఇది కేవలం దేవతల పూజే కాదు, యువతకు కలిసే సమయమూ. రాత్రివేళ, ముదురుతున్న చందమామ వెలుగులో, అమ్మాయిలు అందంగా అలంకరించుకుని, యువతి, యువకులు ఒక వలయంగా చేరి డోలు మ్రోగిస్తూ, తాళం కలిపి పాటలు పాడుతారు. సంగీతమూ, సంబురాల మధ్య కొన్ని కళ్ళలో మాటలు, హృదయాల్లో పల్లవాలు కలుస్తాయి. ఇద్దరి మనసులు కలిస్తే, అది వ్యక్తిగత వ్యవహారం కాదు. రెండు కుటుంబాల సంగమం.

**"సగాలు" కలిస్తేనే సంబరం అంతా...** తాను మనసుపడి మనువాడాలనుకుంటున్న యువకుడి "సగాలు" (గోత్రాలు) తెలుసుకొని అతడు కాదన్నా బలవంతంగా ఎత్తుకెళ్లి వివాహం చేసుకుంటారు గోండు కన్నెలు. దీనిని వీరు "పీస్వట్ వాల్" అంటారు. వీరిలో 1నుండి 12 సంఖ్యల సగాలు ఉంటాయి. సరి సంఖ్యవారు బేసి సంఖ్యవారితో, బేసి సంఖ్య వారు సరి సంఖ్య వారితో మాత్రమే వివాహం చేసుకునుటకు అర్హులు. ముందుగానే అమ్మాయిలు తాను మనువాడాలనుకున్న యువకుడి సగాను తెలుసుకొని బలవంతంగా ఎత్తుకొని పోతారు. తరువాత అమ్మాయి తల్లిదండ్రులు, అబ్బాయి తల్లిదండ్రులు కాని ఊరిలో కొంతమంది పంచులను తీసుకెళ్లి పోయి సంబంధం ఖాయం చేసి పెళ్లి నిర్ణయించడం జరుగుతుంది.

**"బీడీ" బంధానికి ముద్ర...** ప్రేమకు గోండుల సమాజంలో అధికారిక ముద్ర వేయించేది బీడీ. ఇది అమ్మాయి అబ్బాయికి ఇచ్చే సంకేతం కాదు. ఇరు వర్గాల పెద్దల మధ్య జరిగే పవిత్ర ప్రక్రియ. మొదటగా ప్రేమికులు తమ కుటుంబాలకు నిర్ణయం చెబుతారు. ఇరు కుటుంబాల పెద్దలు కలుసుకుంటారు. సంభాషణ ముగిసిన తర్వాత అబ్బాయి వర్గ పెద్దలు బీడీ ఇచ్చి అమ్మాయి వర్గ పెద్దల చేతిలో పెడతారు. అమ్మాయి వర్గ పెద్దలు దాన్ని స్వీకరిస్తే సంబంధం కుదిరినట్టే. అనంతరం భోజనాలు ముగించుకుని వరుడు ఎన్ని "సగాలు" కు చెందిన వాడైతే అన్ని కనుపులు గల వెదురుకర్రను తీసుకెళ్లి ఇంటి చూరులో ఉంచుతారు. పెళ్లి జరిగే వరకు వెదురు కర్రను తనకు రక్షణగా అమ్మాయి వారు బావిస్తారు. వివాహం అదే రోజు నిర్ణయించబడుతుంది. బలవంతపు వివాహాలు మినహాయించి దాదాపు వరుడి ఇంటి వద్దనే పెళ్లిళ్లు జరుగుతాయి. వివాహం అనంతరం వాద్య పరికరాల చప్పుళ్లకు అనుగుణంగా లయబద్ధంగా ఆడామగ తేడాలేకుండా కలిసి గుస్సాడి నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటారు. "బీడీ అనేది మాకు ఒప్పంద పత్రం లాంటిది. సంతకం లేదు, ముద్ర లేదు%% కానీ బంధం బలమైనది," అంటారు మంగెల గోండుగూడెం గ్రామానికి చెందిన చిక్రం భీమ్రావు. ఈ బీడీ ఒక సాంప్రదాయ నిబంధన. పెద్దల ఆశీస్సుతో, రెండు కుటుంబాల పరస్పర గౌరవంతో... ఇది ప్రేమ సంబంధాన్ని కుటుంబ బంధంగా మార్చే గొప్ప కార్యక్రమం.

**అబ్బాయిని ఎత్తుకెళ్లే వధువు...** వింతగా అనిపించే ఈ సంప్రదాయం గోండుల ప్రత్యేకత. ప్రేమించిన యువకుడిని పెద్దల ఆశీస్సుతో, సంప్రదాయ పాటల మధ్య, వరుడిని తన ఊరికి తీసుకెళ్తుంది. అక్కడ మూడు రోజుల పాటు సంబరాలు, విందులు జరుగుతాయి. దీన్ని వారు "ఎత్తుకెళ్లడం" అంటారు గాని, ఇది పారిపోవడం కాదు. పెద్దల అంగీకారంతో జరిగే సంప్రదాయ వివాహమే. "మా బిడ్డ మనసు పెట్టిన వాళ్లని మేం అంగీకరిస్తాం. మన వాళ్ల ప్రేమను పెంపొందించడంలో మేం అడ్డం కాదు.. ఆదరణ," అంటారు పెద్దమ్మ జంగిబాయి.

**సంభాషణలో ప్రేమ.. సంబురంలో వివాహం...** ఘోష పండుగల్లో కలుసుకునే జంటలు తల్లిదండ్రులకు తమ అభిప్రాయాన్ని చెబుతారు. అనంతరం పెద్దలు మాట్లాడుకుంటారు. బంధుత్వాలను, వంశాన్ని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. తర్వాతే బీడీ ఇచ్చిపుచ్చే సంబర ఘట్టం వస్తుంది. ఇది ఒక విచిత్రమైన గౌరవమైన సమ్మేళనం.

**సమాన హక్కులకు పునాది...** గోండుల సమాజంలో మహిళలకు ఉన్న గౌరవం చెప్పుకోదగ్గది. పొలం పనులు, అడవులలో నుంచి వేట, వనసంపద సేకరణ, కుటుంబ నిర్వహణ, ప్రతి అంశంలోనూ పురుషులతో సమానంగా మహిళలు భాగస్వామ్యం వహిస్తారు. భర్తను భాగస్వామిగా, భార్యను గౌరవంగా చూడటం గోండుల గొప్పతనానికి నిదర్శనం. వారి యొక్క నిజమైన బంధం.

**ప్రకృతే పరమదేవత...** గోండుల ఆధ్యాత్మికత ప్రకృతికి అంకితం. "ఫడె పెన్", "ఆంగాదేవ్", "పెర్దేవ్" వంటి స్థానిక దేవతలు మట్టి విగ్రహాల రూపంలో ఉంటాయి. పూలతో, ఆకులతో అలంకరించి పూజిస్తారు. నీరు, వృక్షం, నేల ఇవే వారి దైవాలు. "అడవి మాకు అన్నం ఇస్తుంది, చెట్లు ఊపిరి ఇస్తాయి. వాటినే మేం పూజిస్తాం," అని చెబుతున్నారు చిత్రవేణి గూడెం గ్రామ పెద్ద చిక్రం మారుతి. అడవులను వీడి గ్రామ శివార్లలో నివాసం ఏర్పాటు చేసుకుంటున్న ఈ తెగల్లో ప్రస్తుత కాలంలో ఇలాంటి ఆచారాలు కొంత తగ్గుముఖంపట్టినా, ఇంకా మారుమూల గిరిజన తండాలలో ఇలాంటి సాంప్రదాయాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఆస్తులు, అంతస్తులు చూసీ పెళ్లిళ్లు చేసే ఈ రోజుల్లో పైసా కట్నం లేకుండా సాంప్రదాయాలను కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీల జీవన వైవిధ్యం ఎంతైనా వింతేకదా..!!

**(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)**

# భారత స్వాతంత్ర్య సమరానికి పునాది

# బారక్‌పూర్‌లో సిపాయీల తిరుగుబాటు

## నవంబర్ 2... బారక్‌పూర్ తిరుగుబాటు దినం

1824 బారక్‌పూర్ తిరుగుబాటు బ్రిటిష్ పాలనపై భారతీయుల అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది. 1857లో భారతదేశంలో జరిగిన మొదటి స్వాతంత్ర్య సమరంలో బారక్‌పూర్ తిరుగుబాటు ఒక ప్రధాన ఘట్టంగా నిలిచింది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు వ్యతిరేకంగా విరుచుకుపడిన ఈ తిరుగుబాటు, భారతీయులలో స్వాతంత్ర్య భావనను రగిలించిన మొదటి ప్రణాళికాత్మక ఆందోళనగా ప్రసిద్ధి చెందింది. బారక్‌పూర్‌లోని సైనిక స్థావరంలో 1824 నవంబర్ 2న జరిగిన ఈ తిరుగుబాటు, తరువాత జరిగిన దేశవ్యాప్త 1857 సిపాయిల తిరుగుబాటుకు ఆజ్యం పోశింది. తిరుగుబాటు పుట్టుకకు ప్రధాన కారణాలు: ప్రధానంగా గ్రీజు కాట్రిడ్జ్‌ల సమస్య. బ్రిటిష్ పాలకులు సైన్యంలో కొత్త రకం రైఫిల్‌లను ప్రవేశపెట్టడం ప్రారంభించారు. ఈ రైఫిల్‌లకు ఉపయోగించే కాట్రిడ్జ్‌లు గొడ్డు మాంసం మరియు పంది మాంసం కొవ్వుతో తయారు చేయబడ్డాయి. సిపాయిలు ఈ కాట్రిడ్జ్‌లను నోటితో పీక్కునే పరిస్థితి ఉండటంతో, హిందువులకు పవిత్రమైన గొడ్డు మరియు ముస్లింలకు పవిత్రమైన పంది మాంసం ఉన్న కాట్రిడ్జ్‌లు అనుచితంగా భావించారు. ఈ విధానం వారి మత విశ్వాసాలకు, అభిమానాలకు విరుద్ధంగా ఉండటం, సైనికులను కదిలించిన ప్రధాన కారణంగా మారింది.

సామాజిక-ఆర్థిక అసంతృప్తి: బ్రిటిష్ పాలన కింద భూమి కోల్పోవడం, అధిక పన్నుల భారం, సామాజిక అసమానతలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. బ్రిటిష్ వారు తీసుకున్న అనేక సామాజిక, ఆర్థిక సంస్కరణలు భారతీయుల సంప్రదాయాలకు విరుద్ధంగా ఉండడంతో, ప్రజలు ఆర్థికంగా మరియు సామాజికంగా నష్టపోయారు. ఈ అసమానతలు ప్రజలను తిరుగుబాటుకు దారితీశాయి. బ్రిటిష్ విధానాలు మరియు చట్టాలు: బ్రిటిష్ పాలకులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అపహాస్యం చేయడం భారతీయులలో ఆగ్రహాన్ని రగిలించింది. హిందూ, ముస్లిం సమాజాలను అవమానించే విధంగా అనేక చట్టాలు తెచ్చారు. వితంతు వివాహాలు, సతీ నిషేధం వంటి సమాజానికి విరుద్ధమైన విధానాలు భారతీయులలో అసంతృప్తికి కారణమయ్యాయి. సైనిక ఫిర్యాదులు: బ్రిటిష్ సైన్యంలో భారతీయ సిపాయిలకు తగిన వేతనం లేకపోవడం, ప్రమోషన్‌లలో వివక్ష ఉండటం, వలస పాలకుల పట్ల సైనికులకు వ్యతిరేకత కలిగించే ప్రధాన కారణాలుగా నిలిచాయి. అనేక సందర్భాలలో సైనికుల ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, వారిలో అసంతృప్తి పెంచింది.

**మంగళ పాండే వీరోచిత కృషి...** 1857 మార్చి నెలలో బారక్‌పూర్‌లోని సిపాయి మంగళ పాండే గ్రీజు కాట్రిడ్జ్‌లను ఉపయోగించడానికి నిరాకరించాడు. స్వతహాగా తన మత విశ్వాసాల కోసం నిలబడిన ఆయన, బ్రిటిష్ అధికారిని తనకు తానే ప్రతిఘటించాడు. ఈ చర్య బారక్‌పూర్ తిరుగుబాటుకు నాంది పలికింది.

మంగళ పాండేను బ్రిటిష్ వారు మరణశిక్ష విధించి ఉరి తీశారు. అయినప్పటికీ, ఆయన వీరోచిత పోరాటం సిపాయిలలో విస్తృతంగా ఆకర్షణ కలిగించి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో తిరుగుబాటుకు ప్రేరణ ఇచ్చింది.

**బారక్‌పూర్ తిరుగుబాటుకు ప్రభావం...** 1857 సిపాయిల తిరుగుబాటు: బారక్‌పూర్ తిరుగుబాటు దేశవ్యాప్తంగా భారతీయులలో తిరుగుబాటుకు మేల్కొలుపు కలిగించింది. సిపాయిల తిరుగుబాటు ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనకు భారీ సవాల్‌గా మారి, బ్రిటిష్ పాలకులను కుదిపేసింది. బ్రిటిష్ పాలనలో మార్పులు: ఈ తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పాలకులు భారతీయుల సంస్కృతిని గౌరవించడం ప్రారంభించారు. బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల మనోభావాలకు అనుగుణంగా అనేక సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని గ్రహించింది. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి పునాది: బారక్‌పూర్ తిరుగుబాటు భారత స్వాతంత్ర్య పోరాటానికి దారితీసిన మొదటి ప్రణాళికాత్మక చర్యగా నిలిచింది.

ఈ సంఘటన భారతీయులలో దేశభక్తిని, స్వాతంత్ర్యతాలూకు ప్రాధాన్యతను పెంచింది. 1857లో బారక్‌పూర్ తిరుగుబాటు భారతీయుల చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. భారతదేశంలో మొదటి స్వాతంత్ర్య యుద్ధం భారతీయుల ఆత్మాభిమానం, అసంతృప్తిని ప్రతిబింబిస్తుంది. దేశంలోని ప్రజలు, సైనికులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిలబడే శక్తిని పొందారు. ఈ తిరుగుబాటు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి మార్గదర్శకంగా మారింది.

# ఆదాయవృద్ధికి కసరత్తు

కరీంనగర్ : నగరపాలికలు, పురపాలికల్లో వ్యాపార లైసెన్స్‌ల రుసుము ద్వారా ఆదాయం పెంచుకోవడానికి ఉమ్మడి జిల్లాలో ముమ్మర కసరత్తు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ విషయంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో బల్దియాల ఆదాయానికి గండి పడిందని భావిస్తున్న అధికారులు ప్రస్తుతం వాణిజ్య, మిశ్రమ వినియోగ (గృహం, వాణిజ్య భవనం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు. ఉమ్మడి జిల్లాలో 44,347 మిశ్రమ ఆస్తులు ఉన్నట్లు రాష్ట్రస్థాయి అధికారులు నివేదిక పంపగా క్షేత్రస్థాయిలో 33,188 దుకాణాలకు లైసెన్స్ లేనట్లు వార్డు అధికారులు గుర్తించారు. వాటికి లైసెన్సులు తీసుకునేలా వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు.

**అత్యధికంగా రూ.లక్ష ఫీజు**

రహదారి వెడల్పు ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు పొడవు, వెడల్పు కొలతలు నిర్వహిస్తున్నారు. సాధారణం అయితే ఒక చదరపు అడుగుకు రూ. 5 చొప్పున లెక్కిస్తున్నారు.

ఒక్కో దుకాణానికి వ్యాపార లైసెన్స్ కనీసం రూ. 200ల నుంచి



అత్యధికంగా రూ.లక్ష ఉంటుంది. దీనికంటే అధిక మొత్తం వేయడానికి వీల్లేకుండా శ్లాబు విధించారు.

పునరుద్ధరించుకోకపోతే..

ఆస్తి పన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా వేస్తారు.

ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు.

ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేస్తే 25 శాతం జరిమానా వేస్తున్నారు.

ఇవీ సమస్యలు

ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న దుకాణాలు, సంస్థలు, క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

లైసెన్స్ వివరాలను ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తరువాత వాటిని మార్చడం సాధ్యం కావడం లేదు. దీంతో వ్యాపారి పేరుపై, ఇంటి పేరుపై ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు నమోదవుతూనే ఉన్నాయి.

కొందరు వ్యాపారులు వ్యాపారంలో దెబ్బతిని కొన్నేళ్లు మూసేసి, తరువాత కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు.

కొత్త వ్యాపారానికి లైసెన్స్ తీసుకోవాలనుకుంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించి రుసుము బకాయిలు కట్టమంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

# ఇరుకు గదులు.. ఇక్కట్ల నడుమ చదువులు

పెద్దపల్లి :విద్యార్థులు వరండాలో ఉన్న ఈ చిత్రం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనిది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 166 మంది విద్యార్థులు, మరో 24 మంది పూర్వప్రాథమిక పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇందులోనే రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో పైపెచ్చులు ఊడిపోయి, ఉరుస్తున్నాయి. మిగిలిన మూడు గదుల్లో తరగతులను నడుపుతుండగా మరో గదిని స్టాఫ్‌రూంగా వినియోగిస్తూనే అందులోనే పాఠాలు బోధిస్తున్నారు. మిగతా తరగతులను వరండాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదుల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రాచర్ల బొప్పాపూర్‌లో శివకేశవస్వామి ఆలయం వద్ద ఉన్న పాఠశాల భవనం పురాతనంగా మారడంతో రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద నిర్మించిన నూతన పాఠశాల భవనం ఇదీ. రూ. 28 లక్షల సీడీపీ, రూ. 7.80 లక్షల 'మన ఊరు- మనబడి' నిధులను వెచ్చించారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో నాలుగు తరగతి గదులున్నాయి. ఈ భవనం వెనుకాలే రూ. 24 లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రూ. 3.40 లక్షల ఈజీఎస్ నిధులతో వంటగది, బాలురు, బాలికలకు వేర్వేరుగా రూ. 12.40 లక్షలతో శౌచాలయాలు,



రూ. 9.50 లక్షల ఈజీఎస్ నిధులతో ప్రహరీలను నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ. 4 లక్షల విలువైన కరెంటు, రంగులు వేసే పనులు మిగిలిపోయాయి. ఇలా అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తయి సుమారు నాలుగేళ్లు దాటుతున్నా వినియోగంలోకి తేవడం లేదు. జిల్లాలో 503 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద 283 బడులను ఎంపిక చేశారు. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యుత్తు, తాగునీరు, భవనాల మరమ్మతులు, శౌచాలయాల మరమ్మతులు, లేనిచోట కొత్తగా నిర్మాణాలు తదితర కనీస వసతుల కల్పనకు రూ. 11 కోట్లు వెచ్చించారు. అంతకుముందు 'మన ఊరు- మన బడి'లో భాగంగా 172 పాఠశాలల్లో ఆయా వసతులు కల్పించారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. 128 సర్కారు బడుల్లో కనీసం 189 అదనపు తరగతి గదులు అత్యవసరమని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిధులు లేక అనేక పాఠశాలలు నీరసించిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇరుకు గదులు, వరండాలు, చెట్ల కింద తమ చదువులను నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి, పాఠశాలల్లో నెలకొన్న అదనపు తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు: వినోద్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం సందర్శిస్తున్నాం. ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల కొరతను గుర్తిస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నాం. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూడడమే మా లక్ష్యం. నిధులు మంజూరు కాగానే అదనపు తరగతి గదుల నిర్మాణాల పనులు చేపడుతాం.

చురకలు



# సర్కారు బడి.. భద్రత కొరవడి!

ఒంగోలు : జిల్లాలోని కొన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అల్పపీడనం, మొంథా తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గత పది రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. జిల్లాలో 2,126 పాఠశాలలుండగా గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో తొలి దశలో కేవలం అంతర్గత సౌకర్యాలకు ఎక్కువ నిధులు వెచ్చించారు. కేవలం 450 పాఠశాలల్లో మాత్రమే తరగతి గదులు నిర్మించారు. రెండో దశలో 870 పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం చేపట్టినా నిధుల్లేక మధ్యలోనే నిలిచిపోయాయి. మిగిలినవాటిలో 250కుపైగా పాఠశాల భవనాలు కాలదోషం పట్టి దెబ్బతిన్నాయి. ఇలాంటివి మార్కాపురం డివిజన్‌లోనే 150కు పైగా ఉన్నాయి. తుపాను నేపథ్యంలో మూతపడిన పాఠశాలలు తిరిగి గురువారం నుంచి పునఃప్రారంభమవుతున్నాయి.



గతంలో పుల్లలచెరువు మండలంలో ఓ పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థి మృతిచెందాడు. దర్శి మండలం కృష్ణాపురం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు కారిపోతోంది. మద్దిపాడు మండలం బసవన్నపాలెం, నాగులుప్పల పాడు మండలం పోతవరం, మద్దిరాలపాడు, గిద్దలూరు, కనిగిరి, ఎకంభం, కొమరోలులోని పలు ఎయిడెడ్ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పొదిలి మండలం జువ్వలేరు, నంది పాలెం ప్రాథమిక పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయి. నందిపాలెం పాఠశాలలో బాగున్న ఒకే ఒక్క గదిలో ఒకటి నుంచి అయిదు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖాధికారుల సూచనల మేరకు కొన్నిచోట్ల ఉపాధ్యాయులు పిల్లలు ఆ వైపు వెళ్లకుండా ముళ్లకంపలు, తాళ్లు కట్టారు. ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాలు భద్రతపై కనీస చర్యలు తీసుకోవడంలేదు.

# ఇంతింతై.. విశ్వవ్యాప్తమై

కర్నూలు : మహిళలు నిత్యం రూపాయి పొదుపు చేస్తూ 'ఇంతి'ంతై 'విశ్వ'వ్యాప్తమయ్యారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 10 లక్షల మంది ఆర్థిక పాఠాలు నేర్చుకొన్నారు. తాము తయారుచేసిన ఉత్పత్తులు విశ్వ విపణిలో విక్రయిస్తున్నారు. ఇన్నాళ్లూ ఊరికి..వీధికి పరిమితమైన పొదుపు మంత్రం ప్రపంచమంతా వినిపిస్తున్నారు.

**నాడు ఛీకొట్టిన బ్యాంకులు**

మహిళా సంఘాలు ఏర్పడిన మొదట్లో రుణాలు ఇవ్వడానికి బ్యాంకు అధికారులు ఛీకొట్టారు. అవే బ్యాంకులు నేడు పిలిచి రుణాలిస్తున్నాయి. 1998లో ఒక్కో సంఘానికి రూ.10 వేల రుణం ఇవ్వడం మొదలు పెట్టాయి. అలా రూ.50 వేలు, రూ.లక్ష, రూ.5 లక్షలు.. ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.20 లక్షల వరకు రుణాలిస్తుండటం విశేషం. పొదుపు సొమ్ము దారి మళ్లకుండా అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నగదు రహిత సేవలకు ప్రాధాన్యమిస్తోంది. ప్రత్యేకంగా స్త్రీనిధి యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిద్వారా రుణాలు పొందడం.. చెల్లింపులకు అవకాశం కల్పించింది.

**డిజిటల్ లక్ష్ములు**

పట్టణ స్వయం సహాయ సంఘాల సభ్యుల్లో డిగ్రీ చదివిన మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు డిజిటల్ సేవలు అందించే లక్ష్యంతో మెప్మా ఆధ్వర్యంలో 'డిజి లక్ష్మి' కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది.పొదుపు మహిళలు కామన్ సర్వీస్ సెంటర్లు నెలకొల్ప



నున్నారు. ఒక్కో డిజి లక్ష్మి ద్వారా పొదుపు మహిళలతో పాటు మరో ఇద్దరు, ముగ్గురికి ఉపాధి కల్పించేందుకు శ్రీకారం చుట్టారు.
ఉమ్మడి జిల్లాలో మొత్తం 874 మందిని ఎంపిక చేశారు. ప్రస్తుతం వీరికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**రూపాయితో మొదలు పెట్టి**

1995లో ఒక్కో మహిళ నిత్యం రూపాయి చొప్పున నెలకు రూ.30 ప్రకారం ఒక్కో సంఘంలో పదిమంది మహిళలు కలిసి నెలకు రూ.300 పొదుపు చేసేవారు.1998 నుంచి 2010 నాటికి ఒక్కో మహిళ నెలకు రూ.50.. 2021-25 సంవత్సరానికి రూ.500 పొదుపు చేసే స్థాయికి చేరారు.ఒక్కో పొదుపు సంఘంలో సగటున రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల మేర దాచుకున్న సొమ్ము ఉంది.
ఒక్కో సభ్యురాలి పొదుపు మొత్తం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు చేరింది.

**అంతర్జాలంలో విక్రయాలు**

మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను మైస్టోర్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అమ్మకాలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల వివరాలను ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)లో అప్‌లోడ్ చేశారు. జూట్, లెదర్ బ్యాగులు, డోర్ మ్యాట్లు, చీరలు, మట్టి ప్రమిదలు తదితర వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచారు.కర్నూలు జిల్లా మెప్మా పరిధిలోని స్వయం సహాయ సంఘాల మహిళలు తయారు చేసిన 1,200 వస్తువులను ఓన్‌డీసీ ఆన్‌బోర్డులో ఉంచారు. రూ.1.63 లక్షల విలువ చేసే వస్తువులను పలువురు అంతర్జాలంలో కొనుగోలు చేయడం విశేషం.
నంద్యాల జిల్లాలో మెప్మా పరిధిలో 39 రకాల వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచగా.. రూ.2.50 లక్షల విలువైన విక్రయాలు జరిగాయి. నంద్యాల డీఆర్డీఏ ద్వారా 678 వస్తు ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో పెట్టగా సుమారు 4 వేల వస్తువుల అమ్మకాలు సాగాయి.

# కట్టలు ఇస్తారు.. ఎత్తుగా కట్టేస్తారు



ఆదోని : ఉమ్మడి జిల్లాలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో అనుమతిలేని భవన నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఓవైపు భవన నిర్మాణ క్రమబద్ధీకరణ (బీపీఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తే.. మరోవైపు ఇదే అదునుగా అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. వీటిని గుర్తించి కట్టడి చేయాల్సిన పుర యంత్రాంగం చోద్యం చూస్తోంది.

**అనుమతులు లేకుండానే**

ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి ముందు అనుమతులు తీసుకోకుండా నిర్మించిన ఇళ్లను బీపీఎస్ కింద పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అనుమతుల్లేని ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న వాటితోపాటు ప్రస్తుతం అదనపు నిర్మాణాలను బీపీఎస్ గడువు తేదీలోగా ఆమోదం పొందేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.
కర్నూలు నగరపాలక సంస్థతోపాటు తొమ్మిది పురపాలికల్లో లెక్కిస్తే భారీగా ఇళ్ల నిర్మాణాలున్నాయని సమాచారం. కర్నూలు నగరంలో వెయ్యికిపైగా, ఆదోనిలో 500, నంద్యాలలో వెయ్యి, డోన్, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ తదితర పురపాలికల్లో రెండు అంకెల్లో ఉన్నాయి.
ఇవి పాటించాల్సిందే..తాజాగా.. అనుమతులు పొంది ఇళ్లు, భవనాలు నిర్మించాలంటే బృహత్తర ప్రణాళికకు అనుగుణంగా రహదారులకు సొంత స్థలం వదలాల్సి ఉంటుంది.
వాణిజ్య సముదాయాలకైతే రహదారులతోపాటు పార్కింగ్, సెట్ బ్యాక్‌కు స్థలం వదలాలి. ఈ నిబంధనలు పాటించడం.. స్థలంతోపాటు రుసుం కూడా చెల్లిస్తే గిట్టుబాటు కాదన్న ఉద్దేశంతో.. ఎప్పటికైనా బీపీఎస్ పథకం వస్తుందన్న ధీమాతో అక్రమార్కులు అనుమతులేకుండానే నిర్మాణాలు సాగిస్తున్నారు.
కట్టడి చేయాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొందరు సిబ్బంది మామూళ్లు తీసుకొని వదిలేస్తున్నారని సమాచారం.

**క్రమబద్ధీకరిస్తే రూ.కోట్ల ఆదాయం**

అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తే పురపాలక సంఘాలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. కొందరు అధికారులు, సిబ్బంది తప్పిదాలతో ఆదాయానికి గండి పడుతోంది.
ఇప్పటికే ఇంటింటి సర్వేలో పన్ను (ట్యాక్స్) పరిధిలోకి రాని ఇళ్లు, అదనపు నిర్మాణాలను గుర్తించారు. గత వైకాపా పాలనలో జరిగిన తప్పిదాలను సరిచేసి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
అక్రమాల నివారణలో ప్రధానంగా వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులది కీలకపాత్ర. వీరి పరిధి చిన్నది కావడం, అక్రమ నిర్మాణాలు గుర్తించడం సులభతరమే..

**క్షేత్రస్థాయిలో ఇలా..**

కొందరు ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు కుమ్మక్కై మామూళ్ల దందా సాగిస్తున్నారు. ఇప్పటికే కొందరు సచివాలయ ఉద్యోగులు ఇతరుల లాగిన్‌ల ద్వారా ప్లాన్లు రూపొందించి వాటిని అప్‌లోడ్ చేస్తూ ప్యాకేజీల రూపంలో మాట్లాడుకుని రెండు చేతులా సంపాదిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు విజిలెన్స్ బృందాలను నియమించి ఆకస్మిక తనిఖీలు జరిపితే అక్రమాలను నివారించవచ్చని నిపుణుల అంచనా.

# పశువైద్య వర్సిటీకి 'జీవ'సత్వాలు



తిరుపతి : కూటమి ప్రభుత్వం వర్సిటీల ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. ఇన్నాళ్లూ రెగ్యులర్ వర్సిటీల పాలక మండళ్ల భర్తీ, వాటి సమస్యలపై దృష్టిసారించగా ఇప్పుడు పాడి, అనుబంధ రంగాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించింది. ఇదే లక్ష్యంతో తిరుపతి కేంద్రంగా 2005లో ఆవిర్భవించిన ఎస్వీ పశువైద్య వర్సిటీలో పెద్దఎత్తున అధ్యాపక పోస్టుల భర్తీకి నడుం బిగించింది.
**ఖాళీలు..** వర్సిటీలో 150 పశువైద్య అధ్యాపక పోస్టులను 2013లో భర్తీ చేశారు. తదనంతరం పట్టించుకోకపోవడంతో 253 అధ్యాపక పోస్టులు ఖాళీ అయ్యాయి. మరోవైపు వర్సిటీ ఆవిర్భావం నుంచి బోధనేతర ఉద్యోగుల నియామకం జరగలేదు. 561 బోధనేతర పోస్టుల్లో 388 ఖాళీలు ఉన్నాయి.

**కీలక విభాగాలు, పరిశోధనలు**

తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, విజయనగరం జిల్లా గరివిడిలోని పశువైద్య కళాశాలలు, రాష్ట్రవ్యాప్తంగా ఏడు పశు పరిశోధన స్థానాలు, తిరుపతిలోని రాష్ట్రస్థాయి పశువ్యాధి నిర్ధరణ ప్రయోగశాలతో పాటు పది పశుసంవర్ధక పాలిటెక్నిక్‌లు, మరో 12 వర్సిటీ గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్‌లు వర్సిటీ పరిధిలో ఉన్నాయి. దక్షిణ భారతదేశంలోనూ ప్రైవేటురంగంలో పశువైద్య విద్య అందుబాటులో లేకపోవడంతో వర్సిటీ కీలకంగా పనిచేస్తోంది.

**గరివిడి గుణపాఠం**

గత ప్రభుత్వం అధ్యాపకుల కొరతను ఖాతరు చేయకుండా విజయనగరం జిల్లా గరివిడిలో ప్రారంభించిన పశువైద్య కళాశాలకు భారత పశువైద్య మండలి(వీసీఐ) అనుమతి నిరాకరించడంతో బీవీఎస్సీ పూర్తి చేసుకున్న 75 మంది విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం 253 అధ్యాపక పోస్టుల భర్తీకి అనుమతించడంతో వర్సిటీకి జీవం పోసినట్లయింది. **అడ్డంకులు లేకపోలేదు..** వైకాపా హయాంలో పలువురు ఉద్యోగులు, బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఏకంగా 96 కేసులు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వివాదాలు ప్రస్తుత నియామకాలకు అడ్డు తగిలే అవకాశాలు ఉన్నట్లు వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

# టోల్ కట్టడమే కాదు.. సేవలూ పొందొచ్చు..!




చిత్తూరు : జాతీయ రహదారులపై ప్రయాణ సమయంలో ఫాస్టాగ్‌తో ఆటోమేటిక్‌గా టోల్‌ను వసూలు చేస్తుంటారు. డబ్బులు కట్టి ప్రయాణం చేసే మనకు టోల్ రుసుం వసూలు చేసే యాజమాన్యాలు కొన్ని సౌకర్యాల్ని కల్పించాలి. వాహనదారులకు అత్యవసర పరిస్థితుల్లో ఈ సేవలు వినియోగించుకోవడంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
అకస్మాత్తుగా వాహనం ఆగితే..టోల్ రోడ్డులో అకస్మాత్తుగా వాహనం ఆగిపోతే, వాహనాన్ని లాగడం కోసం ఎక్కడి నుంచో ఎవరినో పిలవాల్సిన అవసరం ఉండదు. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033కి కాల్ చేస్తే తక్షణసాయం అందుతుంది. పోలీసు సేవల కోసం 112 నంబరును సంప్రదించాలి.

**సౌలభ్యం, విశ్రాంతి సౌకర్యాలు**

వాహనాల పార్కింగ్‌కు, డ్రైవర్లు విరామం తీసుకునేందుకు స్థలాలు ఉండాలి. ఇంధన స్టేషన్లు, వాహన మరమ్మతు దుకాణాలు సమీపంలోనే ఉండాలి. నగదు జమ/ఉపసంహరణ కోసం ఏటీఎం యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.
ఎస్‌వోఎస్..
జాతీయ రహదారులపై ప్రతి 2 కి.మీ. లేదా 3 కి.మీ. దూరంలో రోడ్డు పక్కన స్తంభాలకు ఈ ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఏవైనా ప్రమాదాలు, తక్షణ సాయం కావాలంటే ఈ పెట్టెపై ఉండే బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం గురించి చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని సాయం అందిస్తారు.

**రివార్డులు పొందొచ్చు..**

జాతీయ రోడ్లపై వెళ్లే సమయంలో అత్యవసరాలు ఏర్పడితే పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యాలను హైవే అధికారులు కల్పిస్తున్నారు. పైగా ఈ మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉంటే వాటిని ఫొటో తీసి 'రాజమార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డులు సైతం ఇస్తున్నారు.

**15 నిమిషాల్లో అత్యవసర సేవలు**

ప్రయాణికులకు తాగునీరు ఇతరత్రా సేవలతో పాటు ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించాలి. అలాగే ఘటనా స్థలానికి అంబులెన్సును కూడా పంపించాల్సి ఉంటుంది. ఇందుకోసం 1033 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేస్తే సమీపంలోని టోల్‌ప్లాజాకు సమాచారం వెళ్తుంది. అక్కడ ఉన్న అంబులెన్స్ 15 నిమిషాల్లో ప్రమాద స్థలానికి చేరుకుంటుంది.

ఉమ్మడి జిల్లాలోని టోల్‌గేట్లు
చెన్నై-బెంగళూరు: మహాసముద్రం (బంగారుపాళ్యం)
చిత్తూరు-తిరుపతి: గాదంకి
చిత్తూరు-కడప: తేనేపల్లి (పూతలపట్టు)
రేణిగుంట-నాయుడుపేట: మేర్లపాక (శ్రీకాళహస్తి)
కృష్ణగిరి-పలమనేరు: దానమయ్యగారిపల్లె(వి.కోట)
విల్లుపురం-మంగళూరు: నాయకనేరి (వి.కోట)
కలకత్తా-చెన్నై: బోధనం (చిల్లకూరు)
ఏర్పేడు- వెంకటగిరి: చింతలపాలెం

# భవిత కూలీ.. బడులు ఖాళీ

కర్నూలు : బడిలో ఉండాల్సిన భావి భారతం తల్లిదండ్రుల వెంట సుగ్గి బాట పడుతోంది.. దీంతో పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ బడులు ఖాళీ అవుతున్నాయి.. వీరికి 'వసతి' కల్పించాల్సిన సీజనల్ హాస్టళ్ల ఊసే లేదు. కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాలకు చెందిన వారు పత్తి తీత పనుల నిమిత్తం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వెళున్నారు. అక్కడ చిన్నారులకూ పెద్దవారితో సమానంగా కూలీ డబ్బులు చెల్లిస్తున్నారు. ఒక కిలో పత్తి తీసేందుకు రూ.10 నుంచి రూ.15 వరకు ఇస్తున్నారు. నిత్యం రూ.300 నుంచి రూ.350 సంపాదిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ పనిచేస్తే రెండు, మూడు నెలల్లోనే ఎక్కువ ఆదాయం సమకూరుతుండటంతో చాలామంది సుగ్గి బాట పడుతున్నారు. ఒక్క కోసిగి మండలం నుంచే 20 వేల మంది వరకు వెళ్లారు.



డిసెంబరు చివరి వరకు అక్కడే ఉంటారు.

**ఆరు వేల మంది వెళ్లిపోయారు**

కోసిగి మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1,600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం 516 మంది వరకే హాజరవుతున్నారు. 1,084 మంది విద్యార్థులు తల్లిదండ్రుల వెంట కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో పత్తి పనులకు వెళ్లారు. తొమ్మిదో తరగతిలో 117 మందికి 21, పదో తరగతిలో 48 మంది విద్యార్థులకుగాను 23 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ ఒక్క మండలంలోనే ఆరు వేల మంది విద్యార్థులు సుగ్గికి వెళ్లినట్లు అంచనా.

# ఆరోగ్యమూ.. జాగ్రత్త

భీమవరం : తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలు తడిసి ముద్దయ్యాయి. తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో ల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి సూచించారు.

**ప్రబలే వ్యాధులివీ**


నీటి కలుషితంతో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కలరా, కామెర్లు వస్తాయి. జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, పచ్చకామెర్లు. వాతావరణంలో మార్పులు, అధిక తేమతో శ్వాసకోశ వ్యాధులు, జలుబు, న్యూమోనియా, చర్మ సంబంధిత, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. చలిగాలులతో ఆస్మా, ఉబ్బసం వంటివి పిల్లలకు త్వరగా వస్తాయి.



**వైద్య సేవలు** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయి. రాత్రిళ్లూ సేవలు అందుతాయి. నీరసంగా ఉన్నా, జ్వరం తగ్గకపోయినా సమీపంలోని ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి.
**నీటి పరీక్షలు** నీరు కలుషితమయ్యే అవకాశాలు ఉండటంతో అన్ని గ్రామాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు లేకుండా చూడాలి. నిల్వ ఉన్నవి కాకుండా వేడి ఆహార పదార్థాలు తినాలి. కాచి చల్లార్చిన నీళ్లు తాగాలి. దోమల నివారణ మందు పిచికారీ చేయించుకుని దోమ తెరలు వాడాలి. ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వంటివి వాలకుండా మూతలు పెట్టాలి.

# గుమ్మడి కాయ కొట్టేదెప్పుడు?

చిత్తూరు: సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన తొలినాళ్లలో వైకాపా ప్రభుత్వం.. శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అప్పట్లో ఉపాధిహామీ నిధులతో వీటిని కట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 2019- 20 నుంచి 2021- 22 వరకు ఉమ్మడి జిల్లాలో 1,001 సచివాలయాలు కట్టేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఒక్కో భవనానికి రూ.40 లక్షలు మంజూరు చేసింది. మూడేళ్లలోనే వీటిని పూర్తి చేస్తామని చెప్పి ఆ తర్వాత వీటి ఊసే మరిచారు. సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు. తీవ్ర విమర్శలు రావడంతో కాంట్రాక్టర్లకు కొంతమేర బిల్లులు చెల్లించింది. ఎన్నికల లోపు మిగతా డబ్బు వస్తుందని ఆశించిన కొందరు గుత్తేదారులు ఆఘమేఘాలపై నిర్మాణాలు




పూర్తి చేశారు. వైకాపా సర్కార్ మాత్రం వారి ఖాతాల్లో నగదు జమ చేయలేదు. గ్రామస్థులు గట్టిగా అడిగిన సందర్భాల్లో తాళాలు అప్పగించాలని కోరుతుండగా మరి బిల్లుల సంగతేంటని గుత్తేదారులు ప్రశ్నిస్తున్నారు. **పుంగనూరు, పలమనేరు, శ్రీకాళహస్తిలో అధికంగా** వైకాపా హయాంలో అధిక శాతం సచివాలయ భవన నిర్మాణ పనులను వైకాపా నాయకులే దక్కించుకున్నారు. పుంగనూరు, పలమనేరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోనైతే దాదాపు 80 శాతం స్థానిక నేతలే చేశారు. ప్రభుత్వం మారినందున బిల్లుల చెల్లింపులో మరింత జాప్యమవుతోందని సంబంధిత నాయకులు తాళాలు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు.

# సత్వర స్పందన.. నిరంతర పర్యవేక్షణ

పాలకొల్లు : 14వ వార్డులో చెట్టు విద్యుత్తు తీగలపై పడి స్తంభం నేలకూలింది. అగ్నిమాపక సిబ్బంది కేవలం 40 నిమిషాల్లో దాన్ని తొలగించగా.. సహాయక చర్యల్లో వారితో పోటీపడిన విద్యుత్తు సిబ్బంది అంతే వేగంగా కొత్త స్తంభాన్ని అమర్చారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సకాలంలో స్పందించి తుపానును సమర్థంగా ఎదుర్కొన్న యంత్రాంగం పనితీరుకు ఇదొక నిదర్శనం.

పోడూరు మండలం రావిగొప్పులో ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపడింది. స్థానిక యువత సహాయక చర్యలు చేపట్టి యంత్రాంగానికి సహకరించారు. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలందించారు. రాష్ట్రాన్ని గడగడలాడించిన మొంథా తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణనష్టం లేకుండా జిల్లాను గట్టెక్కించిన యంత్రాంగం పనితీరుపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. తుపాను కదలికలను ఎప్పటికప్పుడు తెలియజేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు నష్టాన్ని తగ్గించగలిగింది. అందుబాటులో ఉన్న సాంకేతికతను చక్కగా వినియోగించడంలో చైతన్యాన్ని నింపింది. సహాయక చర్యల్లో అన్ని కీలక శాఖల సమన్వయం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మరోపక్క అధినేతల పిలుపు మేరకు కూటమి పార్టీల నాయకులు, శ్రేణులు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులకు అవగాహన కల్పించడం సత్ఫలితాలనిచ్చింది.

**ప్రచారం పని చేసింది..** తుపాను ముంచుకొస్తుందని మూడు రోజులు ముందు నుంచే పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రచారం చేయడం సత్ఫలితా



లనిచ్చిందనే అభిప్రాయం అన్నిచోట్లా వినిపిస్తోంది. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు సైతం అన్ని వర్గాలను అప్రమత్తం చేశాయి. సాంకేతికత సాయంతో సామాజిక మాధ్యమాలు, ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌ను సమర్థవంతంగా వినియోగించగలిగారు. ప్రజలు కూడా సూచనలు పాటిస్తూ సహకరించడంతో తమ పని తేలికైందని పలువురు అధికారులు చెబుతున్నారు.సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నుంచి విద్యుత్తు శాఖకు చెందిన డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు 70 మంది, క్షేత్ర స్థాయిలో పనిచేయడానికి వందలాది మంది సిబ్బంది వచ్చారు. పోలీసు శాఖలో 55 ఏళ్ల వయసు లోపు ఉన్న వెయ్యి మంది సెలవు లేకుండా మూడు రోజుల నుంచి విధుల్లో ఉన్నారు. పశ్చిమలో 535 గ్రామ, వార్డు సచివాలయాలు, ఏలూరు జిల్లాలో 605 సచివాలయాల్లో 2 వేల మందికి పైగా సిబ్బంది మూడు షిఫ్టుల్లో పనిచేసి సమాచార వాహినిలో భాగమయ్యారు. రెవెన్యూశాఖలో తహసీల్దార్లు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పనిచేయగా గ్రామాల్లో ప్రత్యేకాధికారులుగా వివిధశాఖలకు చెందిన 400 మంది సేవలందించారు.

# గోడ దాటని వరద కట్టడి

నంద్యాల: నంద్యాల పట్టణం చుట్టూ వాగులు.. భారీ వర్షమొస్తే వరద పట్టణాన్ని చుట్టేస్తోంది.. దశాబ్దాలుగా నెలకొన్న ఈ సమస్యతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతుండడంతో కుందూ నది వెంట రక్షణ గోడలు నిర్మించాలని 2008లో ప్రతిపాదించి నిధులు మంజూరు చేశారు. మూడు విడతల్లో పనులను విభజించి పట్టణంలో రక్షణ గోడల పనులు ప్రారంభించేందుకు అప్పట్లో రూ.97.51 కోట్లతో అనుమతులు జారీ చేశారు. ఇప్పటికీ గోడ దాటలేదు. ఏటా కాలనీలు మునుగుతూనే ఉన్నాయి.

**నిలిచిన పనులు మొదలెప్పుడో**

రక్షణ గోడ నిర్మాణానికి 2008లో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మొదటి ప్యాకేజీ 3.3 కి.మీ., రెండో ప్యాకేజీ కింద 6.7 కి.మీ. వరకు నిర్మించాలంటు టెండర్లు పిలిచారు.

మొదటి ప్యాకేజీకి సంబంధించి రూ.20.46 కోట్ల పనులు గుత్తేదారునికి అప్పగించారు. బైటీపేట సమీపంలో రూ.3.3 కోట్ల విలువైన పనులు చేపట్టి వదిలేశారు.

రెండో ప్యాకేజీలో రూ.23.86 కోట్ల పనులకు రూ.23 లక్షల పనులే జరిగాయి. ఇక్కడ 66.78 ఎకరాల భూమికి 33 ఎకరాలే సేకరించడంతో పనులు ముందుకు సాగలేదు. భీమవరం గ్రామానికి వెళ్లే రహదారిలో హరిజన వాడ వద్ద మద్దిలేరు వాగు ఏటా లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

రూ.8.92 కోట్లతో బైటీపేట వరకు రక్షణ గోడ నిర్మాణ పనులు చేశారు. ఇక్కడ రెండు వంతెనలు నిర్మించాల్సి ఉండగా పనులే ప్రారంభం కాలేదు.

**కుందూలో జగన్నాటకం**

కుందూ నదిని విస్తరించేందుకు 673.08 ఎకరాల భూసేకరణ అవసరమని ప్రతిపాదించారు. రైతుల నుంచి 209.05 ఎకరాలు సేకరించి రూ.22 కోట్లు చెల్లించారు. మరో 20.43 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉండగా పూర్తి కాలేదు.

గత వైకాపా ప్రభుత్వం తొలుత కొంతమేర నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించినా నిర్ణీత సమయంలో భూసేకరణ చేయలేకపోవడంతో పనులు ఆగిపోయాయి. అప్పట్లో కుందూ విస్తరణకు సేకరించిన భూములనే గత వైకాపా ప్రభుత్వంలో జగనన్న హౌసింగ్‌కు కేటాయించడం గమనార్హం.

**మూడు ముంచుతున్నాయి**

నంద్యాల పట్టణం మీదుగా ప్రవహించే మద్దిలేరు, చామకాల్వలు వరదల సమయంలో ఉద్ధృతంగా ప్రవహించి కుందూ నదిలో కలుస్తాయి. ఈ మూడు కలిసి నంద్యాల పట్టణాన్ని ముంచెత్తుతున్నాయి. వేలాది మంది నిరాశ్రయులవుతున్నారు.

మద్దిలేరు వాగు పొంగితే హరిజనవాడ, పీవీ నగర్, బైటీపేట, పెద్దబండ, తెలుగుపేట, చింతరుగు, సంగపేట ప్రాంతాలు మునిగిపోతున్నాయి.

చామకాల్వ పొంగితే ఎస్బీఐ కాలనీ, వీసీ కాలనీ, గోపాల్‌నగర్, శ్యాంనగర్, పద్మావతినగర్, సరస్వతినగర్, హనీఫ్‌నగర్, రాయల్ కాంపౌండ్, దేవనగర్ ప్రాంతాలు వరదలో చిక్కుకుపోతున్నాయి.

కుందూ పొంగితే సలీం నగర్, సంజీవనగర్, రాణీమహారాణి ప్రాంతం, విజయనగర్, మున్సిపల్ ఆఫీసు వెనుక భాగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# శివయ్యా... ఇటు చూడవయ్యా



తాడిపత్రి: పేరుకే జాతీయ రహదారులు. ఎక్కడ చూసినా గుంతలు. నిర్వహణ లోపంతో వాహన చోదకులు, ప్రయాణికులు నరకాన్ని చూస్తున్నారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మీదుగా వెళ్లే జాతీయ రహదారి పరిస్థితి ఇది. కర్నూలు, కడప జిల్లా సరిహద్దు ప్రాంతమై తాడిపత్రి మీదుగా రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. తాడిపత్రి పురపాలిక, మండల పరిధిలో సుమారు 20 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించింది. యర్రగుంటపల్లి శివారు నుంచి రావివెంకటాంపల్లి, తాడిపత్రి పురపాలిక, నంద్యాల రోడ్డు మీదుగా వెంకటరెడ్డిపల్లి వరకు ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ఉంది. ఈ మార్గంలో అడుగడుగునా గుంతలు పడినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా తాడిపత్రి పరిసరాల్లోని అనంతపురం రహదారి దారుణంగా ఉంది. శివుడి విగ్రహం వద్ద లోతైన గుంతలుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు పాడవుతున్నాయి.

**త్వరలో గుంతలు పూడ్చుతాం**

తాడిపత్రి మండలం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై గుంతలు పడిన మాట వాస్తవమే. రైల్వే వంతెన రెండు వైపులా, నంద్యాల రోడ్డు, సజ్జలదిన్నె, పెన్నా వంతెన మార్గాల్లోనూ గుంతలను పూడ్చటానికి చర్యలు తీసుకుంటాం. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. తరుణ్‌కుమార్, పీడీ, ఎన్‌హెచ్ఏఐ

# ముడుపు ఇవ్వందే.. దస్త్రం కదలదు



అనంతపురం : జిల్లా ఖజానా కార్యాలయంలో ఓ అధికారి ప్రతి దానికి ధర నిర్ణయించి వసూలు దందాకు ఒడిగట్టాడు. తనకు సంబంధం లేని అంశాల్లోనూ తలదూర్చి ముడుపుల పందేరాన్ని సాగిస్తున్నాడు. అన్నీతానై చక్రం తిప్పుతుంటాడు. జిల్లా అధికారులను సైతం లెక్క చేయడం లేదు. ఈయనపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినా.. ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఓ అధికారి కొండంత అండగా ఉన్నారన్న చర్చ నడుస్తోంది. ఈయన అవినీతిపై ఏసీబీకి సైతం లిఖిత పూర్వక ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. అయినా సరే.. వ్యవహారశైలిలో ఏమాత్రం మార్పు రాలేదు.

**అవినీతి లీలలు ఇవిగో..**

జిల్లా కార్యాలయానికి వచ్చే బిల్లుల్లో అత్యధిక శాతం ఆయన కనుసన్నల్లోనే కార్యకలాపాలు సాగుతున్నాయి. కొన్ని ఇంటి వద్ద బిల్లులు చేస్తున్నాడు. ఇందుకు 10 శాతం కమీషన్ తప్పనిసరి. బిల్లు పాస్ కావాలంటే మరొక 10 శాతం ఇవ్వాలి. సొంతంగా ఎవరైనా బిల్లు తయారీ చేసి పంపితే ఏదొక కారణంతో వెనక్కి వస్తుంది.

విశ్రాంత ఉద్యోగుల బిల్లులు సిఫార్సు చేయాలంటే రూ.3వేలు ముడుపు ఉండాల్సిందే. ఉద్యోగి విధినిర్వహణలో మృతి చెందితే సంబంధిత శాఖ నుంచి సత్వరమే రూ.25 వేలు అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు ఇస్తారు. ఈ మొత్తానికి తగిన బిల్లు ఖజానాకు పంపిస్తారు. బిల్లు పాస్ కావాలంటే కనీసం రూ.2వేలు చేతిలో పెట్టాల్సిందే.

జిల్లాలో ఓ ఉపాధ్యాయుడు కొంతకాలంగా కనిపించలేదు. సకాలంలో జీవన ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో పింఛన్ ఆపేశారు. ఇలా ఆరేళ్లు గడిచాయి. కుటుంబ పింఛను కోసం సదరు ఉపాధ్యాయురాలి భార్య దరఖాస్తు చేసుకున్నారు. మంజూరు చేయడానికి భారీగా ఆశిస్తున్నాడు.

ఇటీవల పది మందికి పదోన్నతి కల్పించారు. ఇందులోనూ రూ.30 వేలు ప్రకారం వసూలు చేసినట్లు ఉద్యోగవర్గాలే చెబుతున్నాయి

విచారించి తగిన చర్యలు తీసుకుంటాం : గుర్రం రమణయ్య, డీడీ, జిల్లా ఖజానా శాఖ

బిల్లుల వ్యవహారంలో అవినీతిని సహించేది లేదు. ఎవరు అక్రమాలకు పాల్పడినా విచారించి తగిన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఉపేక్షించేది లేదు. ఇతర ప్రాంతాల కార్యాలయాలల్లోనూ ఏమి జరుగుతుందో ఆరా తీస్తాం.

# కల్తీ కల్లు కలకలం



హిందూపురం : హిందూపురం గ్రామీణ మండలంలోని చౌళూరులో కల్తీ కల్లు తాగి 13 మంది ఆసుపత్రిపాలయ్యారు. ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల్ని తొలుత ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మానసిక వైద్యనిపుణులు జీవన వైద్యసేవలు అందించగా సాయంత్రానికి ఏడుగురు కోలుకోగా వారిని డిశ్చార్జ్ చేశారు. మిగిలిన ఆరుగురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఐదు రోజులుగా వీరు కల్లు తాగుతుండటంతో అస్వస్థతకు గురయ్యారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకొన్న ఎక్సైజ్ ఎస్ఐ పృథ్వీరాజ్ ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడి కల్లుతాగటం వల్లనే ఇలా జరిగిందా లేదా ఇతర కారణాలున్నాయా అని ఆరా తీశారు. బాధిత కుటుంబసభ్యులు తెచ్చిన కల్లుసీసాలు తీసుకొని, కల్లుదుకాణంలో శాంపుల్స్ సేకరించి పరీక్షకు ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.

**విక్రయాలు నిలిపివేత**

ఒకే గ్రామానికి చెందిన 13 మంది ఆసుపత్రి పాలవడంతో గ్రామంలో కల్లు విక్రయాలు నిలిపేశారు. గ్రామంలో కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మండలంలోని మణేసముద్రం, శాసనకోట, మోదా గ్రామాల్లోనూ కల్లుతాగిన వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

**ఉన్నఫళంగా వదిలేయడంతోనే..**

కల్లు తాగటం అలవాటుగా చేసుకొని మూడు రోజులుగా తాగకపోవడంతోనే వింత లక్షణాల బారిన పడ్డారని ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలిపారు. వెంటనే వైద్యసేవలు అందించడంతో 7 మంది కోలుకొన్నారని, మిగిలిన 6 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నారని సూపరింటెండెంట్ అన్నారు.

# మొంథా ప్రభావం కొంతే

చిత్తూరు : మొంథా తుపాను ప్రభావం కొంతే ఉండటంతో యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. జిల్లాలో కొన్నిచోట్ల రోడ్లు, కల్వర్టులు, చెరువులు దెబ్బతిన్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. నష్టాల వివరాలను బుధవారం వెల్లడించారు. వర్షాలతో జిల్లాలో చెరువులు నిండుతున్నాయి. భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. తీవ్ర వర్షాభావ మండలాలు గుడుపల్లె, వి.కోటలోనూ జలమట్టం పెరిగింది.





**190.87 హెక్టార్లలో వరి, వేరుసెనగ..**

తుపానుతో జిల్లాలోని 190.87 హెక్టార్లలో వరి, వేరుసెనగ పంటలు పాడయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. 17 మండల్లాలోని 83 గ్రామాల్లో 334 మంది రైతులు నష్టాలు చవిచూసినట్లు అంచనా వేశామన్నారు.

**15.60 హెక్టార్లలో ఉద్యాన పంటలు..**

వర్షాలకు జిల్లాలో 15.60 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి తెలిపారు. 6 మండలాల్లో 28 మందికి చెందిన బొప్పాయి, టమాట, పూలు తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. రూ.29.6 లక్షలు నష్టపోయినట్లు అంచనా వేశామన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న పంటలకు పెద్దగా నష్టం జరగలేదని డీపీఎం వాసు తెలిపారు. తాత్కాలిక పనులకు పీఆర్, ర.భ.శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. సహాయ ఖర్చులకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.2 కోట్ల నుంచి బాధితులకు పరిహారం ఇస్తున్నాం.కుప్పంలో ప్రహరీ కూలి మృతిచెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు అందించాం. పిడుగు పాటుతో ప్రాణాలు కోల్పోయిన యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని కలెక్టర్ తెలియజేశారు.

**విద్యుత్తు సంస్థకు రూ.2.36 లక్షలు..**

జిల్లాలో విద్యుత్తు సంస్థకు సుమారు రూ.2.36 లక్షల నష్టం జరిగిందని ఆ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. 29 విద్యుత్తు స్తంభాలు నేలకూలగా, 17 నియంత్రికలు పాడయ్యాయన్నారు. మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించినట్లు చెప్పారు.

# చుక్క చుక్క ఏకమై.. సంద్రమై..!

ఒంగోలు : మొంథా తుపాను జిల్లాను అతలాకుతలం చేసింది. గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంది. బుధవారం తెల్లవారుజామున వరదనీరు చుట్టుముట్టింది. వివిధ ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్నవారు పోలీసులు, ఎన్టీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో బయటపడ్డారు. ఒంగోలు-కర్నూలు, చెన్నై-కోల్‌కతా, ఒంగోలు- కత్తిపూడి జాతీయ రహదారులపైకి నీళ్లు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**నగరపాలక సంస్థకు రూ.10.5 కోట్లు నష్టం :** తుఫాను ప్రభావంతో ఒంగోలు నగరపాలక సంస్థకు రూ.10.5 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. మొత్తం 26 రహదారులు, 4 కిలోమీటర్ల మేర కాలువలు, 350 వీధి దీపాలు దెబ్బతిన్నాయి.

లైలా తరువాత ఇదే: సుమారు 15 ఏళ్ల కిందట లైలా తుపాను సమయంలో రికార్డు స్థాయిలో వరద నీరు చేరింది. ప్రస్తుతం ఒక్కరోజులోనే 29.5 సె.మీ వర్షం కురవడంతో ఒంగోలు నగరం జలమయమైంది. నగరానికి అనుకుని ఉన్న చెరువుల అలుగులు పారడంతో వరదనీరు చుట్టుముట్టింది. ముంపునకు గురైన బిలాల్ నగర్,



కరుణానగర్ ప్రాంతాల్లో కలెక్టర్ రాజాబాబు, కమిషనర్ వెంకటేశ్వరరావు పర్యటించారు. నవోదయ విద్యాలయాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే జనార్దన్ పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. కలెక్టరేట్ తప్ప దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు నీట మునిగాయి.

**ఎన్నాళ్లకు జలకళ:** కంభం చెరువు నిండటం ఒక ఎత్తయితే అలుగు పారడం అరుదైన ఘటనగా చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కట్టిన తరువాత తొలిసారిగా లక్షకుపైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపోవడంతో వరద జలాలు కనువిందు చేశాయి. జిల్లాలో రెండొందలకుపైగా చెరువులు అలుగు పారడం ప్రత్యేకత.

**106 పునరావస కేంద్రాలకు 5,622 మంది :** జిల్లాలోని 27 మండలాల్లో మొత్తం 106 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేయగా, 5,622 మందిని తరలించారు. మొత్తం 1,554 కుటుంబాల్లోని 7,217 మందికి ఆహార పొట్లాలు అందజేశారు.

# వంతెనల్లేక నరకయాతన!

ఒంగోలు : మొంథా తుపాను జిల్లాను వణికించింది. సుమారు 36 గంటలపాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలమైంది. జిల్లా కేంద్రమైన ఒంగోలుతోపాటు జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతోపాటు చెరువుల అలుగులు పారడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణం వంతెనలు లేకపోవడమే.

ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలోని మంగమూరు, కొత్త పట్నం, పొందూరు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ మార్గంలోని నల్లవాగుపై వంతెనలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితికి దారి తీసింది.

వేంపాడు-ముండ్లమూరు మధ్య చిలకలేరు వాగు పొంగి ప్రవహించడంతో అద్దంకి - దర్శి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

గ్రోత్‌సెంటర్ - నాగులప్పలపాడు మధ్య కొత్తకోట మధ్య ఉన్న వాగు ప్రతి చిన్నపాటి వర్షానికీ పొంగిపొర్లుతోంది.

గిద్దలూరు - ఒంగోలు రహదారిలో పాపాయిపల్లి వద్ద పీతిరి వాగు ప్రవాహంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది.

మార్కాపురం -కంభం రహదారిలో వాగులు పొంగి పొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

విఠలాపురం వద్ద దోర్నపు వాగు పోటెత్తటంతో తాళ్లూరు-ముండ్లమూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

టంగుటూరు -కొండపి మార్గంలో వాగులు పొంగిపొర్లుతుండటంతో వంతెనలు లేక రాక పోకలకు వీలుకాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒంగోలు- కర్నూలు రహదారి పరిస్థితి దారుణం: జిల్లా కేంద్రమైన ఒంగోలును పశ్చిమ ప్రాంతంతో అనుసంధానించే



ఒంగోలు - నంధ్యాల (కర్నూలు రోడ్డు) రహదారిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. .విభజిత ప్రకాశం జిల్లాలో ఇది అత్యంత ప్రధాన రహదారి. ఒంగోలు - మార్కాపురం - దోర్నాల - శ్రీశైల పుణ్యక్షేత్రం, ఒంగోలు - గిద్దలూరు - నల్లమల అటవీప్రాంతం - నంధ్యాల - కర్నూలు, ఒంగోలు - బేస్తవారపేట - పోరుమామిళ్ల - కడప జిల్లాకు దారితీసే అత్యంత కీలక రహదారి ఇది. ఈ కీలక రహదారిలో పేర్నమిట్ట - సంతనూతలపాడు మధ్యలో రహదారి చప్టాకు రంధ్రం పడి నెలలు గడుస్తున్నా పట్టించుకునే దిక్కులేదు. అదే రహదారిలో భారీ వర్షాలకు ఒంగోలు - సంతనూతలపాడు మధ్య చెరువులు పొంగి రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది.

జిల్లాలో రహదారుల విస్తీర్ణం: 3,947.79 కిలోమీటర్లు

| రహదారి | కిలోమీటర్లు |
|---|---|
| జాతీయ | 557.7 |
| రాష్ట్ర | 725.41 |
| జిల్లా | 1,752.06 |
| గ్రామీణ | 912.62 |

# ప్రైవేటు బూచీ.. ఖనిజం దోచి

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మైనింగ్ దోపిడీ ఆగడం లేదు. సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. వారు ఇప్పటికీ బాధ్యతలు తీసుకోకపోవడంతో గనుల శాఖ సిబ్బంది కొందరు వసూళ్లకు తెరతీశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 516 మైనింగ్ క్వారీలు ఉన్నాయి. ఫెలస్పర్, లేటరైట్, సిలికా శాండ్, ఐరన్‌ఓర్ వంటి విలువైన ఖనిజాలు ఉన్నాయి. క్వారీల్లో ఖనిజం తవ్వి బయటకు రావాలంటే తప్పనిసరిగా సీనరేజీ చెల్లించాలి. ఖనిజం విలువను బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.180 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ప్రైవేటు సంస్థ బాధ్యతలు తీసుకునే లోపే సొంతింటిని చక్క బెట్టుకోవాలన్నట్లు సిబ్బంది వ్యవహరిస్తున్నారు.

**దస్త్రాలు సమకూర్చుకోక..**

అవసరమైన దస్త్రాలను సదరు సంస్థ సమకూర్చుకోలేదు. ప్రభుత్వానికి ముందస్తుగా చెల్లించాల్సిన మొత్తం ఇప్పటికీ కట్టలేదు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని క్వారీలను భూగర్భ గనుల శాఖ అధికారులు సదరు సంస్థకు అప్పగించలేదు. మరోవైపు గత నెల 25వ తేదీ నుంచి ప్రైవేటు సంస్థ వసూలు చేయాల్సిన సీనరేజీని గనుల శాఖే తీసుకుంటోంది. ఇక్కడే అక్రమాలకు 'తెర' లేచాయి. ప్రభుత్వానికి జమవుతున్నది కొంతైతే.. పక్కకు పోతున్న సొమ్ము బోలెడంత.

**నెలకు రూ.14.05 కోట్లు**

ఉమ్మడి జిల్లాలో క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇందుకు గత నెలలో టెండరు నిర్వహించారు. నెలకు రూ.14.05 కోట్లు చెల్లించేందుకు సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ ముందుకొచ్చింది. రెండేళ్లపాటు సీనరేజీ వసూలు



చేయనుంది.

గత నెల 25 నుంచే బాధ్యత తీసుకోవాల్సి ఉంది. నెలకు సీనరేజీ రూపేణా రూ.10.45 కోట్లు, జిల్లా ఖనిజ నిధి కింద రూ.3.10 కోట్లు, ఖనిజాన్వేషణ నిధి పేరుతో రూ.22.16 లక్షలు, ఇతర ఖర్చులు రూ.27.50 లక్షలకుపైగా సదరు సంస్థ గనుల శాఖకు చెల్లించాల్సి ఉంది.

**ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు**

బేతంచెర్ల మండలం రామళ్లకోట, యంబాయి, రుద్రవరం, ఆర్‌ఎస్. రంగాపురం తదితర ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ తవ్వకాలకు అడ్డే లేకుండా పోయింది. డోన్, ప్యాపిలి మండలాల్లో క్వార్ట్జ్, ఆదోని ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాల విస్తృతి పెరిగింది. డోన్ నియోజకవర్గంలో అక్రమ తవ్వకాలకు ఓ ద్వితీయ శ్రేణి నేత నాయకత్వం వహిస్తున్నారు.

మహానంది మండలం గాజులపల్లె అంకిరెడ్డిపల్లె చెరువులో ఎర్రమట్టి తవ్వకాలు ఊపందుకున్నాయి. లీజు ప్రాంతంలో తనిఖీలు లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది.

**సరిహద్దులు దాటిస్తున్నారు**

సీనరేజీ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించడం.. సదరు సంస్థ ప్రతినిధులు ఇప్పటికీ బాధ్యతలు చేపట్టకపోవడంతో క్వారీల్లో లీజుదారులు ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. కొత్త సంస్థ వస్తే తమ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఉద్దేశంతో లీజుదారులు భారీగా తవ్వకాలు చేపట్టి సరిహద్దులు దాటించేస్తున్నారు.

క్వారీల్లో గనుల శాఖ నిర్దేశించిన ప్రాంతంలో కొలతల ప్రకారం ఎంత ముడి సరకు తవ్వుకోవాలో ఆ ప్రకారం మైనింగ్ జరగాలి. ఇవేమీ పట్టించుకోకుండా గత కొద్ది రోజులుగా గ్రానైట్, కంకర, సున్నపురాయి పెద్దఎత్తున తరలిపోతోంది.

కొలిమిగుండ్ల, అవుకు, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పాణ్యం మండలాల్లోని క్వారీల్లో రేయింబవళ్లు అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. పాణ్యం సమీపంలోని గద్దెలకొండలో గత రెండు వారాలుగా పెద్దఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఓ నేత కనుసన్నల్లో మైనింగ్ జరుగుతోంది. అవుకు మండలం రామాపురం, సంగపట్నం, చెర్లోపల్లి, బెలుం తదితర ప్రాంతాల్లోని క్వారీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

# గృహ యోగం.. లక్ష్యం దూరం!

పాలకొల్లు: పేదల గృహ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేయించడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనపు సాయం అందించింది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా గృహ నిర్మాణ లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుమతులు ఇచ్చి పనులు మొదలు పెట్టిన గృహాల్లో 55 శాతం మేర మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ



దశల్లో ఉన్నాయి. దీపావళి నాటికి వీలైనంత ఎక్కువ మంది లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2024 జూన్ తరువాత 9,107 గృహ నిర్మాణాలు ప్రారంభించగా ఇప్పటికి 5,004 పూర్తయ్యాయి. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తే దీపావళి నాటికి గృహ ప్రవేశాలు చేసే కుటుంబాలు సగం వరకు ఉండే అవకాశం కనబడుతోంది. జిల్లాలో తణుకు, భీమవరం నియోజకవర్గాల్లో మినహా మిగిలిన చోట్ల చేపట్టిన గృహ నిర్మాణాల్లో 60 మాత్రమే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అంశంపై గృహనిర్మాణ సంస్థ ఈఈ రామాయణం త్రిమూర్తులు స్పందిస్తూ జీఎస్టీ సంస్కరణలతో సిమెంటు, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు తగ్గాయని.. దీనిని సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించడంతో పాటు శాఖా పరంగా తగిన సహకారం అందిస్తామన్నారు.

# కర్షకుడికి కంచె



హిందూపురం: రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రాజధానికి వేగంగా చేరుకోవడానికి, బెంగళూరు– విజయవాడ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. బెంగళూరు నుంచి వచ్చే జాతీయ రహదారి 44, గుంటూరు వద్ద జాతీయ రహదారి 16లను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే(హరిత జాతీయ రహదారి) నిర్మాణాన్ని చేపట్టాయి. 345 కి.మీ.లతో తెలుగు రాష్ట్రాల్లోనే అతి పొడవైన హరిత జాతీయ రహదారిగా గుర్తింపు సాధించబోతోంది.

**వ్యవసాయం చేసేదెలా..?**

ఈ జాతీయ రహదారి, దాని నిర్మాణనికి భూములు కోల్పోయిన రైతులకు మాత్రం కష్టాలు తెచ్చిపెడుతోంది. ప్రధాన రహదారికే కాదు.. దాని పక్కన నిర్మించిన సర్వీసు రోడ్లకు సైతం సిమెంటు దిమ్మెలతో కంచె నిర్మిస్తున్నారు. దీంతో రహదారి పక్కన భూములున్న రైతులు అందులోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికే పలుచోట్ల కంచె నిర్మాణం పూర్తికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పొలాల్లోకి వెళ్లేదెలా.. వ్యవసాయం చేసేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కంచె నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బందితో వాదనకు దిగుతున్నారు. తాము ఏమీ చేయలేమని, రహదారి ప్రణాళిక అలా ఉందని వారు చెబుతుండటంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రతి పొలానికి దారి వదలాలని డిమాండ్ చేస్తున్నారు.

**రాకపోకలకు ఇబ్బందే..**

రహదారి పక్కన ఉన్న గ్రామాలకు వాటి సమీపంలో రహదారి కింద అండర్ బ్రిడ్జిలను నిర్మించారు. అయితే వర్షం వస్తే చాలు అవి నిండిపోతున్నాయి. రైల్వే శాఖ నిర్మించిన లోవంతెనల మాదిరిగానే ఇవి వానాకాలంలో నీటితో నిండి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు రైతుల, గ్రామాలకు రాకపోకల విషయంలో ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**ఎక్కడి నుంచి అంటే..**

రహదారి నిర్మాణం జిల్లాలోని చిలమత్తూరు మండలం కోడూరు వద్ద ఎన్‌హెచ్ 44 నుంచి ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి కడప జిల్లా పులివెందుల మీదుగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లా ముమ్మడివరం వరకు వెళుతుంది. 14 ప్యాకేజీలతో రహదారి నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

# కళ్లెదుటే.. కల చెదిరింది



శ్రీకాళహస్తి: అదొక యువత కలల ప్రాజెక్టు.. ఫేజ్-1, 2లు పూర్తయి ఉంటే.. కనీసం 31 వేల మంది స్థానిక యువతకు ఉద్యోగాలు దక్కి ఉండేవి. కానీ.. కలలన్నీ తలకిందులయ్యాయి. ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రాజెక్టు అటకెక్కింది. ప్రస్తుతం ఆ నిర్మానుష్య ప్రాంతంలో నిరుపయోగ భవనాలు కనిపిస్తున్నాయి. అదే శ్రీకాళహస్తి మండలం మన్నవరంలో ఏర్పాటైన ఎన్బీపీపీఎల్ ఎన్టీపీసీ-బీహెచ్‌ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ కథ వెనుక దాగిన విఫల వ్యథ.

**భారీ అంచనాలు**

విద్యుత్తు ఉత్పాదన రంగంలో దిగ్గజ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్బీపీపీఎల్ ఏర్పాటు సమయంలో ఎన్నో భారీ అంచనాలు వేసుకున్నారు. మన్నవరం ప్రాంతం పారిశ్రామికంగా పురోభివృద్ధిని సాధిస్తుందని ఆశపడ్డారు.

2010 సెప్టెంబరు 1వ తేదీన అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ భూమిపూజ చేశారు.

కర్మాగారం దృష్టి: కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ల పరికరాల తయారీ (ఫేజ్-1), పవర్ ప్లాంట్‌ల బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు (ఫేజ్-2)2015లో ఉత్పత్తులు ప్రారంభించినా 2016 ఆఖరుకే మూతపడే స్థాయికి చేరింది.

సామర్థ్యం

ఏడాదికి 5వేల మెగావాట్లకు సమానమైన విద్యుత్తు పరికరాలు తయారు చేయడం

**వైఫల్యాలకు కారణం**

మార్కెట్లోకి వచ్చిన కొత్త కంపెనీలు. బాయిలర్లు, టర్బైన్లు, జనరేటర్లు (బీటీజీ) పరికరాల రంగంలో పోటీ.

ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడి అవసరాలు మారడం. ఫేజ్-2 కొనసాగించకూడదని బోర్డు నిర్ణయించడం.

కొద్ది రోజులు చిన్న స్థాయిలో కోల్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల పరికరాలు ఉత్పత్తి చేసింది. ప్రస్తుతం అవీ మూత పడ్డాయి.

గ్లోబల్ వార్మింగ్ ప్రభావం నేపథ్యంలో దిగ్గజ సంస్థల అంచనాలన్నీ తలకిందులయ్యాయి. థర్మల్ పవర్ పరికరాల డిమాండ్ తగ్గటం, సోలార్, ప్రత్యామ్నాయ ఎనర్జీ వృద్ధి చెందడంతో ఈ ఉత్పత్తులకు మార్కెటింగ్ వసతి లేక మూతపడింది.

ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న తాజా చర్యలు

వినియోగంలో లేని భూమి: 2009లో కేటాయించిన 753.85 ఎకరాల్లో సుమారు 600 ఎకరాలు ఇప్పటి వరకు వినియోగంలో లేదు. ఈ భూమిని కొత్త పరిశ్రమల కోసం ఉపయోగించేందుకు ప్రయత్నం సాగుతోంది.

కేంద్రంతో సమన్వయం: ఇది సంయుక్త సంస్థ కాబట్టి కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖతో సమన్వయం జరుగుతోంది. భూముల్ని తిరిగి పొందడానికి కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించనున్నారు.

వికల్ప పరిశ్రమల పరిశీలన: సౌరప్యానెల్, లిథియం-ఐయాన్ బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తి పరిశ్రమల ఏర్పాటును పరిశీలిస్తున్నారు. పునరుత్పాదక శక్తి, అధునాతన ఉత్పత్తుల విభాగాలకు సరిపోయేలా ఉంటుంది.

కేంద్ర పథకాల ఉపయోగం: ఈ ప్రాజెక్టును ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్ పథకంలో చేర్చడానికి ప్రతిపాదనలున్నాయి. తద్వారా ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ, ఫ్యాక్టరీల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది.కంపెనీలు: ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇక్కడ వ్యయం నిధులు, మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువచ్చేలా దిగ్గజ సంస్థలు సన్నాహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

# మహిళల ఆర్థికాభివృద్ధికి.. 'షీ లీడ్స్ ఆంధ్ర'



చిత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆదాయం ఇప్పటికీ అంతంతే. కొందరు చిన్న దుకాణాలు నిర్వహిస్తున్నా కుటుంబ పోషణకు అవి ఏ మాత్రం సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు తేవాలని కృతనిశ్చయంతో ఉన్న సీఎం చంద్రబాబు.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న కుప్పం నుంచే తొలి అడుగు వేశారు. పల్లెల్లో చిన్న దుకాణాలు నిర్వహించే మహిళల చేతికి సాంకేతిక అస్త్రాన్ని అందించి ఆదాయం పెంచుతున్నారు. సరకులకు సమీపంలోని కుప్పం వెళ్లే పరిస్థితి తప్పింది. రవాణా ఖర్చులు తగ్గాయి. రాష్ట్రంలో తొలిసారి పైలెట్ ప్రాజెక్టుగా 'షీ లీడ్స్ ఆంధ్ర' పేరిట ఈ మండలంలో ప్రారంభించారు.

శిక్షణ ఇచ్చి సహేలీలుగా.. 'ఫ్రంటియర్ మార్కెట్స్' అనే సంస్థ కుప్పం మండలంలోని 23 పంచాయతీల నుంచి పలువురు మహిళలను సహేలీలుగా ఎంపిక చేసింది. సహేలీ అంటే స్నేహితురాలు. వీరికి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు ఎలా పెట్టాలి, ఎలా ట్రాక్ చేయాలి, వినియోగదారులను ఆకట్టుకునేలా దుకాణాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మండలంలోని 69 దుకాణాలను గుర్తించారు. గ్రామీణ మహిళా వ్యాపారవేత్త (ఆర్‌డబ్ల్యూఈ)లను వీరికి అనుసంధానం చేశారు. 'మేరీ సహేలీ' అనే యాప్ ద్వారా సరకులు ఆర్డర్ చేస్తున్నారు. బయటి మార్కెట్‌తో పోలిస్తే రాయితీ ఎక్కువగా ఉండటం, రవాణా ఖర్చులు మిగలడంతో ఆదాయం పెరిగింది. ఇప్పటివరకు దాదాపు 12 లక్షల ఆర్డర్లు చేశారు. సహేలీలకు ప్రస్తుతం నెలకు రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది.

# తెలంగాణ లారీల్లోనే ఇసుక తరలింపు!

ఏలూరు: చింతలపూడికి సరఫరా అయిన 1.34 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఎక్కడ వినియోగించారు? ఏం చేశారు అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఇక్కడకు సరఫరా చేసిన లారీల చిరునామాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి చెందినవిగా గుర్తించారు. ఇసుక మాత్రం స్థానికంగా ఉండే వారి ఆధార్, ఫోన్ నంబర్లతో సరఫరా అయినట్లు నిర్ధారించుకున్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో లారీలు ఉన్నాయి. ఒకవేళ ఇక్కడి నుంచి కాకున్నా తూర్పుగోదావరి జిల్లా నుంచే అనేక లారీలు వచ్చి దింపివెళతాయి. ఇవి కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి లారీలు తీసుకొచ్చి ఇక్కడ ఎవరు ఇసుక తోలించుకున్నారు అనే కోణంలో ఆరా తీస్తున్నామని గనులశాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటి వరకు తమ పరిశీలనలో అత్యధిక లారీలు తెలంగాణ రిజిస్ట్రేషన్ పేరుతో ఉన్నాయని వివరించారు. ఇసుక బుకింగ్ విషయం తెలియదని తమ పేరుతో ఎవరు బుక్‌చేశారో యంత్రాంగమే నిగ్గు తేల్చాలని సంబంధిత వ్యక్తులు కోరుతున్నారని వివరించారు.

దీన్నిబట్టి స్థానికుల ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్లు సేకరించుకుని



ఇసుక సరిహద్దులు దాటించేశారని స్పష్టమౌతోంది. ఒకవైపు రీజినల్ విజిలెన్స్ అధికారులు మరోవైపు జిల్లా స్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) ఆధ్వర్యంలో పరిశీలన చురుగ్గా సాగుతుందని త్వరలోనే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని గనులశాఖవర్గాలు పేర్కొన్నాయి. కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు చింతలపూడి తహసీల్దార్, జిల్లా గనులశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా పలు బృందాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు పంపి విచారణ చేస్తున్నామని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# అవే బిల్లులు.. సంస్థకు చిల్లులు!

ఏలూరు : ఆర్టీసీలో ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉంటాయి. రూపాయి తేడా వచ్చినా.. సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవు. ప్రతి విభాగంలో పక్కాగా తనిఖీ అధికారులు ఉండటం, ప్రతి లెక్కకు ఆడిట్ చేయడం పరిపాటి. తద్వారా నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఇంతటి పకడ్బందీ వ్యవస్థ కలిగిన ఆర్టీసీలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా కావడం ఆందోళన కలిగిస్తోంది.

**అయిదేళ్లుగా నిర్వహణ..** ఏలూరు ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో సుమారు అయిదేళ్ల క్రితం ఐఓసీఎల్ పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. దీని నిర్వహణను ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయాల బిల్లులను క్రమం తప్పకుండా ఆడిట్ చేస్తుంటారు. అయినా కొందరు సిబ్బంది అధికారుల కళ్లుగప్పి మాయాజాలం చేసేశారు. ఒకసారి సమర్పించిన బిల్లులే మళ్లీ మళ్లీ అందజేసి అక్రమాలకు పాల్పడ్డారు. విషయం అధికారుల దృష్టికి రావడంతో.. ఆర్టీసీ పెట్రోలు బంకు నిధుల వినియోగంపై విచారణకు కమిటీని నియమించారు. ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ విజయరత్నం ఏలూరొచ్చి విచారిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం.

**సూత్రధారి ఆయనేనా..** ఆర్టీసీ బంకుకు సంబంధించి సుమారు రూ.69 లక్షలు పక్కదారి పట్టినట్లు సమాచారం. బంకులో ఏళ్లుగా పని చేస్తున్న సాంకేతిక ఏడీసీ ఒకరు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలోని సంస్థకు చెందిన బంకు తరచూ మొరాయిస్తోంది. ఆ సమయంలో గ్యారేజీ బయట ఉన్న ఐవోసీఎల్ బంకులో బస్సులకు డీజిల్ పోయిస్తుంటారు. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో కేవలం ఒక ఉద్యోగే ఉన్నారా? ఇతర అధికారులు లేదా సిబ్బంది ఉన్నారా? అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది. 'ఆర్టీసీ బంకులో నిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని ఆర్టీసీ డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు.

# శవాగారంలో ప్రైవేటు దందా

భీమవరం : భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో శవాలను భద్రపరచాలంటే జేబుకు చిల్లులు పడుతున్నాయి. కుటుంబ సభ్యుల్ని కోల్పోయి బాధలో ఉన్న వారికి శవాగారం వద్ద ఎదురవుతోన్న పరిస్థితులు దయనీయంగా ఉంటున్నాయి. శవపంచనామా ఎంత తొందరగా పూర్తయితే అంత మిగులుతుందని వారు కోరుతున్నారు.

అంతా మాయాజాలం.. భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలోని శవాగారానికి ఉండి, పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, భీమవరం, మొగల్తూరు మండలాలతో పాటు కృష్ణా జిల్లాలోని పలు మండలాల నుంచి మృతదేహాలను తీసుకొస్తారు. ఇక్కడ నెలలో 45కుపైగా శవ పరీక్షలు చేస్తారు. వైకాపా పాలనలో శవాల భద్రత గాలికొదిలేయడంతో



ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగింది. మృతదేహాన్ని ఒకరోజు ఫ్రీజర్‌లో ఉంచాలంటే రూ.3,500 తీసుకుంటున్నారు. ఈ ఆర్థిక భారం తట్టుకోలేకపోతున్నారనే విషయం ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి కొందరు తీసుకెళ్లగా రెండు మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ సమకూర్చారు. దాన్ని ఎప్పుడూ గదిలోనే ఉంచుతున్నారు. పాడైపోయిందని, అందులో శీతలీకరణ లేదని చెబుతూ ప్రైవేటు ఫ్రీజర్లపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు దందాకు అంతులేకుండా పోతోందని బాధితులు వాపోతున్నారు. శవాగారం ఆవరణలోనే ప్రైవేటు ఫ్రీజర్లు ఉంచి దందా చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి కడచూపులో ఖర్చుల భారం లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

# మూగజీవాలకో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

తిరుపతి : ఫిజియోథెరపీ.. సంతాన సాఫల్య కేంద్రం.. రక్తపరీక్షలు.. ఎక్స్‌రేలు.. ఈసీజీ.. స్కానింగ్.. కార్డియాలజీ.. ఇలాంటి పరీక్షలన్నీ సాధారణంగా మనుషులకు చేస్తుంటారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య వర్సిటీలో ఇవన్నీ పెంపుడు జంతువులు, పశువులు, ఇతర జీవాలకూ చేస్తున్నారు. మూగజీవాలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయని తెలుసా.. అత్యాధునిక ఆపరేషన్లూ చేస్తారు. రైతులకు సేవలు ఉచితం... రైతులకు చెందిన పశువులు, గేదెలు, మేకలకు అందించే సేవలు, మందులు ఉచితం. ఎన్‌సీసీ గుర్రాలు, ఎస్వీ జూపార్కులోని పులులు, సింహాలు, పక్షులకు ఉచిత



సేవలు ఉంటాయి.

**ప్రత్యేకతలు**

ఓపీ: రోజుకు 150
వార్డులు: 06 (పెంపుడు, పెద్ద జంతువులకు వేర్వేరుగా)
శస్త్రచికిత్సలు: రోజుకు సుమారు 7
పెంపుడు జంతువులకు ఓపీ రుసుము: రూ.50
రక్తపరీక్షలు, ఎక్స్‌రే, శస్త్ర చికిత్సలు, ఇతర పరీక్షలకు: రూ.200 నుంచి రూ.1000 వరకు

**అందే సేవలు..** కంప్యూటరైజ్డ్ ఈసీజీ, కార్డియోగ్రఫీ, రేడియోగ్రఫీ, హిమో డయాలసిస్, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే. శునకాలకు గుండె సంబంధిత వ్యాధుల నిర్ధరణ, చికిత్సలు, విరిగిన ఎముకలకు శస్త్రచికిత్సలు. గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ, గర్భకోశ, కాలేయ, కంటి జబ్బుల చికిత్సలు.కండరాల నొప్పుల నివారణకు ఫిజియోథెరపీ సేవలు. మూగజీవాలకు ఇన్‌పేషెంట్ సౌకర్యం, యజమానులకు వసతి సదుపాయం ఉంది. దేశవాళీ పశువుల ఉత్పత్తికి సంతాన సాఫల్యం కేంద్రం.

# ప్రధాని రాక.. పనుల్లో కదలిక

శ్రీశైలం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సున్నిపెంటలో హెలిప్యాడ్లు సిద్ధం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి.

మల్లికార్జున సదన్ తూర్పు వైపు తారు రోడ్డు నిర్మిస్తున్నారు. మల్లికార్జున సదన్ ఎదురు నుంచి గంగా సదన్, సాయిబాలాజీ హోటల్ వరకు రహదారి పక్కన పెద్దఎత్తున మొక్కలు నాటారు. టోల్‌గేటు వద్ద నుంచి మల్లికార్జున సదన్ మీదుగా గంగా సదన్, నంది సర్కిల్ మార్గంలో ప్రధాని రానుండడంతో అక్కడ పచ్చదనానికి ప్రాధాన్యమిచ్చారు. అమ్మవారి ఆలయ మెట్ల పక్కన, రథశాల వర్టికల్ గార్డెన్లు ఏర్పాటు చేస్తున్నారు. వర్టికల్ గార్డెన్లలో త్రిశూలం, ఓంకారం ఆకారాలు ఆకట్టుకునేలా, చుట్టూ పచ్చదనం మొక్కలతో తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు.



**నూతన క్యూలైన్ల ఏర్పాటు**

స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రాంగణాల్లో ఇనుప క్యూలైన్లను తొలగించి నూతన క్యూలైన్ పనులు చేపట్టారు. ఆలయం వెనుక భాగం ఏనుగుచెర్వు కట్ట వద్ద పచ్చదనంతో కూడిన లాన్ ఏర్పాటు చేశారు. అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఆలయ అధికారులు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు.


**కట్టుదిట్టమైన భద్రత**

డీజీపీతోపాటు ఇంటెలిజెన్స్ డీజీ శ్రీశైలానికి వస్తున్నట్లు తెలుస్తోంది. సీఆర్‌పీఎఫ్, ఎన్ఎస్‌జీతోపాటు కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ముందస్తుగా శ్రీగిరికి చేరుకొని భద్రత కట్టుదిట్టం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా వస్తుండడం తో శ్రీశైలం చుట్టూ భద్రత పకడ్బందీగా ఏర్పాటు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

# స్మార్ట్‌కార్డులు ఇప్పుడివ్వలేం

కర్నూలు : అక్టోబరు 1 నుంచి 15వ తేదీ వరకు చౌక దుకాణాల్లో రేషన్ సరకులతో పాటు స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాలని జిల్లా యంత్రాంగం డీలర్లను ఆదేశించింది. చౌక దుకాణాల్లో డీలర్లు పంపిణీ చేయగా.. మిగిలిపోయిన కార్డులను ఈనెల 16 నుంచి సచివాలయాల్లో పంపిణీ చేయాలని జిల్లా పాలనాధికారులు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో డీలర్లు కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం లేదు. సచివాలయాల్లో కార్డులు అందుబాటులో లేవు. జిల్లా యంత్రాంగం ఆదేశాలను డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. ముందు రేషన్ సరకులు తీసుకెళ్లండి..ఆ తర్వాత కొత్త కార్డులను పంపిణీ చేస్తామని చెప్పి పంపుతున్నారు.

**ప్రహసనంగా పంపిణీ**




ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌక దుకాణాలుండగా.. వాటి పరిధిలో 12 లక్షలకు పైగా కార్డుదారులు ఉన్నారు. ఇంకా కర్నూలు జిల్లాలో 3,47,550 (51.96 శాతం), నంద్యాలలో 4,34,934 (81.67 శాతం) ఇవ్వాల్సి ఉంది. రేషన్ సరకులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలంటే కష్టంగా ఉందని, ఒకే వ్యక్తి రెండు పనులు ఎలా చేయగలరని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు క్లస్టర్ల వారీగా పింఛన్లను పంపిణీ చేయిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో 99 శాతం వరకు సొమ్ము పంచేస్తున్నారు. ఇదే తరహాలో సచివాలయ ఉద్యోగులందరి చేత క్లస్టర్ల వారీగా స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయిస్తే మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఒక మొక్క బతికుంటే ఒట్టు!




గుత్తి: జిల్లాలో గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో గత ప్రభుత్వ హయాంలో సుందరీకరణ, జగనన్న పచ్చతోరణం పేరుతో భారీగా నిధులు దోచేశారు. వందల్లో మొక్కలు నాటి వేలల్లో లెక్కలు చూసి బిల్లులు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో ఎక్కడా అప్పట్లో నాటి మొక్కల ఆనవాళ్లు కూడా లేకుండాపోయాయి.

**రూ.లక్షల్లో ..** ప్రధాన కూడళ్లల్లో అధికారులు కళాకారులతో జిల్లాలోని చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలు, దేశనాయకుల చిత్రాలను వేయించారు. గుత్తి పురపాలికలోనే ఏకంగా రూ.4 లక్షలు ఖర్చు చేసి చిత్రాలు గీయించారు. స్థానిక మన్రోసత్రం గోడలకు పట్టుకేశవపిళ్లై, సర్ థామస్‌మన్రో, కృష్ణదేవరాయలు, లేపాక్షి, తిమ్మమ్మ మర్రిమాను తదితర చిత్రాలు వేశారు. ఆ చిత్రాలతోపాటు ఈత చెట్లను పెంచారు. ఇప్పుడా వన్నె చిత్రాలు మసకబారాయి. ఆయా పనుల్లో కమీషన్లు దండుకున్నా రన్న ఆరోపణలు ఉన్నాయి. గుత్తి–అనంతపురం రోడ్డులో విభాగినుల మధ్య మొక్కలు నాటారు. ఇప్పుడు అవేవీ లేవు. తాజాగా మళ్లీ రూ.21 లక్షలతో మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో వైకాపా పురపాలిక అధ్యక్షుల వార్డుల్లో మాత్రమే గుంతలు తీయించి మొక్కలు నాటి మమ అనిపించారు. ఎక్కడా నాటి మొక్క ఎదిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రూ.లక్షలు గుంతల పాలయ్యాయి. సందరీకరణ లో భాగంగానే గుత్తి నుంచి గుత్తిఆర్.ఎస్.వరకు రూ.40 లక్షలతో మూడు కి.మీ.ల మేర హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయించారు. వీటి నిర్వహణ సరిగా లేదు.

**పచ్చదనాన్ని సంరక్షిస్తాం..జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

పచ్చదనాన్ని సంరక్షిస్తాం. గతంలో జరిగిన మొక్కల పెంపకం, సుందరీకరణ పనులు విషయం నాకు తెలీదు. గుత్తిలో విభాగినులను విస్తరించి వాటిలో మొక్కలు నాటుతాం. ఇప్పటికే మొక్కల పెంపకానికి రూ.21లక్షలతో పనులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో టెండర్లు నిర్వహించి పనులను గుత్తేదారుడికి ఇచ్చాం. త్వరలోనే పనులు చేపడతాం.

# దుర్గంలో కబ్జాపర్వం



రాయదుర్గం: మున్సిపాల్టీలో ఒక ఎకరాలో లేఅవుట్ వేయాలంటే 10 శాతం స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వదలాలి. సదరు స్థలాల్లో పాఠశాల, కమ్యూనిటీ భవనాలు, పార్కులు, ఆధ్యాత్మిక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. అవి కబ్జాకు గురైతే సామాజిక అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతాయి.రాయదుర్గంలో అధికారికంగా వేసిన 29 లే అవుట్లలో సామాజిక అవసరాలకు స్థలాలు వదిలినా.. కనుమరుగు అవుతున్నాయి. యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు.

రాయదుర్గం పట్టణం పరిధిలో సామాజిక స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ద్వితీయ శ్రేణిస్థాయి నాయకులతోపాటు వారి అనుచరులు రూ.లక్షలు విలువ చేసే స్థలాలను ఆక్రమించి.. నిర్మాణాలు చేపట్టి.. విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతుల్లేకుండా నిర్మాణాలు సాగిస్తూ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పైగా కొందరు మున్సిపల్ సిబ్బంది లంచం తీసుకుని సదరు నిర్మాణాలకు రహదారులు, కాలువల సౌకర్యం కల్పిస్తుండటం గమనార్హం.

**సర్కారువీ వదల్లేదు..**గతంలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం వేసిన 11 ఇందిరమ్మ, జగనన్న లేఅవుట్లలో సామాజిక స్థలాలు వదిలారు. అవి సైతం ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిని రెవెన్యూ శాఖ అప్పగించలేదని చెప్పి మున్సిపల్ అధికారులు తప్పించుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు అయ్యాయంటే సదరు స్థలాలు మున్సిపాల్టీ పరిధిలోకి వెళ్లినట్లేనని రెవెన్యూ అధికారులు అంటున్నారు. దీంతో అక్రమార్కులకు అడ్డు చెప్పేవారే లేకుండా పోయారు. నర్సోజికుంట, వేంకటేశ్వరమాన్యం, శాంతినగర్, డ్రైవర్స్ కాలనీల్లో సామాజిక స్థలాలు ఎక్కువ శాతం కనుమరుగవగా.. కొన్నింటికి మాత్రమే కంచెలు వేశారు.

**తొలగింపునకు చర్యలు తీసుకుంటాం**

మురళీమోహన్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, రాయదుర్గం
సామాజిక స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధ్యులకు నోటీసులు ఇస్తాం. రెవెన్యూ, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే చేసి.. స్థలాలు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటాం.

# నిధులు రాక.. నిర్మాణాలు సాగక



ధర్మవరం : శ్రీసత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన భవనాలు లేక చిన్నారులు ఇరుకు గదుల్లో అల్లాడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినా.. సకాలంలో నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అందులో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పక్షిగూళ్లకు నిలయాలుగా మారుతున్నాయి. సొంత భవనాలు లేక ఉన్నవి నిర్మాణం పూర్తికాక పోవడంతో చిన్నారులు పడుతున్న ఆగచాట్లు అన్నిఇన్నీ కావు. పూర్వ ప్రాథమిక విద్య (నర్సరీ)ను నేర్చుకోవాల్సిన చిన్నారులు సొంత భవనాలు లేక అద్దె వాటిలోనే నరకయాతన అనుభవిస్తున్నారు.

**ఆర్భాటంగా ప్రారంభించి..**

గ్రామాల్లో రెండు, మూడు ఆపైన ఉన్న కేంద్రాలను విలీనం చేసి అందరిని ఒక్కచోట చేర్చాలనే లక్ష్యంతో నాడు–నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ పనులను స్థానికంగా ఉన్న ఐసీడీఎస్ సిబ్బంది పర్యవేక్షణలో పంచాయతీరాజ్ శాఖకు అప్పజెప్పింది. అధికారులు ఆర్భాటంగా పనులు ప్రారంభించారు. బిల్లులు ఏ విధంగా మంజూరు చేశారో.. వాటి ఆధారంగా పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో బిల్లులు జమ చేయకపోవడంతో అధికారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు : 2,824
సొంత భవనాలు : 1,015
అద్దెకు తీసుకున్నవి : 1,266
అద్దె లేనివి : 543
నిధులు లేక ఆగినవి : 117
ఆరు నెలల నుంచి 3 సంవత్సరాలలోపు చిన్నారులు : 47,136
3–6 సంవత్సరాల వారు : 38,093
బాలింతలు : 8,483
గర్భిణులు : 9,797

**ప్రతిపాదనలు పంపాం**

అంగన్‌వాడీ కేంద్రాల ప్రస్తుత పరిస్థితులపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తాం.
ప్రమీల, ఐసీడీఎస్ పీడీ

# మీ నిర్లక్ష్యంతో బిడ్డ ప్రాణం పోయింది?

అనంతపురం : 'పని చేయమంటే.. గొడవ పడతారా? ఏం తమాషా చేస్తున్నారా? అందరినీ ఇంటికి పంపిస్తా... మీ నిర్లక్ష్యం.. నిర్వాకం మూలంగా ఓ బిడ్డ ప్రాణం పోయింది' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంచాలకుడు వేణుగోపాల్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశు గృహలో 32 రోజుల మగ బిడ్డ మృతి ఘటనా నేపథ్యంలో ఆయన అనంతకు చేరుకున్నారు. సహాయ కలెక్టర్ సచిన్ రహార్, ఐసీడీఎస్ పీడీ నాగమణితో కలిసి శిశుగృహాన్ని పరిశీలించారు. అక్కడే సిబ్బందితో దాదాపు మూడు గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు.మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, సహాయకులతో బిడ్డ మృతి ఘటనను ఆరా తీశారు. 'శిశువును శిశుగృహానికి తీసుకొచ్చినపుడు 1.7 కిలోల బరువు ఉంది. నెల రోజుల్లో 2.75 కిలోలకు పెరిగిందని సిబ్బంది వివరించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడు బిడ్డ ఎలా చనిపోయిందని ప్రశ్నించగా, సిబ్బంది నుంచి సమాధానం రాలేదు. ఒకానొక దశలో స్వయాన డైరెక్టర్ సమక్షంలోనే సిబ్బంది వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. శిశుగృహ పర్యవేక్షణ విషయంలో పీడీ తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మిషన్ శక్తి సమన్వయకర్తగా నియమిస్తే.. ఇదేనా మీ నిర్వాకం. పనితీరు' అంటూ అక్కడే ఉన్న బీఎన్ శ్రీదేవిపైనా మండిపడినట్లు తెలిసింది. ఐసీడీఎస్ అనుబంధ సమగ్ర బాలల పరిరక్షణ సమితి(ఐసీపీఎస్) డీసీపీఓ మంజునాథ్, పీఓలు, ఇతర సిబ్బంది పనితీరు ఏమాత్రం బాగోలేదన్నారు. జువెనైల్ చట్టం ప్రకారం బిడ్డ మృతి చెందితే పంచనామా చేయాలని తెలీయదా అని ప్రశ్నించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని కటువుగా అడిగారు.

**సీఎం ఫోన్?** శిశుగృహలో సిబ్బందిని విచారిస్తున్న సమయంలో స్వయంగా సీఎం చంద్రబాబు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ఫోన్ చేసినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో బాధ్యులపై చర్యలు ఉంటాయని డైరెక్టర్ తెలిపారు.

# 'బెంగ'ళూరు జాతీయదారి

కల్లూరు : వెల్దుర్తి నుంచి కర్నూలుకు గతంలో 40 నిమిషాలు పట్టేది.. ప్రస్తుతం 1.30 గంటలకుపైగానే పడుతోంది.. డోన్ నుంచి కర్నూలు వెళ్లేందుకు రెండు గంటలు పడుతోంది. ఇదెక్కడో మారుమూల రోడ్డు కాదండోయ్.!! 100 కి.మీ. వేగంతో వెళ్లేలా నిర్మించిన హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణం.!! ఉమ్మడి జిల్లాలో 75 కి.మీ. మేర విస్తరించి ఉన్న 44వ నంబరు జాతీయ రహదారిపై నిలువెల్లా గుంతలు నెలకొన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడుగుకో గుంత నెలకొంది. వాటిని దాటలేక వాహనదారులు అవస్థలు పడుతున్న వైనం బృందం పరిశీలనలో తేలింది.

**లేయర్ మరచి.. ప్యాచ్‌లతో సరిపెట్టి**

ప్రతి 50 కి.మీ. ఒక టోల్‌గేటు ఏర్పాటుచేశారు. అమకతాడు టోల్‌ప్లాజా పరిధిలో నిత్యం 10 వేల వాహనాలు తిరుగుతాయి. నిత్యం రూ.30 లక్షల ఆదాయం వస్తుంది.
నిర్వహణదారులు వాహనచోదకుల నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు సేవలు అందించడం లేదు.
నిత్యం రహదారిని పరిశీలించి దెబ్బతిన్న ప్రాంతంలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇవేవీ పట్టించుకోవడం లేదు.
నిబంధనల ప్రకారం 2017లో కొత్త లేయర్ వేయాల్సి ఉంది. ఎనిమిదేళ్లు దాటినా ఇప్పటికీ చేపట్టలేదు. దెబ్బతిన్న ప్రాంతాల్లో తారు పూసి వదిలేస్తున్నారు. వర్షం పడినప్పుడల్లా ఇదే సమస్య ఎదురవుతోంది.

**అదుపు తప్పుతున్న వాహనాలు**



ఇటీవల కురిసిన వర్షాలకు ఈ మార్గం పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి.వేగంగా వచ్చే వాహనదారులు గుంతలు తప్పించే క్రమంలో అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. మరికొందరు ఉన్నఫళంగా బ్రేకులు వేయడంతో వెనక వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. వెల్దుర్తి సమీపంలోని జాతీయ రహదారిపై 20 రోజుల కిందట ముందు వెళుతున్న ఓ లారీ చోదకుడు ఉన్నట్లుండి బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న ప్రైవేటు బస్సు వేగాన్ని అదుపు చేయలేక లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు.

**నిర్వహణ దారిణం**

డోన్ నుంచి కర్నూలు వైపు వచ్చే దారిలో 74 గుంతలు ఉన్నాయి. గుత్తిరోడ్డు పైవంతెన నుంచి ఉలిందకొండ వరకు తారు లేచి రోడ్డు అధ్వానంగా మారింది.వెల్దుర్తి నుంచి మదార్‌పురం మధ్య కేవలం 5 కి.మీ. పరిధిలోనే 70 వరకు గుంతలు ఉన్నాయి. మదార్‌పురం ఉపరితల వంతెనపై పెద్దపాటి గుంతలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. మంగంపల్లి స్టేజీ సమీపంలో ఏకంగా 120 వరకు గుంతలు ఉన్నాయి.డోన్ మండల పరిధిలో 33 కి.మీ. మేర అడుగుకో గుంత ఉంది.. జగదుర్తి, అమకతాడు, యు.కొత్తపల్లె వద్ద రహదారికి గుంతలు పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.
ప్యాపిలి చెక్‌పోస్ట్ నుంచి అరుణాచలం ట్రాన్స్‌పోర్ట్ వరకు 1 కి.మీ. ఉంటుంది.. ఇక్కడ 65 గుంతలు ఉన్నాయి. ఏనుగుమర్రి గ్రామ సమీపంలో కి.మీ. మేర కనీసం ద్విచక్రవాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది.


# ప్రయోగం దూరం.. ఫలితాలపై ప్రభావం

కర్నూలు : ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి.. అంతకు నెలరోజుల ముందు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు..ఇప్పటికీ చాలా కళాశాలల్లో ప్రయోగ పాఠాలే ప్రారంభించలేదు.. ప్రభుత్వ కళాశాలల్లోని అవసరమైన పరికరాలు లేకపోవడంతో నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇంటర్ బోర్డు అధికారులు రెండేళ్ల కిందటే గుర్తించారు. ప్రైవేటు కళాశాలల్లో వీటి గురించే పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రయోగాలపై దృష్టిపెట్టి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది.

**ఒక్కొక్కరి నుంచి రూ.275 వసూలు**2025– 26 విద్యా సంవత్సరానికి కర్నూలు జిల్లాలో మొదటి ఏడాది 22,886, రెండో ఏడాది 22,284 మంది విద్యార్థులు చదువుతున్నారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి పబ్లిక్ ప్రాక్టికల్స్ నిర్వహణ నిమిత్తం రూ.275 రుసుము వసూలు చేశారు. ఈ సొమ్ముతో నిర్వహించే రోజు విద్యార్థులకు వసతులు కల్పించాలి.

**పనికిరాకుండా మార్చేశారు**

కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 552 మంది విద్యార్థులున్నారు. ఒకటో గదిని జంతు, వృక్ష శాస్త్ర ల్యాబ్‌గా, రెండో గదిలో భౌతిక, రసాయన శాస్త్ర ల్యాబ్‌గా ఏర్పాటు చేశారు. ప్రయోగశాలలో పుస్తకాలు, బెంచీలు, బియ్యం బస్తాలు, చిక్కీలు, వంట సామగ్రి ఉంచడంతో ల్యాబ్ అంతా చెత్తగా మారింది. పరికరాలు విరిగి, పగిలి పాడైపో



యాయి. విద్యార్థులకు ప్రయోగపాఠం కరవైంది.

**ఇక్కడ మరీ దారుణం**

సంజామల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పదుల సంఖ్యలో మాత్రమే ఉండటంతో ఈ విద్యా సంవత్సరం నుంచి అతిథి అధ్యాపకులతో బోధన సాగిస్తున్నారు. భవిష్యత్తులో ఈ కళాశాలను మూసివేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఓర్వకల్లు, సంజామల, అవుకు, బనగానపల్లి, గోనెగండ్ల, పత్తికొండలోని ప్రయోగశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడం గమనార్హం.

**ప్రైవేటులో ఇష్టారాజ్యం**ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు కళాశాలల నిర్వాహకులు రూ.500 వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**వీటిపై దృష్టి ఏదీ**


ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వీరు ప్రాక్టికల్స్ తరగతుల కోసం సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది.

చురకలు



# రకుల్ రెడ్ హాట్ శారీ లుక్ వైరల్

తనకంటే వయసులో చాలా సీనియర్ అయిన అజయ్ దేవగన్ సరసన నటిస్తోంది రకుల్ ప్రీత్ సింగ్. దేదే ప్యార్ దే సీక్వెల్ (దే దే ప్యార్ దే 2) ఇటీవల నిరంతరం చర్చల్లోకి వస్తోంది. ఈ చిత్రంలోని మొదటి పాట జూమ్ పరాబి తాజాగా విడుదలైంది. ఇందులో అజయ్ దేవగన్, రకుల్ ప్రీత్ సింగ్, యో యో హనీ సింగ్ నటించారు. ఇది రొటీన్ సాంగ్.. కానీ దీనిలో హుక్ స్టెప్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ట్రాక్ లో కవ్వాలి వైబ్స్ ఆకర్షించాయి. ఇక పాటలో నర్తించిన స్టార్లు పాదాలతో వైన్ గ్లాస్ ని ఒలికిపోకుండా కదిలించే సీన్ ఆకట్టుకుంది. విడుదలకు ముందే అభిమానులు ఇలాంటి




వాటిని ఆసక్తిగా చూస్తున్నారు. అయితే ఈ పాటలో రకల్, దేవగన్ ల హుక్ స్టెప్ లను మించి రకుల్ గ్లామర్ ఎలివేషన్ కేంద్రక ఆకర్షణగా మారింది. ఎరుపు రంగు కోక రవికెలో రకుల్ ఎంతో అందంగా కవ్విస్తోంది. నాభి అందాలను, మెడ సొగసును ఆవిష్కరిస్తూ రకుల్ క్లాసీ స్టెప్పులతో అదరగొట్టేసింది. ప్రస్తుతం రకుల్ యూనిక్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో సునామీలా దూసుకుపోతోంది. రకుల్ స్వతహాగా ఫిట్‌నెస్ ఫ్రీక్ గనుక, టోన్డ్ అందాలు గుబులు పుట్టిస్తున్నాయి. జూమ్ షరాబి పాటను టి-సిరీస్ - లవ్ ఫిల్మ్స్ సంయుక్తంగా విడుదల చేశాయి. కొందరు మధ్య వయస్కులు నైట్ క్లబ్ లో చేరాక అక్కడ ఎలాంటి రచ్చ చేసారన్నదే ఈ పాట థీమ్. అశ్వీందర్ సింగ్- అజీజ్ నజాన్ రూపొందించిన ఝూమ్ బరాబర్ ఝూమ్ షరాబి అనే కవ్వాలి పాటలో హనీ సింగ్ ప్రదర్శన మరో ఆకర్షణ. దే దే ప్యార్ దే 2 నవంబర్ 14న థియేటర్లలో విడుదల కానుంది.

## శ్రీలీలలో మార్పు.. ఇష్టం లేకపోయినా సరే అలా..!

స్టార్ హీరోయిన్ శ్రీలీల నెక్స్ట్ మాస్ జాతరతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ధమాకా తర్వాత రవితేజ తో కలిసి శ్రీలీల చేసిన సినిమా ఇది. అందుకే ఈ సినిమా మీద చాలా హైప్ ఉంది. ఐతే మాస్ జాతరలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అంటుంది అమ్మడు. మాస్ పాత్రలు చేయాలని ఉంటుంది కానీ తనకు అలాంటి రోల్స్ రావట్లేదని చెబుతుంది శ్రీలీల. ఇక ఈమధ్య తన లుక్ లో మార్పుల వెనక సీక్రెట్ బయట పెట్టింది శ్రీలీల.

**లుక్ మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు..** వరుస స్టార్ సినిమాలతో బిజీ అయిన శ్రీలీల సరైన డైట్ పాటించక కాస్త బొద్దుగా మారింది. అంతేకాదు ఆమెకు అమ్మమ్మ వాళ్లు చేసే అరిసెలు అంటే చాలా ఇష్టమట. ఒంగోలు నుంచి అరిసెలు వస్తే మొత్తం ప్యాకెట్ తినేదాకా లేచేది కాదట శ్రీలీల. ఐతే ఇప్పుడు అలా తినడం మానేసి తన లుక్



మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు చెప్పుకొచ్చింది శ్రీలీల. అందుకే ఈమధ్య అమ్మడు పూర్తిగా స్లిమ్ లుక్ అయ్యింది. ఫుడ్ విషయంలో కండీషన్స్ అప్లై చేసుకుంటున్నా.. ఒక డాక్టర్ గా ఎలాంటి ఫుడ్ తీసుకుంటే బెటర్ అని తెలుసు కాబట్టి అలాంటి ఫుడ్ తోనే మెయింటైన్ చేస్తున్నా అంటుంది శ్రీలీల. తనను చూడటానికి థియేటర్ కి వచ్చే ఆడియన్స్ కి బాగా కనిపించాలి కదా అంటూ తనలో ఈ మార్పు వెనక రీజన్ చెప్పింది శ్రీలీల. రవితేజ మాస్ జాతరలో శ్రీలీల నిజంగానే ప్రేక్షకులను ఇంప్రెస్ చేసేలా ఉంది. తెలుగులోనే కాదు బాలీవుడ్ లో శ్రీలీల తెరంగేట్రం చేసింది. కార్తీక్ ఆర్యన్ తో ఆమె చేస్తున్న సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది.

**గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత..** తెలుగులో టాప్ స్టార్స్ తో నటిస్తున్న శ్రీలీల తనకు పోటీగా వస్తున్న భామలకు టఫ్ ఫైట్ ఇచ్చేందుకు ఇక మీదట గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత ఉన్న రోల్స్ కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. ఐతే శ్రీలీల అనగానే ఆడియన్స్ అందరికీ ఆమె డాన్స్ మాత్రమే గుర్తొచ్చేలా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ స్లిం లుక్ తో మరింత సర్ ప్రైజ్ చేస్తుంది. సౌత్ నుంచి బాలీవుడ్ కి వెళ్లిన హీరోయిన్స్ చాలా తక్కువ ఉన్నారు. ఐతే శ్రీలీల మాత్రం తనకంటూ ఒక సెపరేట్ మార్క్ ఉండేలా చూస్తుంది. కార్తీక్ ఆర్యన్ తో తొలి సినిమా సైన్ చేసిన అమ్మడు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నట్టు తెలుస్తుంది. శ్రీలీల అటు తమిళ్ లో కూడా పరాశక్తి సినిమాలో ఛాన్స్ అందుకుంది. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమాలో రవి మోహన్, అథర్వ మురళి కూడా నటించారు.




# స్టార్ వారసుడితో సందీప్ కిషన్.. అప్డేట్ ఏంటి..?




టాలెంట్ ఉన్నా కూడా లక్ కలిసి రాని యువ హీరోల్లో సందీప్ కిషన్ ఒకడు. దాదాపు కెరీర్ ప్రారంభించి 15 ఏళ్లు అవుతున్నా కూడా కెరీర్ ని నిలబెట్టే ఒక్క సక్సెస్ రాలేదు. కొన్ని సినిమాలు హిట్లు అనిపించుకుంటున్నా క్రేజ్ తీసుకురావడంలో విఫలమవుతున్నాయి. అయినా సరే సందీప్ కిషన్ పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. సందీప్ కిషన్ మజాకా లాస్ట్ ఇయర్ రిలీజ్ అవ్వగా అంచనాలను అందుకోలేదు. నక్కిన త్రినాథరావు మీద ఉన్న నమ్మకంతో సందీప్ ఆ సినిమా చేయగా ప్రీ రిలీజ్ బజ్ బాగున్నా సినిమా మాత్రం ఆశించిన సక్సెస్ అందుకోలేదు.

**సంజయ్ డైరెక్షన్ లో సందీప్ కిషన్..** సందీప్ కిషన్ తో కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ తనయుడు సంజయ్ ఒక సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. సంజయ్ డైరెక్షన్ లో తెరకెక్కనున్న ఈ సినిమా క్రేజీగా ఉండబోతుంది. ఐతే ఈ సినిమా అనౌన్స్ మెంట్ అయితే ఎప్పుడో వచ్చినా షూటింగ్ మాత్రం మొదలు పెట్టలేదు. ఐతే దళపతి విజయ్ పొలిటికల్ గా బిజీగా ఉండటంతో పాటుగా ఈమధ్యనే విజయ్ పార్టీ మీటింగ్ లో తొక్కిసలాట వల్ల కూడా సంజయ్ తొలి సినిమా లాంచింగ్ లేట్ అయ్యిందని తెలుస్తుంది. కోలీవుడ్ సర్కిల్ ఇన్ఫర్మేషన్ ప్రకారం సంజయ్, సందీప్ కిషన్ సినిమా త్వరలోనే సినిమా ఓపెనింగ్ ఉంటుందట. ఈ సినిమాతో పాటు కృష్ణ చైతన్యతో కూడా సందీప్ కిషన్ ఒక సినిమా చేస్తున్నారు. పవర్ పేట పేట టైటిల్ తో ఆ సినిమా వస్తుందని తెలుస్తుంది. ఈ సినిమా జనవరిలో సెట్స్ మీదకు తీసుకెళ్లే ప్లానింగ్ జరుగుతుంది. మొత్తానికి సందీప్ కిషన్ నెక్స్ట్ రెండు సినిమాలు భారీ ప్లానింగ్ తోనే వస్తున్నాడు.

**తమిళ్ లో మాత్రం కచ్చితంగా క్రేజ్..** సంజయ్ తో సినిమా తెలుగులో ఎలా ఉన్నా తమిళ్ లో మాత్రం కచ్చితంగా క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది. బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఎలా ఐతే హీరోగా కాకుండా డైరెక్టర్ గా డెబ్యూ ఇచ్చాడో ఇప్పుడు దళపతి విజయ్ తనయుడు సంజయ్ కూడా డైరెక్టర్ గా ఎంట్రీ ఇస్తున్నారు. సందీప్ కిషన్ తో తెలుగు, తమిళ్ బైలింగ్వెల్ మూవీగా ఈ సినిమా రాబోతుంది. తమిళ్ లో చాలామంది యువ హీరోలు ఉన్నా కూడా సంజయ్ ఏరికోరి తెలుగు యాక్టర్ తో సినిమా చేయడం పట్ల ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తుంది. సంజయ్ తో సందీప్ కిషన్ ఫ్రెండ్ షిప్ ఉన్నట్టు తెలుస్తుంది. సందీప్ తెలుగులో హీరోగా చేస్తూనే తమిళ్ లో సపోర్టింగ్ రోల్స్ కూడా చేస్తూ వచ్చాడు. ధనుష్ సినిమాల్లో సందీప్ కనిపిస్తాడు. ధనుష్ రాయన్ లో కూడా సందీప్ కిషన్ నటించిన విషయం తెలిసిందే.

# రెడ్ డ్రెస్ లో యువత మనసు దోచుకుంటున్న కాత్యాయిని!





'లిటిల్ హార్ట్స్: నో టచింగ్.. ఓన్లీ హార్ట్ టచింగ్' అనే ట్యాగ్ లైన్ తో 2025 సెప్టెంబర్ 5న థియేటర్లలో చిన్న సినిమాగా విడుదల అయింది. రొమాంటిక్ కామెడీ సినిమాగా వచ్చిన ఈ చిత్రానికి ఈటీవీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఆదిత్య హాసన్ నిర్మించారు. సాయి మార్తాండ్ దర్శకత్వంలో మౌళి తనూజ్, శివాని నాగారం, రాజీవ్ కనకాల, అనిత చౌదరి, ఎస్ ఎస్ కాంచీ తదితరులు కీలకపాత్రలు పోషించారు. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. అక్టోబర్ 1 నుండి ఈటీవీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఈ సినిమాలో కాత్యాయిని పాత్ర పోషించి, తన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది శివాని నాగారం. అదృష్టం తలుపు తడితే ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోవచ్చు అనడానికి ఈమె కూడా ఒక చక్కటి ఉదాహరణ అని చెప్పవచ్చు. 2024లో అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ అనే సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఈమె మొదటి సినిమాతోనే గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఊహించిన పాపులారిటీ రాలేదనే చెప్పాలి. ఇక ఇప్పుడు లిటిల్ హార్ట్స్ సినిమాతో కాత్యాయిని పాత్ర పోషించి భారీ క్రేజ్ దక్కించుకుంది అని చెప్పవచ్చు.

ఇందులో తన అద్భుతమైన నటనతో అందరి హృదయాలను దోచుకుంది. అంతేకాదు కుర్రకారు క్రష్ గా కూడా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం హే భగవాన్ అనే సినిమాలో అవకాశం అందుకుంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరొకవైపు సోషల్ మీడియాలో తన క్రేజ్ పెంపొందించుకోవడానికి పలు రకాల ఫోటోలు షేర్ చేస్తోంది. అందులో భాగంగానే రెడ్ కలర్ డ్రెస్ ధరించిన ఈమె అందులో ఘాటు మిర్చిలా అందాలతో ఆకట్టుకుంది. తాజాగా ఈ రెడ్ కలర్ ఫ్రాక్ శివాని నాగారం మేని ఛాయను మరింత పెంచేసింది అని చెప్పవచ్చు. ఈమెను ఇలా చూసేసరికి అభిమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తమ అభిమాన బ్యూటీ రోజుకు మరింత అందంగా మారిపోతుంది అంటూ కామెంట్ చేస్తున్నారు. శివాని నాగారం లిటిల్ హార్ట్స్ సినిమాలోని పాత్ర తనకు మంచి పేరు అందించింది అని తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ ని కూడా కాత్యాయినిగా పెట్టుకుంటానంటూ తెలిపింది ..అంతే కాదు ఇకపై స్క్రీన్ నేమ్ కూడా ఇదే అంటూ చెప్పిన ఈమె.. మరి వచ్చే సినిమాకు ఇదే పేరును కొనసాగిస్తుందా లేక శివాని పేరుగా కంటిన్యూ అవుతుందా అన్నది తెలియాల్సి ఉంది. శివాని నాగారం 1998 ఆగస్టు 25వ తేదీన హైదరాబాద్లో జన్మించింది. ఈమె నటి మాత్రమే కాదు గాయని కూడా.. 2024 లో వచ్చిన ఆరంభం అనే సినిమాలో పాట పాడి మంచి పేరు దక్కించుకుంది . ఏది ఏమైనా చేసింది తక్కువ సినిమాలే అయినా ఈ తెలుగమ్మాయికి అవకాశాలు వరుసగా రావాలి అని అభిమానులు కోరుకుంటున్నారు.

# రష్మిక ప్లేస్ కోసం ఆ ఇద్దరి మధ్య ఫైట్..?

రష్మిక మందన్న ప్రస్తుతం టాలీవుడ్ లోనే కాదు పాన్ ఇండియా లెవెల్ లో అదరగొట్టేస్తున్న అమ్మడు ప్రతి సినిమాను చాలా ప్రెస్టీజియస్ గా చేస్తుంది. ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూనే థామా, ది గర్ల్ ఫ్రెండ్ లాంటి డిఫరెంట్ సినిమాలు కూడా చేస్తుంది రష్మిక. నేషనల్ వైడ్ గా టాప్ రేంజ్ లో దూసుకెళ్తున్న రష్మిక ప్లేస్ ని ఆక్యుపై చేయాలని మిగతా హీరోయిన్స్ తెగ ప్రయత్నిస్తున్నారు.

ముఖ్యంగా టాలీవుడ్ లో రష్మిక ప్లేస్ కి ఇద్దరి భామల మధ్య ఇంట్రెస్టింగ్ ఫైట్ జరగనుంది. ఆ ఇద్దరిలో ఎవరు ఆ ప్లేస్ కు వస్తారన్నది చర్చ నడుస్తుంది.

**పెళ్లిసందడితో ఎంట్రీ ఇచ్చి ధమాకాతో హిట్టు కొట్టి..** రష్మికలానే చలాకీగా ఉంటూ ఆడియన్స్ తో మంచి ఇంటరాక్షన్ కొనసాగిస్తుంది శ్రీలీల. పెళ్లిసందడితో ఎంట్రీ ఇచ్చి ధమాకాతో హిట్టు కొట్టి గుంటూరు కారం, భగవంత్ కేసరి అంటూ తన మార్క్ నటనతో ఆకట్టుకుంటుంది అమ్మడు. శ్రీలీలకు ఉన్న ప్లస్ పాయింట్ డాన్స్ లు అదరగొట్టేస్తుంది. రష్మిక కూడా అదే రేంజ్ లో డాన్స్ చేస్తుంది. అంతేకాదు క్యూట్ లుక్స్ లో రష్మికకు ఏమాత్రం తీసిపోదు శ్రీలీల. ఐతే తను ఎంచుకున్న రోల్స్ తో ఇంకాస్త బలంగా ఇంపాక్ట్ చూపించాల్సి ఉంది శ్రీలీల. రష్మికకు మరో ఆప్షన్ గా మారాలని చూస్తుంది బాలీవుడ్ భామ



భాగ్య శ్రీ బోర్స్. మిస్టర్ బచ్చన్ తో మొదలైన అమ్మడి టాలీవుడ్ ప్రయాణం ఒక్క హిట్టు లేకపోయినా కూడా అమ్మడి క్రేజ్ సూపర్ గా ఉంది. కింగ్ డం మీద చాలా హోప్స్ పెట్టుకున్న భాగ్య శ్రీ ఆ సినిమా తో ఫ్యాన్స్ ని డిజప్పాయింట్ చేసింది. ఐతే ఆంధ్రా కింగ్ తాలూకాతో తెలుగులో తొలి సక్సెస్ అందుకోవాలని చూస్తుంది. అదే జరిగితే మాత్రం భాగ్య శ్రీకి మంచి బజ్ వచ్చే ఛాన్స్ ఉంటుంది.

**రష్మిక ప్లేస్ పై గురి..** ఐతే శ్రీలీల, భాగ్య శ్రీ ఇద్దరు కూడా రష్మిక ప్లేస్ పై గురి పెట్టారు. రష్మిక సినిమాల ఎంపికను చూసి వాళ్లు కూడా అదే తరహాలో సినిమాలు చేయాలని చూస్తున్నారు. ఐతే ఈ ఇద్దరిలో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేసే క్వాలిటీస్ ఉన్నాయి కాబట్టి ఈ ఇద్దరు రష్మిక ప్లేస్ లో కాదు ఆమె రేంజ్ కి వెళ్తారని చెప్పడంలో సందేహం లేదు. రష్మికకు ఈ ఇద్దరితోనే కాదు కన్నడ భామ రుక్మిణి వసంత్ కూడా మరో థ్రెట్ అయ్యేలా ఉంది.

ఇప్పటికే నేషనల్ క్రష్ ట్యాగ్ రష్మిక నుంచి రుక్మిణికి ఇచ్చేస్తున్నారు. ఇక అమ్మడు మరో రెండు మూడు సినిమాలు చేస్తే రుక్మిణి పూర్తిగా రష్మికని ఓవర్ టేక్ చేసే ఛాన్స్ ఉంటుంది. ఐతే ఇలా హీరోయిన్స్ కొత్త స్టార్స్ రాగానే పాత వాళ్లు సైడ్ అవ్వడం చూస్తూనే ఉంటాం. ఐతే ఉన్న వారిలో ఎవరికి ఆ ఛాన్స్ దక్కుతుంది ఎవరు టాప్ చెయిర్ అందుకుంటారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది.

## సంచలన ఫ్రాంచైజీలో పండగ చేస్కో బ్యూటీ!

ఆగ్రా బ్యూటీ సోనాల్ చౌహాన్ కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకూ ఒకేలా సాగుతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీ, బెంగాలీ, తమిళ్ అంటూ నాలుగు భాషల్లోనూ నటించింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. ఎక్కడ అవకాశం వస్తే అక్కడకు వెళ్లి పని చేయడం తప్ప! తనకంటూ ఓ భాష ఉందని నిరూపించుకోలేకపోయింది. అవకాశాలు వస్తున్నా? వాటితో పాటు చిన్నా చితకా విజయాలు అందుకుంటున్నా? స్థిరంగా మాత్రం పని చేయలేకపోతుంది. అయితే ఏడాది కాలంగా ఆ చిన్న పాటి అవకాశాలు కూడా లేవు. చివరిగా గత ఏడాది రిలీజ్ అయిన 'డార్డ్' లో నటించింది. ఆ తర్వాత మళ్లీ మరో సినిమా చేయలేదు. ఈ నేపథ్యంలో అమ్మడు ఏకంగా బంపర్ ఆఫర్ అందుకుంది. సంచలన 'మీర్జాపూర్' ఫ్రాంజెజీలో భాగమవుతుంది. 'మీర్జాపూర్ : దిఫిల్మ్' చిత్రంలో భాగమైనట్లు వెల్లడించింది. అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం సంతోషంగా ఉందంది. ఈ సినిమాలో నటించడానికి



ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపింది. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో పర్హాన్ అక్తర్, రితేష్ సిద్వానీ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'మీర్జాపూర్' కు ప్రత్యేకమైన అభిమానులున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఫాలోయింగ్ ఉన్న సిరీస్ ఇది. పంకజ్ త్రిపాఠీ, అలీ జాపర్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠీ నటించిన 'మీర్జాపూర్' ఫ్రాంచైజీ మూడు సీజన్లు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడిదే సిరీస్ ను గుర్మీత్ సింగ్ సినిమా గా తెరపైకి తేవడం విశేషం. మరి ఈ కథను ఒకే సినిమా గా రిలీజ్ చేస్తాడా? రెండు భాగాలుగా రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. సినిమాలో వెబ్ సిరీస్ పాత తారగణంతో పాటు, కొత్త నటీనటులు నటిస్తున్నారు. దీనిలో భాగంగా వెబ్ సిరీస్ లో సోనాల్ చౌహాన్ లేకపోయినా? సినిమా లో అవకాశం అందుకో గలిగింది. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ కథ ఉంటుంది. ఇదొక క్రైమ్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. అవి పూర్త యిన వెంటనే పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ సినిమా మొదలయ్యే అవకాశలున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536